

www.andhrajyothy.com వెల (Price) : Rs. 8.00 విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 330



ఆదివారం | 16-3-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: విదియ సా.4.59 తదుపరి తదియ, నక్షత్రం: హస్త ఉ.11.45 తదుపరి చిత్త, వర్జ్యం: రా.8.45-10.33, అమృతఘడియలు: తె. ఉ.6.49, దుర్ముహూర్తం: సా.4.46-5.33, రాహుకాలం: సా. 4.30-6.00, సూర్యోదయం: 6.25, సూర్యాస్తమయం: 6.21

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అక్టోబరు నుంచి ఆకస్మిక తనిఖీలు

చెప్పకుండానే క్షేత్రస్థాయికి వస్తా.. ఎమ్మెల్యేలు పరుగులు పెట్టాల్సిందే

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే లక్ష్యం.. గత పాలకులతో రాష్ట్రంలో విధ్వంసం.. వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశారు

10 లక్షల కోట్ల అప్పులు మోపారు.. 85 లక్షల టన్నుల చెత్తను ఇచ్చారు.. సుస్థిర ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యం

కేంద్ర ప్రభుత్వ సాయంతో రాష్ట్రాభివృద్ధి.. మే నుంచి 'తల్లికి వందనం' అమలు.. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర ఉద్యమం కొనసాగాలి

తణుకులో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

పారిశుధ్య కార్మికులతో కలిసి చీపురు పట్టి పార్కును శుభ్రం చేసిన ముఖ్యమంత్రి

13




'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగంగా తణుకు ఎన్టీఆర్ పార్కులో సీఎం చంద్రబాబు, మంగళగిరి ఎకో పార్కులో మంత్రి లోకేశ్ చీపురు పట్టిన దృశ్యం

అంతులేని కిక్కు లెక్క!

'ఢిల్లీ'ని తలదన్నే మద్యం కుంభకోణం

జగన్ సర్కారులో అడ్డగోలుగా దందా

సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు

మహా మద్య మాయలు

- ప్రభుత్వ ఖజానాకు 18 వేల కోట్ల నష్టం
- ఇందులో తాడేపల్లి ప్యాలెస్‌కే వేల కోట్లు!
- కీలక నేతలు, బేవరేజెస్ అధికారుల నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ వరకు పాత్రధారులు
- మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి సహా ఐదుగురి నుంచి ఇప్పటికే వాంగ్మూలం
- 'పెద్దల' సూచన మేరకే సరుకు 'ఇండెంట్లు'
- షాపులకు సొంత, అస్మదీయ బ్రాండ్లు మాత్రమే
- కమీషన్ల కోసం మద్యం ధరల పెంపు
- అమ్మకాల వివరాలు డేటా ఆపరేటర్ ద్వారా రాజ్ కసిరెడ్డి కార్యాలయానికి చేరవేత
- కమీషన్ల వసూళ్లలో ఆయనే కీలకం
- వైసీపీ ఎంపీ పాత్రపైనా ఆధారాలు



ఉత్పత్తి చేసేది వాళ్లే... సరుకు వాళ్లదే! షాపులు కూడా వాళ్లవే! ఇండెంట్ పెట్టేది వాళ్లే! ఆ సరుకు పంపించేదీ వాళ్లే! ఇదీ... వైఎస్ జగన్ హయాంలో జరిగిన మద్యం స్కామ్ తీరు! తవ్వే కొద్దీ బయట పడుతున్న 'కిక్కు' లెక్కలు! ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఒక 'క్వార్టర్ బాటిల్' లాంటిదైతే, ఏపీలో వైసీపీ పెద్దలు చేసిన మద్యం కుంభకోణం ఒక 'లిక్కర్ మాల్' అంత పెద్దది! జగన్ ప్రభుత్వం నాటి మద్యం కుంభకోణంలో ఖజానాకు అక్షరాలా 18 వేలకోట్ల రూపాయలు నష్టం జరిగినట్టు దర్యాప్తులో తేలినట్టు తెలుస్తోంది. ఇందులో వేల కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కే చేరినట్టు సమాచారం.

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇప్పటిదాకా అనేక కుంభకోణాలు వెలుగు చూశాయి! ఎన్నెన్నో స్కామ్‌లు బయటపడ్డాయి. కానీ... స్కామ్‌లకు మించిన స్కామ్, 'మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్' జగన్ హయాంలోనే జరిగింది. అది... మద్యం కుంభకోణం! వైసీపీ పెద్దలు నడిపించిన స్కామ్‌లో అనేక పాత్రలు, పాత్రధారులు! 'సిట్' విచారణలో భాగంగా అందులో కొందరు నోరు తెరుస్తున్నారు. మద్యం షాపుల్లో ఆర్డర్లు పెట్టినట్లు చెబుతున్న కంప్యూటర్ల నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో

మిగతా 14వ పేజీలో...

"గత ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో అక్రమాలు, కమీషన్ల పర్వం గురించి 'ఆంధ్రజ్యోతి' ఇదివరకే సవివరంగా కథనం ప్రచురించింది. తాజాగా సిట్ దర్యాప్తులో ఇది నిజమని ఆధారాలు లభించాయి. మద్యం స్కామ్‌లో కీలక పాత్రధారులు, సాక్షులు ఇటీవల సిట్‌కు వాంగ్మూలం ఇచ్చారు. మద్యం కంపెనీల నుంచి 'పెద్దల'కు కమీషన్లు చేరవేయడంలో జగన్ ప్రభుత్వంలోని ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది.



ఆ స్కాంలన్నీ బలాదూర్!

తాజాగా కేరళ, తమిళనాడులో చోటుచేసుకున్న మద్యం కుంభకోణాలు కలకలం సృష్టిస్తున్నాయి. అవన్నీ ఒక ఎత్తు కాగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డి పాలనలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణం లోతుల్లోకి వెళుతున్నప్పుడు విచారణ అధికారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఐదేళ్లలో పది వేల కోట్లకు పైగా చేతులు మారినట్టు ఇప్పటివరకు జరిగిన విచారణలో స్పష్టమవుతోంది.

పేదలతో నాసిరకం మద్యాన్ని తాగించి పాపపు సొమ్ము మూటగట్టుకున్న వారికి పేదల ఉసురు తగలదా? నాసిరకం మద్యం తాగి ఎందరో మరణించగా, మరెందరికో కిడ్నీలు పాడయ్యాయి. వీరి ఉసురు ఊరికే పోతుందా? ఈ పాపంలో ఎవరి వాటా ఎంతో తేలడానికి మరికొంత సమయం పట్టవచ్చు.

ఆ పాపాలలో పాలు పంచుకొన్న వారే ఇప్పుడు వాటిని బయటపెడుతున్నారు. పాపం పండుతుంది అనడానికి ఇదొక నిదర్శనం. అది విజయసాయి రెడ్డి రూపంలోనా లేక మరొకరి రూపంలోనా అని తేలడానికి మరికొంత సమయం వేచిచూడాలి.

రజత్ భార్గవ వంటి సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా ఈ కుంభకోణం సాఫీగా జరగడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించారంటే ఆ స్కాం లోతు తెలుస్తోంది. పైనుంచి కింది వరకు ఎవరి వాటాలు వారికి నెలవారీగా అందేవట. ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌ను ప్రభుత్వ సంస్థగా కాకుండా ప్రైవేటు సంస్థలా నడిపారు.

డిస్టిలరీస్ నుంచి లభించిన ముడుపులను కూడా మూల విరాట్ ఆదేశాల ప్రకారం ఎక్కడకు చేర్చాలో అక్కడకు చేర్చేవారు. మద్యం మాఫియా అంటే ఇది కదా? హవాలా వ్యాపారానికే మెళకువలు నేర్పించిన మనుషులు వీళ్లు.

హైదరాబాద్‌లోని ఒక డిస్టిలరీ యాజమాన్యం 200 కోట్ల రూపాయలతో దాదాపు మూడున్నర క్వింటాళ్లు, అంటే 350 కిలోల బంగారు నాణేలను కొనుగోలు చేసింది. సదరు బంగారాన్ని అహ్మద్ అనే వ్యక్తికి ఇవ్వవలసిందిగా సదరు డిస్టిలరీ కంపెనీ ఆథరైజేషన్ లేఖను పద్మావతి జ్యువెలర్స్‌కు ఇచ్చింది. ఏ డిస్టిలరీ కంపెనీ అయినా ముడి సరుకు కొంటుంది. బంగారం ఎందుకు కొంటుంది? అది కూడా 200 కోట్ల రూపాయలతో దాదాపు 350 కిలోల బంగారం ఎందుకు కొంటుంది? దీన్నిబట్టి ఈ కుంభకోణంలో ఎన్ని వేల కోట్ల రూపాయలు చేతులు మారాయో అర్థం చేసుకోవచ్చు.

సాయి రెడ్డిని కూడా అధికారులు త్వరలోనే విచారణకు పిలుస్తారు. అప్పుడు ఆయన నిజంగా నోరు విప్పుతారో లేదో చూడాలి. న్యాయాధికారి ఎదుట అధికారులు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం ప్రస్తుతానికి విజయసాయి రెడ్డి ఈ కుంభకోణంలో ఒక నిందితుడిగా ఉన్నారు. మరిన్ని వివరాలు చెబుతానని అంటున్నందున విజయసాయి రెడ్డి ఈ వ్యవహారంలో అప్రూవర్‌గా మారతారా? అనే అనుమానం వస్తోంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

శనివారం రాజధాని అమరావతిలో కన్నుల పండువగా సాగిన శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం

అమరావతిలో వైభవోపేతంగా శ్రీవారి కల్యాణోత్సవం

కనులారా వీక్షించి పులకించిన వేలాది మంది భక్తజనం

14



అమరావతిలో వేంకటేశ్వర స్వామి కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం చంద్రబాబు దంపతులు. చిత్రంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

ఆధ్యాత్మిక నగరి తిరుమలను తలపించిన వెంకటపాలెం

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు

హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్, టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల ఆలయం నుంచి తెచ్చిన 50 వేల చిన్న లడ్డూలు పంపిణీ





బాబోయ్ పసిడి.. మనకొద్దులే

ఆకాశాన్ని తాకుతున్న బంగారం ధరలు

కొనుగోళ్లకు దూరంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు.. పెట్టిపోతల్లో తగ్గిపోతున్న బంగారం

వివాహాలు, ఇతర శుభకార్యాలప్పుడు నగదు, ఇతర కానుకలతో సరిపెడుతున్న సాధారణ ప్రజానీకం

ఇందుకు భిన్నంగా కిలోల కొద్దీ కొంటున్న సంపన్న వర్గాలు

'ఏం వదిన గారు..!! పెళ్లికి మా అమ్మాయికి మీరు ఎన్ని తులాల బంగారం పెడతారు? ఏయే నగలు ఇస్తారు?..' 'ఆ సంగతి సరే కానీ.. మా అబ్బాయికి మీరెన్ని తులాలు పెడతారో ముందు అది చెప్పండి?'.. పెళ్లి ఖాయం చేసుకున్నాక పెట్టిపోతల అంశంలో జరిగే చర్చల్లో సర్వసాధారణంగా వినిపించే మాటలివి.. ఎన్ని తరాలైనా ఈ మాటలు మారలేదు కానీ..వధూవరులకు పెట్టే బంగారం బరువు మాత్రం తులాల నుంచి ప్రస్తుతం గ్రాములకు పడిపోయింది. బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ఇళ్లలో జరిగే పెళ్లి సందడిలో పసిడి కాంతులు తగ్గిపోయాయి..!!

బంగారం ధరలు ఇలానే పెరుగుతూపోతే.. బంగారం మంగళసూత్రాల ఫొటోను ఫోన్‌లో చూపించి పెళ్లి కుమార్తె మెడలో పసుపుతాడు కట్టాల్సిందే..!!

ఒకప్పుడు పెళ్లికి ఎంత ఖర్చవుతుందని లెక్కలేసుకుంటే ఆ బడ్జెట్ చూసి గుండెల్లో దడ పుట్టేది. కానీ, ఇప్పుడు పెళ్లి బడ్జెట్‌లో బంగారం లెక్క చూస్తేనే బీపీ, షుగర్, కరోనా కూడా వచ్చేస్తున్నాయి.. రోజురోజుకూ పెరిగిపోతున్న బంగారం ధరలను, పెళ్లి ఖర్చులతో లింక్ చేస్తూ చక్కర్లు కొడుతున్న జోకులివి. నవ్వుకోవడానికి బాగానే ఉన్నా ప్రస్తుత పరిస్థితులు నిజంగా ఇలానే ఉన్నాయి. బంగారం ధరలు రోజురోజుకి పెరిగిపోతుండడంతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు బంగారం పేరు చెబితేనే 'అయ్య బాబోయ్' అనేలా పరిస్థితులు వచ్చాయి. భారతీయులు ముఖ్యంగా

మిగతా 2వ పేజీలో...

రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి నిరాకరణ

12

మళ్లీ విధి విధానాలు జారీ చేయాలని నిర్ణయం

గ్రహణాలు తారుమారు!



భూమికి చంద్రగ్రహణమే

కానీ.. 'బ్లూ ఘోస్ట్'కు సూర్యగ్రహణం 2

శనివారం వేకువజామున రోదసిలో ఘటన




హత్యకు గురైన రామకృష్ణ, చంపి పారిపోతున్న వెంకటరమణ

టీడీపీ కార్యకర్త దారుణ హత్య

పట్టపగలు.. ఇంటి ముందే వేటకొడవలితో నరికి చంపిన పెద్దిరెడ్డి అనుచరుడు

ప్రాణహానిపై ముందే ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసు అధికారులు

2

న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాటం



న్యాయం లభిస్తుందన్న నమ్మకముంది

సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోతున్నారు

వారిని రాష్ట్ర ప్రభుత్వమే రక్షించాలి

నిందితుల్లో ఒక్కరు తప్ప అందరూ బయట స్వేచ్ఛగానే జీవిస్తున్నారు: సునీత

పులివెందుల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తన తండ్రి, జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు సంబంధించి ఆరేళ్లగా న్యాయం కోసం పోరాడుతున్నామని కుమార్తె సునీత పేర్కొన్నారు. తమ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్న ఆశ ఉందన్నారు. శనివారం వివేకా 6వ

మిగతా 12వ పేజీలో...

214 మంది పాక్ సైనికులను చంపేశాం

» బలోచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన

ఇస్లామాబాద్, మార్చి 15: పాకిస్థాన్‌లో రైలును హైజాక్ చేసిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) సంచలన ప్రకటన చేసింది. తమ వద్ద బందీలుగా ఉన్న మొత్తం 214 సైనికులను చంపేశామని, పాకిస్థాన్ ఆర్మీకి తామిచ్చిన గడువు ముగిసినందున ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. బీఎల్ఏ వద్ద బందీలుగా ఉన్న అందర్నీ విడుదల చేశామన్న పాక్ ఆర్మీ ప్రకటనను ఖండించింది. ఈ మేరకు బీఎల్ఏ అధికార ప్రతినిధి జీయాంద్ బలోచ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "యుద్ధ ఖైదీల మార్పిడికి మేమిచ్చిన 48 గంటల గడువును పాక్ దళాలు పట్టించుకోలేదు. ఫలితంగా 214 సైనికులకు మరణ శిక్ష విధించాల్సి వచ్చింది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటుకు ఆధార్ లింక్‌పై 18న ఈసీ భేటీ

న్యూఢిల్లీ, మార్చి 15: నకిలీ ఓటరు కార్డులకు చెక్ పెట్టేందుకు వాటికి ఆధార్‌ను లింక్ చేయడంపై ఈనెల 18న కేంద్ర హోంశాఖ, యూఐడీఏఐ సీఈవో, శాసన వ్యవహారాల విభాగం కార్యదర్శితో ఎన్నికల సంఘం(ఈసీ) సమావేశం నిర్వహించనుంది. అయితే, ఈ సమావేశం కేవలం కంటి తుడుపు చర్యేనని, నకిలీ ఓటరు కార్డులపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు ఓటరు కార్డుకు ఆధార్ లింక్ అంటూ దానిపై సమావేశం పెడుతోందని టీఎంసీ ఆరోపించింది. మరోవైపు, ఆధార్, ఓటరు కార్డు లింక్ చేయడంపై మార్చి 30లోగా సలహాలివ్వాలని అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలను ఈసీ ఇప్పటికే కోరింది.

సీఈ20 క్రయో ఇంజన్ పరీక్ష సక్సెస్




ఇస్రో మహేంద్రగిరిలో నిర్వహించిన సీఈ20 క్రయో పరీక్ష

సూళ్లూరుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మన బాహుబలి రాకెట్ 'జీఎస్ఎల్వీ మార్క్3'లో పలు మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటిదాకా క్రయో ఇంజన్ దశను 25 టన్నులతో రూపొందిస్తుండగా దాన్ని 20 టన్నులకు కుదించి నిర్మించడానికి మార్గం సుగమం కాబోతోంది. ఇందుకు సంబంధించిన సీఈ20 క్రయో ఇంజన్ పరీక్షను మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ)లో విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ఎక్స్‌లో పేర్కొంది. ఎల్‌వీఎం3 రాకెట్ క్రయోజనిక్ అప్పర్ స్టేజ్‌లో ఉపయోగించే స్వదేశీ క్రయోజనిక్ ఇంజన్ (సీఈ20) కోసం ఇప్పటి వరకు ఐపీఆర్‌సీలో హై-అల్టిట్యూట్ టెస్టను (హెచ్ఏటీ) ఐదుసార్లు నిర్వహించారు. నాజిల్ ప్రొటెక్షన్ సిస్టమ్‌ను ఉపయోగించి ఇంజన్‌ను 100 సెకన్ల పాటు మండించి క్రయో పరీక్ష విజయవంతంగా చేశారు. ఆరోసారి చేపట్టిన క్రయో దశ హాట్‌టెస్ట్ విజయవంతం కావడంతో భవిష్యత్ ప్రయోగాలకు మార్గం సుగమమైంది. ఇస్రో తలపెట్టిన ఈ పరీక్ష ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి మరింత సౌకర్యంగా, సులువుగా చేర్చేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఈ పరీక్ష విజయవంతంతో భవిష్యత్‌లో ఇస్రో ఆధ్వర్యంలో జరిగే భారీ ప్రయోగాలకు మరింత బలాన్నిస్తుందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా చెబుతున్నారు.

ఎవ్వరినీ వదిలిపెట్టం

» నాపై తప్పుడు కేసులు పెట్టినవారి పేర్లు బయటపెడతా.. ప్రత్యర్థులంతా జైలుకే

» నమ్మకద్రోహులను తరిమేస్తాం: ట్రంప్

» రాజధాని వాషింగ్టన్ రోడ్లపై గుంతలు

» వాటిని మోదీ, ప్రపంచ దేశాధినేతలు చూడకూడదనుకున్నానని వ్యాఖ్య



వాషింగ్టన్/న్యూయార్క్, మార్చి 15: తనపై క్రిమినల్ కేసులు పెట్టిన వారందరి పేర్లు బయటపెడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శపథం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులంతా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. శుక్రవారం అమెరికా న్యాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అవినీతిపరులు, నమ్మకద్రోహులను తమ ప్రభుత్వం నుంచి తరిమికొడతామని హెచ్చరించారు. వారి దారుణమైన నేరాలు, తీవ్రమైన దుష్ప్రవర్తన గురించి ప్రజలకు తెలిసేలా వారి చర్యలను బట్టబయలు చేస్తామన్నారు. 2021లో అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా దళాల ఉపసంహరణ దేశ చరిత్రలోనే అత్యంత అవమానకరమైన క్షణంగా ఆయన అభివర్ణించారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న వ్యక్తులు, బైడెన్ ప్రభుత్వంలోని అధికారులను జైల్లో పెట్టాలని ట్రంప్ వ్యాఖ్యానించారు. బైడెన్ ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా న్యాయశాఖను ఒక ఆయుధంగా వాడుకుందని, న్యాయ శాఖను అన్యాయశాఖగా మార్చిందని ఆరోపించారు. ఆ రోజులు ముగిసిపోయాయని, అవి ఎప్పటికీ తిరిగిరావని పేర్కొన్నారు. అమెరికాలో న్యాయాన్ని పునరుద్ధరించడమే తన ప్రాధాన్యమని ప్రకటించారు. న్యాయశాఖను నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా ఉంచుతామని చెప్పారు. తనకు వ్యతిరేకంగా కేసుల్లో పాల్గొన్న ప్రాసిక్యూటర్లు, అధికారుల పేర్లను ఆయన ప్రస్తావించారు. వారందరినీ పనికిమాలిన జనంగా అభివర్ణించారు. కాగా, అమెరికా అధ్యక్షుడు న్యాయశాఖను సందర్శించడం గత దశాబ్ద కాలంలో ఇదే తొలిసారి.


సుందర నగరంగా వాషింగ్టన్ డీసీ

వాషింగ్టన్ డీసీలోని రోడ్లపై గుంతలు, గుడారాలు, గోడలపై రాతలు భారత ప్రధాని మోదీకి, ఇతర ప్రపంచ నాయకులకు కనిపించకూడదని భావించానని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'మేం మా నగరాన్ని శుభ్రం చేస్తున్నాం. రాజధానిని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే ఇక్కడున్న గుడారాలను తొలగిస్తున్నాం. గోడలపై రాతలను చెరిపివేస్తున్నాం' అని తెలిపారు. రాజధానిని ప్రక్షాళన చేయడంలో వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌసర్ చక్కటి పనితీరును కనబరిచారని ట్రంప్ ప్రశంసించారు. 'స్టేట్ డిపార్ట్‌మెంట్ ఎదురుగా చాలా గుడారాలు ఉన్నాయని చెప్పిన వెంటనే వాటిని తొలగించారు. ప్రపంచం మొత్తం మాట్లాడుకొనేలాంటి రాజధానిని మేం కోరుకుంటున్నాం' అని ఆయన స్పష్టం చేశారు. 'భారత ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడు, యూకే ప్రధాని వీరంతా ఇటీవల నన్ను కలవడానికి అమెరికా వచ్చారు. ఆ సమయంలో వాషింగ్టన్‌లో రోడ్లపై గుంతలు, గోడలపై రాతలు, గుడారాలు, విరిగిన బ్యారికేడ్లు వారికి కనిపించడం నాకు ఇష్టం లేదు. అందుకే అవేమీ లేకుండా నగరాన్ని సుందరంగా మార్చేశాం. రాజధానిని నేరరహితంగా మార్చనున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

41 దేశాలపై ట్రంప్ 'ప్రయాణ నిషేధం'!

అనేక దేశాల పౌరులపై ప్రయాణ ఆంక్షలు విధించే అంశాన్ని ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనికి సంబంధించిన ఒక అంతర్గత మెమో తాజాగా వెలుగు చూసింది. అయితే ఈ జాబితా తాత్కాలికమేనని, విదేశాంగ మంత్రి రూబియో ఆమోదం తర్వాత దీనిలో మార్పుచేర్పులకు అవకాశం ఉందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అమెరికా ఉన్నతాధికారి ఒకరు మీడియాకు వివరించారు. ఆ మెమోలో ఉన్న సమాచారం ప్రకారం... ట్రావెల్ బ్యాన్ విధించాలని భావిస్తున్న 41 దేశాలను మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటి విభాగంలో ఉన్న పది దేశాలకు వీసాల జారీని పూర్తిగా నిలిపివేస్తారు. ఈ జాబితాలో అఫ్ఘానిస్థాన్, క్యూబా, ఇరాన్, లిబియా, ఉత్తర కొరియా, సోమాలియా, సూడాన్, సిరియా, వెనిజులా, యెమన్ ఉన్నాయి. ఇక రెండో విభాగంలోని ఐదు దేశాల వారికి పాక్షిక వీసా సస్పెన్షన్ అమలు చేస్తారు. పర్యాటక, విద్యార్థి, మరికొన్ని వీసాల జారీపై దీని ప్రభావం ఉంటుంది. ఈ జాబితాలో ఎరిత్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ ఉన్నాయి. అలాగే మూడో విభాగంలో ఉన్న 26 దేశాలు నిర్ణీత కాలవ్యవధిలోగా అమెరికా సూచించిన సమస్యలను పరిష్కరించుకోకపోతే వాటి పౌరులకు వీసాల జారీని పాక్షికంగా నిలిపివేస్తారు. ఈ జాబితాలో పాకిస్థాన్, భూటాన్, కాంబోడియా, చాద్, గాంబియా, వనవాటు తదితర దేశాలు ఉన్నాయి.

లోకం తీరు



హెచ్-1బీ నిబంధనలు మరింత కఠినం!

» అమెరికా విదేశాంగ మంత్రి రూబియో



న్యూఢిల్లీ, మార్చి 15: హెచ్-1బీ వీసా నిబంధనలను అమెరికా మరింత కఠినతరం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ దేశ విదేశాంగ మంత్రి రూబియో వలస విధానానికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. వీసాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు భిన్నంగా ఉంటాయని, అవి 'విదేశీ వ్యవహారాల' కింద ఉండాలని ఆయన పేర్కొన్నారు. అంటే దీనర్థం, వారు ప్రజల అభిప్రాయాలు, కొత్త నియమాల తయారీ ప్రక్రియలో మార్పును ప్రకటించే సమయంలో ఇవాల్సిన నోటీసును విస్మరించొచ్చు. దీని వలన అమెరికాలో పనిచేయాలని, చదువుకోవాలని, ఆ దేశంలో పర్యటించాలని అనుకొనే భారతీయులు భారీ మార్పులను చవిచూసే అవకాశం ఉంది. వీసా ఆమోదాలు, పునరుద్ధరణ విషయంలో యాజమాన్యాలు, ఉద్యోగస్తులు అంతరాయం ఎదుర్కొనే అవకాశం ఉన్న నేపథ్యంలో హెచ్-1బీ నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియపై అనిశ్చితిని పెంచుతుంది. 'అమెరికా సరిహద్దుల గుండా ప్రజల ప్రవేశం, నిష్క్రమణను, వస్తువులు, సేవలు, డేటా, టెక్నాలజీ, ఇతర వస్తువుల బదిలీని నియంత్రించడానికి ఫెడరల్ ప్రభుత్వంలోని ఏ ఏజెన్సీ అయినా నిర్వహించే అన్ని ప్రయత్నాలను.. అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్, 5 యూ.ఎస్.సీ. 553, 554 ప్రకారం విదేశీ వ్యవహారాల విధిగా నిర్ధయిస్తున్నాను' అని రూబియో శుక్రవారం ఫెడరల్ రిజిస్టర్‌లో పబ్లిష్ చేసేందుకు షెడ్యూల్ చేసిన నోటీసులో పేర్కొన్నారు. ప్రస్తుతం, ఏదైనా ముసాయిదా నిబంధనలపై ఆసక్తి గలవాళ్లు అభిప్రాయాలు వెల్లడించేందుకు 30-60 రోజుల వరకు సమయం ఉంది. నిబంధనల ప్రకారం ఫెడరల్ ఏజెన్సీలు ఆ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని, తుది నిబంధనల్లో వారు లేవనెత్తిన అంశాలపై స్పందించాల్సి ఉంటుంది.

ఎట్టెట్టా.. గ్రహణాలు తారుమారు!

న్యూఢిల్లీ, మార్చి 15: సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి అడ్డుగా ఉంది కనుక భూమి నీడ చంద్రుడిపై పడి.. సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించింది. కానీ... 'బ్లూ ఘోస్ట్' ల్యాండర్ చంద్రుడిపై ఉంది. సూర్యుడికి భూమి అడ్డుగా రావడంతో ల్యాండరుకు సూర్యగ్రహణ దర్శన భాగ్యం కలిగింది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున 2.25 గంటలకు సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి రావడంతో.. చంద్ర గ్రహణం ఏర్పడింది. చంద్రుడిపై నున్న 'బ్లూ ఘోస్ట్' లూనార్ ల్యాండర్.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య భూమి రావడంతో ఏర్పడ్డ సంపూర్ణ సూర్య గ్రహణ దృశ్యాలను చిత్రీకరించింది. ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ పంపిన ల్యాండర్ చిత్రీకరించిన ఈ దృశ్యాల్లో భూమి కదులుతున్న తీరు స్పష్టంగా రికార్డ్ అయ్యింది. చంద్రుడి నుంచి కనిపించే సూర్య గ్రహణాన్ని చిత్రీకరించడం ఇది మొదటిసారి కాదు. కాగా.. తాజా చంద్ర గ్రహణం అమెరికా, ఆఫ్రికా, ఐరోపాలోని పశ్చిమ దేశాలు, న్యూజిల్యాండ్, రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించింది.

సునీతను తీసుకువచ్చేందుకు నింగిలోకి ఫాల్కన్-9



వాషింగ్టన్, మార్చి 15 : దాదాపు తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోనే ఉండిపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అతి త్వరలో భూమికి తిరిగి రానున్నారు. సునీతా విలియమ్స్‌తోపాటు ఐఎస్ఎస్‌లో ఉన్న బచ్ విల్మోర్‌ను భూమికి తీసుకువచ్చేందుకు నాసా, స్పేస్‌ఎక్స్ తలపెట్టిన క్రూ-10 మిషన్‌లో తొలి అడుగు విజయవంతంగా పడింది. ఈ మిషన్‌లో భాగంగా ఫాల్కన్9 రాకెట్.. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌తో భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4:33 గంటలకు కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ స్పేస్‌క్రాఫ్ట్‌లో మెక్‌క్లెయిన్, నికోల్ ఆయర్స్, టకుయా ఒనిషీ, కిరిల్ పెస్కోవ్ అనే నలుగురు వ్యోమగాములు ఉన్నారు. వీరు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. ఐఎస్ఎస్‌లో ప్రస్తుతం తాము నిర్వహిస్తున్న బాధ్యతలను కొత్తగా వచ్చిన బృందంలోని వారికి అప్పగించిన తర్వాత సునీత, విల్మోర్ అదే డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో భూమికి తిరుగు ప్రయాణమవుతారు. మరోవైపు, స్టార్‌షిప్ రాకెట్ ద్వారా 2026 చివరిలో అంగారక యాత్ర చేపట్టనున్నట్లు స్పేస్ ఎక్స్ సీఈవో మస్క్ ప్రకటించారు. అందులో టెస్లాకు చెందిన మానవరూప 'రోబోట్ ఆప్టిమస్' ఉంటుందని చెప్పారు. 2029లో మానవ సహిత యాత్ర ఉంటుందన్నారు.

టీడీపీ కార్యకర్త దారుణ హత్య

» పట్టపగలు.. ఇంటి ముందే వేటకొడవలితో నరికి చంపిన పెద్దిరెడ్డి అనుచరుడు

» పోలీసులకు వ్యతిరేకంగా గ్రామస్థుల ధర్నా



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వెంకటరమణ(ఫైల్)



మదనపల్లె ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహం



రామకృష్ణ(ఫైల్)

పుంగనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న టీడీపీ నేతల హత్యలు తీవ్ర ఆందోళన రేపుతున్నాయి. కర్నూలులో టీడీపీ నేత సంజన్న హత్య జరిగిన 24 గంటలు కూడా గడవకముందే మరో టీడీపీ కార్యకర్త రామకృష్ణ ఆయన ఇంటి ముందే దారుణ హత్యకు గురయ్యారు. వైసీపీ కార్యకర్త, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు వెంకటరమణ వేట కొడవలితో అత్యంత పాశవికంగా ఈ దారుణానికి ఒడిగట్టారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో తాజాగా జరిగిన ఈ ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. వెంకటరమణ నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని 15 రోజుల కిందట రామకృష్ణ రికార్డు చేసిన వీడియో వైరల్ అవుతోంది. కాగా, విధి నిర్వహణలో విఫలమయ్యారంటూ పుంగనూరు సీఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంలను సస్పెండ్ చేశారు.

ఏం జరిగింది?

పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీలోని కృష్ణాపురానికి చెందిన రామకృష్ణ(50) కొన్ని దశాబ్దాలుగా టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. సీఎంగా చంద్రబాబు గతేడాది ప్రమాణ స్వీకారం చేసే సమయంలో షాపు ఎదుట వేడుకల కోసం కేక్ సిద్ధం చేసి పెట్టుకున్నారు. ఈ సమయంలో వైసీపీ కార్యకర్త త్రిలోక్ బైక్‌పై వచ్చి ఆ కేక్‌ను ధ్వంసం చేయడంతో రామకృష్ణ భార్య దేవమ్మ అడ్డుకున్నారు. దీంతో ఆమెను బైకుతో ఢీకొట్టడంతో ఆమె కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10న రామకృష్ణ తన పొలంలోకి మట్టి తరలిస్తుంటే, వైసీపీ కార్యకర్త వెంకటరమణ తన ఇంటి ఎదుట నుంచి మట్టి ట్రాక్టర్ వెళ్లిందని ఆరోపిస్తూ గొడవకు దిగారు. ఇది ఘర్షణగా మారి పరస్పరం కొట్టుకున్నారు. పుంగనూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. దాన్ని మనసులో పెట్టుకుని వైసీపీ కార్యకర్త వెంకటరమణ 15 రోజుల కిందట రామకృష్ణ పెద్ద కొడుకు శివతో మళ్లీ గొడవ పడి చెయ్యి విరిచారు. ఆ సమయంలో రామకృష్ణను సైతం కొట్టారు. దీంతో పుంగనూరు పోలీసులకు రామకృష్ణ వెంటనే ఫిర్యాదు చేశారు. పోలీసులు మాత్రం 'ఎప్పుడూ ఫిర్యాదులు చేస్తుంటా'వని రామకృష్ణనే మందలించి పంపించేశారు.

ప్రాణహాని అంటూ వీడియో

మానసిక క్షోభతో రామకృష్ణ కొన్ని రోజుల కిందట ఓ వీడియో విడుదల చేశారు. 'టీడీపీ అధికారంలోకి వచ్చినా పార్టీ కోసం పనిచేసిన మాకు పోలీసులు న్యాయం చేయడం లేదు. మా అబ్బాయి చేయి విరిచినా స్పందించడం లేదు. అంతకుముందు నిందితుల్ని పట్టుకొచ్చినా వెంటనే వదిలేశారు. మాకు వెంకటరమణతో ప్రాణహాని ఉంది.' అని వీడియోలో పేర్కొన్నారు.

వేట కొడవలితో విచక్షణారహితంగా నరికి..



రామకృష్ణను హతమార్చి పారిపోతున్న వెంకటరమణ

కృష్ణాపురంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు జరుగుతుండగా.. పోలీసుల సమక్షంలోనే రామకృష్ణతో వెంకటరమణ గొడవకు దిగారు. పోలీసులు ఇరువర్గాలను మందలించి పంపించేశారు. వరుస సంఘటనల నేపథ్యంలో రామకృష్ణను చంపాలని ప్లాన్ చేసిన వైసీపీ కార్యకర్త, మాజీ వలంటీర్ వాణి భర్త వెంకటరమణ శనివారం ఉదయం గోనె సంచిలో వేట కొడవలి పెట్టుకుని రామకృష్ణ షాపు వద్దకు వచారు. రామకృష్ణ చిన్న కొడుకు సురేశ్ అక్కడ ఉండడంతో సంచిలో నుంచి కొడవలి తీసి దాడి చేశాడు. సురేశ్ తప్పించుకుని చేతులు అడ్డు పెట్టడంతో వేట కొడవలి బలంగా చేతులకు తగిలి గాయాలయ్యాయి. దీంతో సురేశ్ పరుగులు తీసి బైకుపై పారిపోయాడు. పొలం పనులు చేసుకుంటున్న రామకృష్ణకు విషయం తెలిసి ట్రాక్టర్‌పై ఇంటికి వచ్చారు. ట్రాక్టర్ దిగే సమయంలోనే రామకృష్ణ తొడపై, కాళ్లపై వేట కొడవలితో వెంకటరమణ విచక్షణారహితంగా దాడి చేశారు. తర్వాత మెడపై నరికి పారిపోయారు. రక్తపు మడుగులో పడిన రామకృష్ణను కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి బయల్దేరగా మార్గమధ్యంలోనే రామకృష్ణ మృతి చెందారు. కాగా, రామకృష్ణ హత్య ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని కృష్ణాపురం గ్రామస్థులు ఆరోపించారు. పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై ధర్నాకు దిగారు. మదనపల్లె ఆస్పత్రి వద్ద కూడా పోలీసుల వైఫల్యంపై ధర్నా చేశారు. 'హత్య చేసిన వెంకటరమణను చంపితేనే నా భర్త మృతదేహాన్ని తీసుకెళ్తామ'ని రామకృష్ణ భార్య దేవమ్మ మదనపల్లె ఆస్పత్రిలో రోదించారు. కాగా, ఈ హత్య వెనుక వ్యక్తిగత, రాజకీయ కక్షలే కారణమై ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

ఎస్పీని సస్పెండ్ చేయాలి: అమరనాథ్‌రెడ్డి

చిత్తూరు జిల్లా ఎస్పీ తీరు సరిగా లేదని, అందుకే టీడీపీ నాయకుల ప్రాణాలు పోతున్నాయని, ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పలమనేరు నియోజకవర్గంలో కూడా వైసీపీతో అంటకాగిన పోలీసులే ఇంకా పనిచేస్తున్నారని చెప్పారు. ఎస్పీ మణికంఠకు చెప్పినా బదిలీ చేయలేదని, దీంతో ఆయనకు ఫోన్ చేయడమే మానేశానన్నారు. "సీఎం చంద్రబాబుకు చెడ్డపేరు వస్తుందనే కారణంగా సైలెంట్‌గా ఉన్నాం. లేకుంటే పెద్దిరెడ్డిని పుంగనూరు నుంచి తరిమికొడతాం" అని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఇదిలావుంటే, పలమనేరు, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమరనాథ్ రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మదనపల్లె ఆస్పత్రిలో రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. హోంమంత్రి అనిత మృతుడి కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

శవం దగ్గర పుట్టిన పార్టీ వైసీపీ

» మరో శవంతో అధికారంలోకి వచ్చింది

» జగన్‌ను జనం ఛీకొట్టినా హత్యా రాజకీయాలు మానడం లేదు

» టీడీపీ కార్యకర్త హత్యపై నారా లోకేశ్ ఆగ్రహం

» రామకృష్ణ హత్యను ఖండించిన పల్లా శ్రీనివాసరావు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్యను మంత్రి లోకేశ్ ఖండించారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'వైసీపీ రాక్షస మూకల దాడిలో గాయపడి మృతిచెందిన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణకు కన్నీటి నివాళులు అర్పిస్తున్నాను. ఈ దాడిలో గాయపడిన రామకృష్ణ కొడుకు సురేశ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాను. ఒక శవం దగ్గర పుట్టి, మరో మృతదేహంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, జగన్మోహన్ రెడ్డిని జనం ఛీకొట్టారు. అయినా హత్యా రాజకీయాలు మానడం లేదు. నిందితులను చట్ట ప్రకారం శిక్షిస్తాం వైసీపీ రక్త చరిత్రకు టీడీపీ సైనికుడిని కోల్పోవడం చాలా బాధాకరం. వారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం' అని లోకేశ్ పేర్కొన్నారు. రామకృష్ణ హత్యను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. వైసీపీని ప్రజలు తిరస్కరించినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదన్నారు.

కేజ్రీవాల్ లాగే స్టాలిన్ కూడా జైలుకే: తంబిదురై

చెన్నై, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మద్యం అవినీతి కేసులో ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ బాటలోనే తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా జైలుకెళ్తారని అన్నాడీఎంకే ఎంపీ తంబిదురై వ్యాఖ్యానించారు. తిరుపత్తూర్ జిల్లా జోలార్‌పేటలో శనివారం అన్నాడీఎంకే బూత్ కమిటీల నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకుందని ఈడీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికే 2జీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అడ్రస్ లేకుండా పోయాయని తెలిపారు. మద్యం అవినీతి కేసులో ఆమ్ ఆద్మీకి చెందిన సిసోడియా, కేజ్రీవాల్ జైలు కెళ్లారని, ఆ కోవలోనే మంత్రి సెంథిల్ బాలాజీ, ఆ తర్వాత స్టాలిన్ జైలుకెళ్లడం ఖాయమన్నారు.

తిరుమలలో క్యూలైన్లను పరిశీలించిన ఏకసభ్య కమిషన్

» భక్తులు క్యూలైన్లలో ప్రవేశించే విధానంపై ఆరా

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ శనివారం తిరుమలలోని క్యూలైన్ల నిర్వహణను పరిశీలించింది. శుక్రవారం తిరుమలకు చేరుకున్న కమిషన్ చైర్మన్ సత్యనారాయణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, లైజన్ ఆఫీసర్ రూప్‌చంద్, కమిషన్ సభ్యులతో కలిసి శనివారం ఉదయం ఔటర్ రింగ్‌రోడ్డులోని సర్వదర్శన భక్తుల క్యూలైన్‌లోకి ప్రవేశించి పరిశీలించారు. అక్కడ భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించే విధానంపై కమిషన్‌కు వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఏఈవో శ్రీహరి, విజిలెన్స్ ఏవీఎస్వో విశ్వనాథం వివరించారు. అనంతరం నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుని క్యూలైన్లను పరిశీలించారు. తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో సీసీటీవీ రూమ్‌ను, తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 13, 14, 15, 16, 17 నంబర్ల కంపార్టుమెంట్లను పరిశీలించారు. భక్తులు కంపార్టుమెంట్‌లోకి ప్రవేశం, నిష్క్రమణ, దర్శనం కోసం నిరీక్షించే విధానాన్ని చూశారు. దర్శనానికి భక్తులను విడిచిపెట్టే క్రమంలో తోపులాటలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే అధికారులను అడిగారు. భవిష్యత్తులో తిరుమలలోని క్యూలైన్లలో తొక్కిసలాటల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

బాబోయ్ పసిడి.. మనకొద్దులే!

(మొదటిపేజీ తరువాయి)

దక్షిణాది రాష్ట్రాల ప్రజల ఇళ్లలో జరిగే పెళ్లిళ్లో బంగారానికి ఉన్న ప్రాధాన్యం అంతాఇంతా కాదు. పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడికి పెట్టే బంగారంపై ఆయా కుటుంబాల్లో పెద్ద చర్చ జరగాల్సిందే. కొన్ని ఇళ్లలో అయితే పెళ్లయ్యాక ఫలానా పండుగకు అబ్బాయికి ఇంత బంగారం పెడతామని, అమ్మాయికి ఫలానా నగ చేయిస్తామనే ఒప్పందాలు కూడా జరుగుతాయి. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేనేలేదు సరికదా.. తమ ఇంట్లో గతంలో జరిగిన వివాహాలప్పుడు ఎంత బంగారం పెట్టామనే విషయాన్ని పెళ్లి మాటల్లో బయటకు చెప్పడానికి కూడా కొందరు సాహసించడం లేదు. పండుగలు, ఇతర శుభకార్యాల అప్పుడు బంగారం పెట్టడం అనే మాటే చాలా ఇళ్లలో అసలు రావడం లేదు.

బంగారం బదులుగా డబ్బులు..!

పెరిగిన రేట్ల వల్ల సామాన్యులు తమ పిల్లల పెళ్లిళ్లకు నాలుగు నుంచి ఆరు తులాలు పెట్టడమే కష్టంగా భావిస్తున్నారు. పిల్లల పెళ్లి కోసం ఎప్పట్నించో ప్రణాళికతో పొదుపు చేసిన వారిని మినహాయిస్తే.. చాలా మంది బంగారం అంశంలో మమ అనిపిస్తున్నారు. బంగారం బదులు నగదు, ఇతర కానుకలు ఇస్తూ పెళ్లి వారిని శాంతింపజేస్తున్నారు. మరికొందరు బంగారానికి సరిపడా ధర ఉండే భూములను ఇస్తున్నారు.

కరోనా తర్వాత నుంచి మొదలు..!

ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.89,790 దాకా ఉంది. ఏదైనా ఆభరణాలు చేయించుకుంటే తయారీ చార్జీలు, తరుగు, పన్నులు అని ఇది రూ.లక్ష దాటేస్తోంది. నిజానికి, కరోనా రాకముందు బంగారం ధరలు అన్ని వర్గాలకు కాస్త అందుబాటులో ఉండేవి. 2019లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.35,220 (జీఎస్టీతో కలిపి) ఉండేది. అయితే, లాక్‌డౌన్‌లో, లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే మరికొద్ది రోజుల్లోనే 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరేలా ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

పడిపోయిన వ్యాపారం

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండడంతో బంగారం దుకాణాల్లో వ్యాపారాలు భారీగా తగ్గిపోయాయి. ఒకప్పుడు రెండు, మూడు తులాలు కొనుగోలు చేసిన వారు కూడా ప్రస్తుతం మూడు, నాలుగు గ్రాములతో సరిపెడుతున్నారని చాలా మంది వ్యాపారులు వాపోతున్నారు. అక్షయ తృతీయ సమయంలో తప్పితే.. ఇతర సందర్భాల్లో మధ్య తరగతి కస్టమర్ల నుంచి గిరాకీ ఉండడంలేదని ముషీరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి తెలిపారు.

తగ్గేదేలే అంటున్న సంపన్నులు..

ముగ్గురు ఆడపిల్లల తండ్రైన సికింద్రాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్లు అనే రైల్వే ఉద్యోగి.. ఎనిమిదేళ్ల క్రితం పెద్ద కూతురికి పెళ్లి చేసినప్పుడు 8తులాల బంగారం పెట్టాడు. నాలుగేళ్ల క్రితం రెండో కూతురి పెళ్లి చేసినప్పుడు కూడా 8తులాలు ఇచ్చాడు. గత నెల చిన్న కుమార్తెకు పెళ్లి చేసినప్పుడు 4తులాలు ఇచ్చాడు. ఇక, కూకట్‌పల్లికి చెందిన కృష్ణారావు అనే ఓ ప్రైవేటు ఉద్యోగి తన మనవడికి మొదటి పుట్టినరోజున బంగారు గొలుసు కానుకగా ఇద్దామని దుకాణానికి వెళ్లగా 10గ్రాముల గొలుసు ధర రూ.80,500 ఉండడం చూసి అవాక్కయ్యాడు. పెరుగుతున్న ధరలను చూసి వెంకటేశ్వర్లు, కృష్ణారావు వంటి సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం అంటేనే వామ్మో అంటుంటే.. సంపన్నులు మాత్రం తగ్గేదేలే అంటున్నారు. తమ ఇళ్లల్లో జరిగే పెళ్లి వేడుకలప్పుడు కిలోల లెక్కన బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆడవాళ్లు ఆపాదమస్తకం రకరకాల నగలు ధరిస్తుంటే.. మగవారు కూడా నగలు ధరించి హడావుడి చేస్తున్నారు. సంపన్నులు కదా మరీ..!!

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

ఏపీ పెట్రోలియం ట్యాంక్ ట్రక్ ఆపరేటర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా వైవీ ఈశ్వరరావు



వైవీ ఈశ్వరరావు, ప్రసాద్, కుమార స్వామి, వెంకట రమణమూర్తి రాజు

విజయవాడ(బెంజిసర్కిల్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం ట్యాంక్ ట్రక్ ఆపరేటర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా వైవీ ఈశ్వరరావు(విజయవాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం ట్యాంక్ ట్రక్ ఆపరేటర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షునిగా డీఆర్ ప్రసాద్(విజయవాడ), కార్యదర్శిగా ఎం.కుమారస్వామి(ఒంగోలు), కోశాధికారిగా ఆర్.వెంకట రమణమూర్తి రాజు(విశాఖపట్నం), ఉపాధ్యక్షులుగా జి.రమేష్(గుంతకల్లు), కె.పెదకాపు(రాజమండ్రి), ఎన్.విజయ భాస్కర్‌రెడ్డి(కడప), సహాయ కార్యదర్శులుగా జి.రాము(ఒంగోలు), సయ్యద్ షమీర్ హుసేన్(చిత్తూరు), కుమ్మరి వెంగళరావు(రాజమండ్రి), కో-ఆప్టెడ్ ఉపాధ్యక్షునిగా గల్లా శ్రీధర్(కృష్ణపట్నం), కో-ఆప్టెడ్ సహాయ కార్యదర్శిగా పిట్టా నాగభూషణం(విశాఖపట్నం)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రవాణా రంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను కోరుతూ సర్వసభ్య సమావేశం తీర్మానించింది.

ఎయిరో కార్గో ద్వారా జీడి ఎగుమతి, దిగుమతులు

» జీడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు: రామ్మోహన్ నాయుడు

కాశీబుగ్గ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి ఎయిర్ కార్గో ద్వారా జీడి ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని కేంద్ర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసే ఎయిర్‌పోర్టు ద్వారా ఈ అవకాశం కల్పిస్తామన్నారు. జీడి వ్యాపారులు కూడా జీడి పరిశ్రమలే కాకుండా దాని అనుబంధ పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. పలాస కాశీబుగ్గలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేరళ, గోవా తదిర రాష్ట్రాల్లో జీడి పండుతో ఆల్కహాల్ తయారు చేసి మరింత లబ్ధి పొందుతున్నారని, అలాగే జీడితొక్కతో రసాయనాలు తయారు చేస్తున్నారని చెప్పారు. జీడితో వచ్చిన ప్రతి వస్తువును వారు వినియోగించుకుని కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నారని, స్థానిక వ్యాపారులు ఆ దిశగా ఆలోచించాలని కోరారు. పలాస జీడి వెబ్‌సైట్ అంతర్జాతీయ స్థాయిలో కనిపించాలని సూచించారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR,
ANANTHAPURAMU-515 002 (A.P.) INDIA.

XIV CONVOCATION NOTIFICATION

The **XIV Convocation of Jawaharlal Nehru Technological University Anantapur**, Ananthapuramu is tentatively scheduled in the month of **April/May, 2025. All UG, PG and Ph.D. Candidates** who are qualified for the award of degree during the **Academic year 2023-24** are hereby informed to submit the applications through Online only **(https://jntuaebranchpayment.in/orginaldegree)** on or before **15.04.2025. Only Ph.D. Awardees and Gold Medalists** will receive the degrees on the dais and others will receive their degrees through registered Post/Courier. Further details can be seen in the **web site:www.jntua.ac.in** under Examinations section.

Date:15.03.2025 **Sd/-REGISTRAR.**

'శుభమస్తు'లో డబుల్ పండుగలు.. డబుల్ ఆఫర్లు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని శుభమస్తు షాపింగ్ మాల్స్‌లో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా డబుల్ ఆఫర్లు అందిస్తున్నట్టు ఆ షాపింగ్ మాల్ యాజమానులు భయ్యా శ్రీనివాసులు, రవికుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తమ షాపింగ్‌మాల్స్‌లో ఎంత మొత్తానికి కొనుగోలు చేస్తే కొన్న మొత్తానికి డిస్కౌంట్ పాయింట్లు ఖాతాదారులు పొందుతారని పేర్కొన్నారు. దీంతో వినియోగదారులు 100 శాతం ఫ్రీ షాపింగ్ చేసుకోవచ్చని వెల్లడించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఇచ్చే జకాత్ వస్త్రాలు, ప్రత్యేక ధరల్లో లభిస్తాయని ప్రకటించారు. పట్టు శారీలపై 60 శాతం, జకాత్ పట్టు వస్త్రాలు ఎంపిక చేసిన వస్త్రాలపై భారీ డిస్కౌంట్స్ ఉన్నాయన్నారు. మగవారికి, పిల్లలకు వస్త్రాలపై ఊహించని ఆఫర్లు ఉన్నాయని పేర్కొన్నారు. టెక్స్‌టైల్స్‌లో రూ.వెయ్యికి 10 షర్ట్ బిట్స్, 10 ప్యాంట్ బిట్స్, అరవింద్ జ్యూడీ ప్యాక్‌లో రూ.వెయ్యికి 3 సెట్స్, ఫర్నిషింగ్ విభాగంలో రూ.వెయ్యికి 4 డబుల్ కాటన్ బెడ్‌షీట్స్, డబుల్ కాట్ ఏసీ బ్లాంకెట్ రూ.వెయ్యికి 4 పీసులు, సింగిల్ కాట్ బెడ్‌షీట్స్ రూ.వెయ్యి కి 6పీసులు, టవల్స్ రూ.250కి 4పీసులు, పెట్టికోట్ రూ.499కి 6 పీసులు, డోర్ కర్టెన్స్ రూ.500కి 4 పీసులు, రూ.199కి 2 పిల్లో కవర్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 75575 58559 నంబరులో సంప్రదించాలని కోరారు.




జస్టిస్ రజనికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ఈవో లీలా కుమార్

మల్లేశ్వరుని సన్నిధిలో జస్టిస్ రజని

పెదకాకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త, న్యాయమూర్తి జస్టిస్ పి.రజని దంపతులు శనివారం దర్శించుకున్నారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ రజని దంపతులను శ్రీస్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను ఆలయ ఈవో, ఉప కమిషనర్ లీలాకుమార్ అందజేశారు.







ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల పట్టింపు లేదు / Widow / 40y / ఆంధ్ర / Govt. Employee/ Own House / Agriculture Land / పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను.(డైరెక్ట్ సంబంధం కుదుర్చబడును) / ఫోన్: 9581155315 AJH-003123

★ కుల/ఆస్తి ప్రసక్తి లేదు / Widow / 45y / హైదరాబాద్ /ఫ్యామిలీ పెన్షన్ / Own House / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను.(డైరెక్ట్ సంబంధం కుదుర్చబడును) / ఫోన్: 8374476725 AJH-003123

★ బ్రాహ్మణ / 36y/5'4" / 1st మ్యారేజ్ / Qua:- Inter, Pvt. Job / Own House / No Siblings / పౌరోహితం also OK / 2nd మ్యారేజ్ also OK / వరుడు కావలెను. ఫోన్: 9550685714 AJH-003124

★ కుల పట్టింపు లేదు / 40y/ Widow / ఆంధ్ర / Govt. టీచర్ /మంచి జీతం/ సొంత ఇల్లు / పిల్లలు లేరు / ల్యాండ్స్ / చదువు ప్రసక్తి లేదు / అందమైన వధువుకు వరుడు కావలెను. గుంటూరు (Hyd OK) ఫోన్: 7075948409 AJH-003124

★ బ్రాహ్మణ వధువు / 25y / 1st మ్యారేజ్ / Qua: 10th Class / Own Business / శాఖ పట్టింపు లేదు / పౌరోహిత్యం also OK / 2nd మ్యారేజ్ also OK / వరుడు కావలెను. ఫోన్: 8317685804 AJH-003124

★ కుల పట్టింపు లేదు / 52y / Widow/ ఆంధ్ర /బ్యాంక్ మేనేజర్ / మంచి జీతం/ ఆస్తి ప్రసక్తి లేదు / ఒక పాప settled UK / వధువుకు వరుడు కావలెను. వరంగల్ OK, Hyd OK.ఫోన్: 9989350417 AJH-003124

★ వైశ్య విడో Govt. 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు:45, కలర్:తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8125076013 AJH-003123

★ కుల పట్టింపు లేదు / 58y / Widow / G.V.T. / R.T.D. / మంచి జీతం/ Own House / Rents / పిల్లలు లేరు / ఏలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను ఫోన్: 9182070372 AJH-003123

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు / 30y / 5'5"/ డాక్టర్ / ఓన్ క్లినిక్ / ల్యాండ్ / ఓన్ హౌస్ / వధువుకి ఏదీ జాబ్ or బిజినెస్ ఉన్న హిందూ వరుడు కావలెను. వాట్సాప్: 9951641627 AJH-003068

★ కుల ఆస్తి పట్టింపు లేదు / కమ్మ / 2nd మ్యారేజ్ / 42 / 5'6" / డాక్టర్ కార్డియాలజిస్ట్ మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 7286832067 AJH-003068

★ రాజులు / సూర్యవంశం / చంద్ర వంశం / బత్రాజులు / మొదటి సంబంధం / 26 సం. to 36 సం.లు ఉన్న అమ్మాయిలకు సాంప్రదాయ వరులు కావలెను.ఫోన్ : 8374364076 AJH-003125

★ చౌదరి (కమ్మ) /1st మ్యారేజ్ / 26 సం. / డిగ్రీ to B.Tech ఉన్న అమ్మాయిలకి ఏదయినా జాబ్ లేదా బిజినెస్ ఉన్న వరులు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ గౌడ్స్ / 25 సం.లు మొదటి సంబంధం / డిగ్రీ / 5.4 / సొంత ఇల్లు / స్థిరాస్తి. ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ పద్మశాలి / 1st మ్యారేజ్ / 5.4 / 26 సం.లు / డిగ్రీ / సొంత ఇల్లు / ఫాదర్ చీరల వ్యాపారం. స్థిరాస్తి ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ ఆర్యవైశ్య / కళింగ వైశ్య / మొదటి సంబంధం / 26 సం.లు / 30 సం.లు, అలాగే రెండవ సంబంధం 32 నుండి 40 సం.లు ఉన్న అమ్మాయిలకి సాంప్రదాయ వరులు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ ఆచారులు (విశ్వబ్రాహ్మణ్స్) / 25 సం.లు / Inter / బ్రైలరింగ్, ఫాదర్ గోల్డ్ వర్క్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి సాంప్రదాయ వరుడు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ యాదవ్స్ (ఎర్రగొల్ల, అల్లగొల్ల, పూశగొల్ల) 26 సం.లు / సొంత ఇల్లు, డిగ్రీ, 5.3, ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ నాయి బ్రాహ్మణ్స్ / 25 సం.లు / Inter / సొంత ఇల్లు బ్రైలరింగ్ బ్రదర్, ఫాదర్ కులవృత్తి. ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 8374364076 AJH-003125

★ ఆర్యవైశ్య / 21y & 23y & 26y & 28y & 30y & 31y & 33y & 34y & 36y & 37y & 38y & 39y & 41y & 42y & 44y & 46y & 48 & 50y & 51y & 53y & 55y & 57y & 58y & 59y / డి. సుబ్రహ్మణ్య గుప్త "సుధ" (Since 1998) : PH/WA: 9291509949 AJH-003125

★ సెకండ్ మ్యారేజ్, వయస్సు 40 సం., కాపు వధువుకి తగిన డ్రైవర్స్ / విడో / సెకండ్ మ్యారేజ్ వరుడు కావలెను. ఫోన్: 9160826515 AJH-003125

★ 58/ రెండవ పెళ్లి /విడో / ఫెయిర్ / Govt ఫ్యామిలీ పెన్షన్ / సొంత ఇల్లు రెంట్స్/ పిల్లలు లేరు / ఏలాంటి బాదరాబందీ లేని ఏకైక వధువుకి వరుడు కావలెను. (కుల/ఆస్తి ప ట్టింపు లేదు) ఫోన్: 7995376608 AJH-003125

★ 60/ రెండవ పెళ్లి /విడో / ఫెయిర్ / Govt ఫ్యామిలీ పెన్షన్ / సొంత ఇల్లు, భూములు / పిల్లలు లేరు /వెల్ సెటిల్డ్ / ఏలాంటి బాదరాబందీ లేని అందమైన ఏకైక వధువుకి వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్:9000658258 AJH-003125

★ రెడ్డి 2nd మ్యారేజ్/ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / డిగ్రీ. Age: 31 / సొంత బిజినెస్ గల అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్: 9032596676 AJH-15120

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Age: 35 / B.Com. Pvt. Job గల అందమయిన వధువుకి వరుడు కావలెను. అన్ని కులాల వారికి Intercaste వివాహాలు చూడబడును. ఫోన్: 7207510801 AJH-15120

★ ఆస్తి కుల పట్టింపు లేదు / కమ్మ / 25y / B.Tech / పెద్ద స్థిరాస్తి కలిగి యాక్సిడెంట్‌లో పేరెంట్స్‌ను కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. పీ ఫోటో డీటెయిల్స్ వాట్సాప్‌లో పంపించండి. ఫోన్: 8142060040 AJH-15120

★ రెడ్డి 2nd మ్యారేజ్ (కుల, ఆస్తి) ప్రసక్తి లేదు / 31y / Q.BCom / Business & Properties / గల అందమైన వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1వ, 2వ సంబంధాలు కలవు. ఫోన్: 9515579827 AJH-15120

★ Kamma / 28 Years /Unmarried / 5'4" Height / Dermatologist / మంచి ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్: 9676585199 AJH-15120

★ క్రిస్టియన్ మాల / వెల్ సెటిల్డ్ / B.Sc / Agri / C. Govt. / టెక్నికల్ Asst. / FCI / మంచి జీతం / 5'4" ఎత్తు / 25 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9908222406 AJH-15119

★ గౌడ / M.Tech, NIT / C. Govt. డిప్యూటీ మేనేజర్ / రైల్వేస్ / మంచి జీతం / 5'5" ఎత్తు / 26 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618008271 AJH-15119

★ పద్మశాలి /ఏకైక కుమార్తె/ M.Sc / C. Govt. Jr. Asst. / ఇన్‌కమ్ ట్యాక్స్ Dept / మంచి జీతం / 5'5" ఎత్తు / 25 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8297439565 AJH-15119

★ పద్మశాలి / B.Tech / Govt. Jr. అకౌంటెంట్ / మంచి జీతం / 5'5" ఎత్తు / 26 సం. ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. ఫోన్: 8790689274 AJH-15119

★ ముదిరాజ్ / M.Tech / C.Govt. గ్రూప్- B గెజిటెడ్ ఆఫీసర్ / మంచి జీతం / 5'5" ఎత్తు / 27 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618579861 AJH-15119

★ SC మాదిగ / ఏకైక కుమార్తె/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / యూనియన్ బ్యాంక్ / మంచి జీతం / 5'5" ఎత్తు / 27 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897389698 AJH-15119

★ కమ్మ / BE / C. Govt. Asst. Exq. ఇంజనీర్ / ట్రాన్స్‌కో / మంచి జీతం / 5'5" ఎత్తు / 27 సం. ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7032058965 AJH-15119

★ కుల పట్టింపు లేదు / విడో / 60 Y / Retd. Govt. Doctor / ఓన్ హాస్పిటల్ / రెంట్స్ / ల్యాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 99490 92259 AJB-935

వధువు కావలెను



★ కులం కట్నం చదువు అందంతో పని లేదు. / నాకు 45 సం.లోపు వధువు కావలెను. / K.V. ప్రసాద్ / 22వార్డు / మారీసుపేట / తెనాలి / డైరెక్ట్: 9494604396 AJH-003068

★ నాయక్ (లంబాడ) /44y / 5'7"/ లేట్ మ్యారేజ్ / టింబర్ బిజినెస్ వరునికి అదే కులానికి చెందిన / కుల పట్టింపు లేని తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్. 9494906136 AJH-003125

★ 2వ పెళ్లి: కాపు, 59yrs, Govt. ఎంప్లాయి, మంచి జీతం, వరుడుకి వధువు కావలెను. ఫోన్: 9848023736 AJH-15120

★ కాపు / 42y / 5'3" / USA / SWE / రెండవ పెళ్ళి / వరునికి USA లో ఉన్న 1st/2nd వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్: 9390297429 AJH-15120

★ యాదవ /BE, M.Tech / C. Govt. సైంటిఫిక్ ఆఫీసర్ / NPCIL / మంచి జీతం / 5'11" ఎత్తు / 29 సం. ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 8297439565 AJH-15119

★ డైరెక్ట్ /కుల పట్టింపు లేదు / 48Y / 2వ పెళ్లి /మంచి జీతం / డిగ్రీ, ప్రై.జాబ్ HYD లో స్వంత ఇల్లు & ప్రాపర్టీ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9618346855 AJH-00121

★ వధువు కావాలి. Age No Bar. First / Second. కట్నం లేదు. Avoid Agent. 6304751936 AJH-46465

★ డ్రైవర్స్ కాపు 44 సం॥ వరుడుకు అదే కులానికి చెందిన ఏ బాదరబందీ లేని మంచి మనస్సుగల ఒంటరి వధువు (కాపు) కావలెను. సంప్రః సెల్: 8179513154 AJO-211347

★ 5'6", 29 Yrs., B.Tech., Software Engineer మృగశిర నక్షత్రం, వృషభరాశి అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. సెల్ : 99633 75877, 93980 72793 AJT - 5133

కళ్యాణ వేదిక

★ కమ్మ చౌదరి, రెడ్డి మ్యారేజ్ బ్యూరో/ హైరేంజ్ / హైస్టేటస్ / Engineer's & Doctors / ఇండియా మరియు అబ్రాడ్, లేట్, 1st & 2nd సంప్ర:9394002999 AJH-15120

★ Reddy, Kamma & Kapu ELITE decent matches for India/Aborad Prasad Reddy & RKR ELITE MATRIMONY 9866363357 / 9100324999 AJH-003068

★ Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Madhavi Sharma Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003067

★ Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles. ★ Shyam. Ph: 8500688938 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003067

★ Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam Ph: 8500688938 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003067

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ ★ Madhavi. Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003067

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-003125

★ బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం Free Register 13/April 2025 న/ Kamala Nagar, Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/ 9533608887 Whatsapp No. AJH-003125

★ పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ, తెనాలి (గుంటూరు జిల్లా) వారి 14వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 20-04-2025, ఆదివారము ఉ.9 గం.ల నుండి ఫోన్ : 9963924665 / 9849851322 AJT - 5137

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-002915

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-003125

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9985921386, 9703618806.

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళ పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

PRASAD REDDY & R.K.R. ELITE MATRIMONY

Contact: P.No. 9866363357, 9100324999

వధువు కావలెను

★ REDDY / US CITIZEN/ RICH / 28 / 5'11" / FAIR / RESIDENCY DOCTOR / SEEKS REDDY GIRL FROM WELL TO DO FAMILY. PH: 8520010434

★ REDDY / RICH / 29 / 5'9" / FAIR / MBA(ISB) / BUSINESS / SEEKS IIT, IIM / GOOD LOOKING BRIDE / CAST NO BAR. PH: 8520010434

★ REDDY / 25 / 6'1" / FAIR / B.TECH / BUILDER / 100 CR / SEEKS PRETTY GIRL / GOOD FAMILY / CAST NO BAR. PH: 8520010434

★ KAPU / 35 /5'10" / FAIR / B.TECH (IIT) / I.R.T.S / 25 CR / SEEKS S.W.E / DOCTOR / GOOD FAMILY / CAST NO BAR. PH: 8520010434

★ KAMMA /27 / 6'0" / FAIR / BS (SINGAPORE) / BUSINESS / 500 CR / SEEKS GOOD FAMILY / FAIR, 100 CR / 5'6". PH: 9100324999

★ KAMMA / 27/ FAIR / 5'11" / MBA / BUSINESS / 500 CR / SEEKS / FAIR / DECENT FAMILY / 5'4" / 100 CR .ANY P.G. PH: 9100324999

★ KAMMA / 28 / FAIR / 6'0" / DR .SURGEON / 200 CR / SEEKS / S.W.E / DOCTOR / 5'5" / DECENT FAMILY / 100 CR. PH: 9100324999

★ KAMMA / 28 / FAIR / 5'11" / B.TECH / S.W.E. / 65 L P/A. / 50 CR / SEEKS / B.E / FAIR / 5'4" / DECENT FAMILY / 20 CR. PH: 9100324999

★ KAMMA / DIVORCE / 31/ FAIR / 6'1" / B.B.A / 50 CR / SEEKS / 27 / FAIR / 5'5" / GOOD FAMILY / 25 CR. PH: 910032499

★ KAMMA / DIVORCE / 35 / FAIR / 5'11" / DM DOCTOR / 6 CR / SEEKS / S.W.E / P.G DOCTOR / GOOD FAMILY / 5'4" / 3CR. PH: 9100324999

వరుడు కావలెను

★ REDDY / RICH / 28 / 5'8" / FAIR / M.S(UK) / SEEKS BUSINESS / SMART BOY / WELL TO DO FAMILY / CAST NO BAR. PH: 8520010434

★ REDDY / RICH / 29 / 5'4" / FAIR / MBBS / PHARMA BUSINESS / BUSINESS BACK GROUND FAMILY / CAST NO BAR. PH: 8520010434

★ REDDY / 24 / 5'8" / FAIR / AG (BSC) / 100 CR / SEEKS BELOW 30 (Y) 6'0" / EDUCATED FAMILY / WELL SETTLED BUSINESS / CAST NO BAR. PH: 8520010434

★ KAPU / 28 / 5'3" / FAIR / M.S(US) / 200K / 20 CR / SEEKS KAPU / GOOD LOOKING USA GROOM / WELL TO DO FAMILY. PH: 8520010434

★ KAPU / 28 / 5'2" / PRETTY / M.S(UK) / JOB IN HYD /25 CR / SEEKS CAST NO BAR / SMART BOY / WELL SETTLED BUSINESS FAMILY. PH: 8520010434

★ KAMMA / 25 / 5'4" / FAIR / M.S(US) / 75 CR / SEEKS S.W.E/ BUSINESS / WELL SETTLED BUSINESS BACK GROUND FAMILY. PH: 9100324999

★ KAMMA / 25 / 5'2" / FAIR / P.G DOCTOR / 50 CR / SEEKS BUSINESS / P.G Dr. / 29 / 5'8" / 70 CR. / GOOD FAMILY. PH: 9100324999

★ KAMMA / 28 / 5'6" /FAIR / MS / 45 L P/A / 25 CR / SEEKS / S.W.E / BUSINESS / BELOW 31 (Y) / 30 CR+ GOOD FAMILY. PH: 9100324999

★ KAMMA / 24 / FAIR/ 5'4" / B.TECH / S.W.E / 50 CR / SEEKS S.W.E / BUSINESS / GOOD FAMILY / 100 CR / BELOW 28(Y) PH: 9100324999

★ KAMMA / DIVORCE / 37 /5'4" / FAIR / B.TECH / S.W.E / 30 CR / SEEKS S.W.E / BUSINESS. / GOOD FAMILY / 50 CR. PH: 9100324999

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

ఆ స్కాంలన్నీ బలాదూర్!

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు ఇప్పుడు శాపాలుగా మారి ఆయనను చుట్టుకోబోతున్నాయా? నాటి పాపాలలో చేదోడు వాదోడుగా ఉండిన వాళ్లు ఇప్పుడు అడ్డం తిరిగి ఆయా కేసులలో కుండ బద్దలు కొట్టినట్టు అప్పుడు ఏమి జరిగిందో విచారణాధికారులకు చెప్పేయబోతున్నారా? మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ప్రకటన ఈ అనుమానాలను రేకెత్తిస్తోంది. జగన్‌రెడ్డి హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని, కాకినాడ పోర్టు యాజమాన్యం చేతులు మారడంలో కర్త, కర్మ, క్రియ ప్రస్తుత ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి అని విజయసాయిరెడ్డి తేల్చిచెప్పారు. భయం అనేది తన రక్తంలో లేదని, అప్పట్లో ఏం జరిగిందో విచారణాధికారుల ఎదుట చెప్పేస్తానని కూడా ఆయన స్పష్టంచేశారు. మరోవైపు మద్యం కుంభకోణంపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. మద్యం కొనుగోళ్లలో అప్పట్లో కీలకంగా

> వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్నవారు ఒక్కొక్కరుగా చనిపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రస్తుతానికి ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి మాత్రమే ప్రాణాలతో మిగిలి ఉన్నారు. సాక్షుల మరణాలు చూస్తుంటే పరిటాల రవి హత్య కేసులో నిందితులు కూడా ఒక్కొక్కరు చనిపోవడం గుర్తుకొస్తోంది. ఇప్పుడు వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు కాకుండా సాక్షులు చనిపోతున్నారు. ఇంతే తేడా! చంద్రబాబు ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించని పక్షంలో దస్తగిరి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. అతను జీవించి ఉండని పక్షంలో వివేకానందరెడ్డి హత్య కేసు కథ కంచికి చేరుకుంటుంది. వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత అలుపెరుగకుండా ఆరేళ్లుగా చేస్తున్న పోరాటం బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

వ్యవహరించిన వాళ్లు ఒక్కొక్కరుగా న్యాయాధికారి ఎదుట 164 కింద వాంగ్మూలం ఇస్తున్నారు. ఈ క్రమంలో సత్యప్రసాద్ అనే అధికారి ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు కేసీఆర్ కుమార్తె కవిత ప్రభృతులు జైలుకు వెళ్లి వచ్చారు. తాజాగా కేరళ, తమిళనాడులో చోటుచేసుకున్న మద్యం కుంభకోణాలు కలకలం సృష్టిస్తున్నాయి. అవన్నీ ఒక ఎత్తు కాగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణం లోతుల్లోకి వెళుతున్నప్పుడు విచారణ అధికారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒకటి కాదు–రెండు కాదు.. ఐదేళ్లలో పది వేల కోట్లకు పైగా చేతులు మారినట్టు ఇప్పటివరకు జరిగిన విచారణలో స్పష్టమవుతోంది. యావత్ దేశం బిత్తరపోయేలా చోటుచేసుకున్న ఈ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని విజయసాయిరెడ్డి చెబుతున్నప్పటికీ సొమ్ములు మాత్రం తాడేపల్లి ప్యాలెస్‌కు ప్రవహించాయని తేటతెల్లమవుతోంది. 2019లో అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచే ఈ కుంభకోణానికి సంబంధించిన స్కెచ్‌ను అమలు చేశారు. దీన్నిబట్టి తాము అధికారంలోకి వస్తే ఏయే రంగాలలో ఎంతెంత దోచుకోవచ్చో జగన్ అండ్ కో ముందుగానే స్కెచ్ రూపొందించుకున్నారని అర్థమవుతోంది. అవినీతి కేసులలో అరెస్టయి పదహారు నెలలు జైల్లో గడిపిన జగన్‌రెడ్డి, ఆ సమయంలో భవిష్యత్తులో అధికారం లభిస్తే ఏం చేయాలో బ్లూ ప్రింట్ రూపొందించుకున్నారని ఆయనతో అప్పట్లో సన్నిహితంగా ఉన్నవాళ్లు చెబుతారు. సంక్షేమం పేరిట ప్రజలను మాయ చేస్తూ చాటుగా ఎలా దోచుకోవాలో ప్రణాళికలు రూపొందించుకున్నారట. ఈ కారణంగానే 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా రంగాలలో దోపిడీకి తెర తీశారు. మామూలుగా అయితే కొత్తగా అధికారంలోకి వచ్చినవాళ్లు పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. దోచుకోవడానికి ఉన్న అవకాశాలను గుర్తించడానికి కూడా సమయం పడుతుంది. ముఖ్యమంత్రిగా పద్నాలుగేళ్ల పాటు పనిచేసిన చంద్రబాబు కూడా ఇప్పుడు పరిస్థితులను చక్కదిద్దడానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టిందని చెబుతున్నారు. అలాంటిది ముఖ్యమంత్రిగా ఏ మాత్రం అనుభవం లేని జగన్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నాటి నుంచే తాను రూపొందించుకున్న దోపిడీ స్కెచ్‌ను అమలు చేయడం మొదలు పెట్టారు. ఈ స్కెచ్ అమలులో సహకరించే అధికారులను గుర్తించి అంతే వేగంగా ఆయా స్థానాలలో నియమించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఏయే అధికారులను ఏయే పోస్టులలో నియమించాలో నిర్ణయించుకొని అంతా సెట్ చేసుకున్నారు. అందుకే ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా అధికారంలోకి రాగానే దోపిడీ మొదలుపెట్టారు. మద్యం కుంభకోణం ఒక్కటి చాలు నాటి పాలకులు ఎంతటి ఘనాపాటీలో చెప్పడానికి! రజత్ భార్గవ వంటి సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా ఈ కుంభకోణం సాఫీగా జరగడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించారంటే ఆ స్కాం లోతు తెలుస్తోంది. పైనుంచి కింది వరకు ఎవరి వాటాలు వారికి నెలవారీగా అందేవట. ఏపీ బ్రూవరీస్ కార్పొరేషన్‌ను ప్రభుత్వ సంస్థగా కాకుండా ప్రైవేటు సంస్థలా నడిపారు. భారతి సిమెంట్‌లో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి అనే వ్యక్తి తన మనుషులతో మద్యం అమ్మకాలను పర్యవేక్షించేవారు. ఆయన మనుషులకు ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించడం హైలైట్.

ఓ డిస్టిలరీ.. 200 కోట్ల బంగారం!

ఈ మద్యం కుంభకోణంపై చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అధికారులు బృందాలుగా విడిపోయి విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవారు న్యాయాధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అందిన ఆదేశాల ప్రకారం బ్రూవరీస్ కార్పొరేషన్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు– విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖరరెడ్డిలను కలిసి ఏయే డిస్టిలరీల నుంచి ఎంతెంత మద్యం కొనుగోలు చేయాలో ఆదేశాలు తీసుకునేవారు. ఈ ముగ్గురి కనుసన్నల్లోనే అంతా జరిగేదట! ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాత్ర నేరుగా ఎక్కడా కనిపించేది కాదు. కానీ, ఆదేశాలు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చేవి. డిస్టిలరీస్ నుంచి లభించిన ముడుపులను కూడా మూల విరాట్ ఆదేశాల ప్రకారం ఎక్కడకు చేర్చాలో అక్కడకు చేర్చేవారు. మద్యం మాఫియా అంటే ఇది కదా? హవాలా వ్యాపారానికే మెళకువలు నేర్పించిన మనుషులు వీళ్లు. హైదరాబాద్‌లోని ఒక డిస్టిలరీ యాజమాన్యం 200 కోట్ల రూపాయలతో దాదాపు మూడున్నర క్వింటాళ్లు, అంటే 350 కిలోల బంగారు నాణేలను కొనుగోలు చేసింది. పద్మావతి జ్యువెలర్స్ అనే సంస్థకు సదరు డిస్టిలరీ నుంచి 200 కోట్ల రూపాయలు చెక్కు రూపంలోనే అందాయి. ఆ డబ్బు తీసుకున్న పద్మావతి జ్యువెలర్స్ సంస్థ 350 కిలోల బంగారాన్ని నాణేలుగా మార్చి అందజేసింది. సదరు బంగారాన్ని అహ్మద్ అనే వ్యక్తికి ఇవ్వవలసిందిగా సదరు డిస్టిలరీ కంపెనీ ఆథరైజేషన్ లేఖను పద్మావతి జ్యువెలర్స్‌కు ఇచ్చింది. బంగారు నాణేలు తీసుకున్న అహ్మద్ అనే వ్యక్తి వాటిని ఎవరికి అందజేసి ఉంటారో తదుపరి విచారణలో తేలుతుంది. ఏ డిస్టిలరీ కంపెనీ అయినా ముడి సరుకు కొంటుంది. బంగారం ఎందుకు కొంటుంది? అది కూడా 200 కోట్ల రూపాయలతో దాదాపు 350 కిలోల బంగారం ఎందుకు కొంటుంది? దీన్నిబట్టి ఈ కుంభకోణంలో ఎన్ని వేల కోట్ల రూపాయలు చేతులు మారాయో అర్థం చేసుకోవచ్చు. ఒక్క డిస్టిలరీకి సంబంధించిన మొత్తం ఇంత ఉంటే మిగతా డిస్టిలరీల నుంచి ఇంకెంత మొత్తం చేతులు మారిందో ఊహించుకోవచ్చు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మొత్తం 200 కోట్లు మాత్రమే ముడుపులుగా అందాయని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. ఇక్కడ ఒక్క డిస్టిలరీనే 200 కోట్లతో బంగారం కొన్నది. అంటే కుంభకోణం ఎంత పెద్దదో, ఎన్ని వేల కోట్ల రూపాయలు చేతులు మారాయో అంచనా వేయడం కష్టం కాదు. పేదలతో నాసిరకం మద్యాన్ని తాగించి పాపపు సొమ్ము మూటగట్టుకున్న వారికి ఆ పేదల ఉసురు తగలదా? నాసిరకం మద్యం తాగి ఎందరో మరణించగా, మరెందరికో కిడ్నీలు పాడయ్యాయి. వీరి ఉసురు ఊరికే పోతుందా? ఈ పాపంలో ఎవరి వాటా ఎంతో తేలడానికి మరికొంత సమయం పట్టవచ్చు. పేదల ఉసురు మాత్రం ఊరికే పోదు. ఇందులో అవినీతి మాత్రమే కాదు.. పాపం కూడా ఉంది. పేదల శవాల మీద పేలాలు ఏరుకున్నారు. మద్యం వ్యాపారం చేసిన ఏ కుటుంబం కూడా బాగుపడిన దాఖలాలు లేవు. విజయ మాల్యానే తీసుకుందాం. లిక్కర్ వ్యాపారానికి పర్యాయ పదంగా ఉండిన విజయ మాల్యా ప్రస్తుత దుస్థితి తెలిసిందే. అలాగే తెలుగు రాష్ట్రాలలో మద్యం వ్యాపారం చేసిన కుటుంబాలు కూడా రెండవ తరం వచ్చేసరికి చితికిపోయాయి. అలాంటిది ఇంత దారుణంగా స్పిరిట్‌లో నీళ్లు, రంగు కలిపి నాసిరకం మద్యం సరఫరా చేసి తాగించిన వాళ్లు మాత్రం బాగుపడతారా? డబ్బు సంపాదించడానికి ఎన్నో మార్గాలు ఉంటాయి. ఇంత నీచానికి, అందునా అధికారంలో ఉన్నవారు పాల్పడ్డారంటే అది వారి మనో వికారాలకు అద్దం పడుతోంది. అధికారంలో ఉన్నవాళ్లు ఈ స్థాయిలో వ్యవస్థీకృత నేరాలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు వ్యక్తులకు మేళ్లు చేసి లబ్ధి పొందడం పరిపాటి అయింది. జగన్‌రెడ్డి హయాంలో మాత్రం నాసిరకం మద్యం సరఫరా చేసి కోట్లాది మంది ప్రాణాలతో చెలగాటం ఆడారు. ప్రజల బలహీనతలను సొమ్ము చేసుకోవడం వేరు.. వారి ప్రాణాలతో చెలగాటం ఆడటం వేరు.



> తాడేపల్లి ప్యాలెస్ నుంచి అందిన ఆదేశాల ప్రకారం బ్రూవరీస్ కార్పొరేషన్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు– విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖరరెడ్డిలను కలిసి ఏయే డిస్టిలరీల నుంచి ఎంతెంత మద్యం కొనుగోలు చేయాలో ఆదేశాలు తీసుకునేవారు. ఈ ముగ్గురి కనుసన్నల్లోనే అంతా జరిగేదట! ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాత్ర నేరుగా ఎక్కడా కనిపించేది కాదు. కానీ, ఆదేశాలు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చేవి. హైదరాబాద్‌లోని ఒక డిస్టిలరీ యాజమాన్యం 200 కోట్ల రూపాయలతో దాదాపు మూడున్నర క్వింటాళ్లు, అంటే 350 కిలోల బంగారు నాణేలను కొనుగోలు చేసింది. పద్మావతి జ్యువెలర్స్ అనే సంస్థకు సదరు డిస్టిలరీ నుంచి 200 కోట్ల రూపాయలు చెక్కు రూపంలోనే అందాయి. ఆ డబ్బు తీసుకున్న పద్మావతి జ్యువెలర్స్ సంస్థ 350 కిలోల బంగారాన్ని నాణేలుగా మార్చి అందజేసింది. ఏ డిస్టిలరీ కంపెనీ అయినా ముడి సరుకు కొంటుంది. బంగారం ఎందుకు కొంటుంది? ఒక్క డిస్టిలరీకి సంబంధించిన మొత్తం ఇంత ఉంటే మిగతా డిస్టిలరీల నుంచి ఇంకెంత మొత్తం చేతులు మారిందో ఊహించుకోవచ్చు.

సాయిరెడ్డి.. రాజ్యసభ వేట!

ఇప్పుడు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యవహారానికి వద్దాం. మద్యం కుంభకోణానికి సంబంధించి మరిన్ని వివరాలు చెప్పవలసి వస్తే భవిష్యత్తులో చెబుతానని ఆయన స్పష్టం చేశారు. దీన్నిబట్టి ఆ కుంభకోణం నుంచి తనను తాను రక్షించుకోవడం కోసం మరిన్ని వివరాలను బయటపెట్టడానికి ఆయన సిద్ధంగా ఉన్నారని అర్థం చేసుకోవచ్చు. ఈ కుంభకోణానికి సంబంధించి సిట్ అధికారులు ఇప్పటికే అనేక రుజువులు సేకరించారు. ఈ క్రమంలో విజయసాయిరెడ్డిని కూడా అధికారులు త్వరలోనే విచారణకు పిలుస్తారు. అప్పుడు ఆయన నిజంగా నోరు విప్పుతారో లేదో చూడాలి. న్యాయాధికారి ఎదుట అధికారులు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం ప్రస్తుతానికి విజయసాయిరెడ్డి ఈ కుంభకోణంలో ఒక నిందితుడిగా ఉన్నారు. మరిన్ని వివరాలు చెబుతానని అంటున్నందున విజయసాయిరెడ్డి ఈ వ్యవహారంలో అప్రూవర్‌గా మారతారా? అనే అనుమానం వస్తోంది. ఈ కుంభకోణంతో తనకు ఏ సంబంధం లేదని ఆయన చెప్పలేదు. ప్రారంభంలో విజయసాయిరెడ్డి పాత్ర ఉండిందని ఇప్పటికే అధికారులు సాక్ష్యాధారాలు సేకరించారు. వాస్తవంలో కూడా అధికారం కోల్పోవడానికి రెండేళ్ల ముందు విజయసాయిరెడ్డిని ఆ వ్యవహారం నుంచి తప్పించారు. వాటాల విషయంలో విభేదాలు రావడం వల్లనే ఆయనను తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాల మేరకు తప్పించినట్టు చెబుతారు. ముడుపుల చేరవేతలో అప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పాత్ర కూడా ఉంది. మద్యం వ్యవహారం నుంచి తప్పుకోవలసిందిగా ఈ ఇద్దరు అధికారులే ముఖ్యమంత్రి తరఫున విజయసాయిరెడ్డికి సూచించారని తెలిసింది. కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, మిథున్‌రెడ్డిని కూడా విచారిస్తే మరిన్ని విస్తుగొలిపే నిజాలు బయటకు రావొచ్చు. ఇంటి గుట్టు లంకకు చేటు అంటారు. ఇప్పుడు జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న పాపాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నాడు ఆ పాపాలలో పాలుపంచుకొన్న వారే ఇప్పుడు వాటిని బయట పెడుతున్నారు. పాపం పండుతుంది అనడానికి ఇదొక నిదర్శనం. అది విజయసాయిరెడ్డి రూపంలోనా లేక మరొకరి రూపంలోనా అని తేలడానికి మరికొంత సమయం వేచి చూడాలి. బ్రూవరీస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన వాసుదేవ రెడ్డి నోరు విప్పితే మూల విరాట్ ముసుగు తొలగవచ్చు. భయం అనేది తన రక్తంలోనే లేదని విజయసాయిరెడ్డి బయటకు చెబుతున్నప్పటికీ ఆయనకు ప్రాణ భయం పట్టుకుంది. వివేకానందరెడ్డి హత్య ఉదంతంలో ఏం జరిగిందో, హత్య వెనుక ఎవరెవరు ఉన్నారో పూర్తిగా తెలుసు కనుక విజయసాయిరెడ్డి భయపడకుండా ఎలా ఉంటారు? వైఎస్ రాజశేఖరరెడ్డి సొంత సోదరుడు, జగన్ చిన్నాన్న అయిన వివేకానందరెడ్డిని అలవోకగా చంపేసిన వారికి విజయసాయి రెడ్డిపై గొడ్డలి వేటు వేయడం పెద్ద పని కాకపోవచ్చు. ఈ కారణంగా మద్యం కుంభకోణంలో మూల విరాట్ ముసుగు తొలగే వరకైనా విజయసాయిరెడ్డికి భద్రత కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబు ప్రభుత్వంపై ఉంది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్నవారు ఒక్కొక్కరుగా చనిపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రస్తుతానికి ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి మాత్రమే ప్రాణాలతో మిగిలి ఉన్నారు. సాక్షుల మరణాలు చూస్తుంటే పరిటాల రవి హత్య కేసులో నిందితులు కూడా ఒక్కొక్కరు చనిపోవడం గుర్తుకొస్తోంది. పరిటాల రవి హత్యలో పాల్గొన్న వారందరూ దాదాపుగా హత్యకు గురయ్యారు. బావ కళ్లలో ఆనందం చూడాలనుకున్న మొద్దు శీనును కూడా చంపేశారు. రవి హత్యకు స్కెచ్ రూపొందించిన మద్దెలచెర్వు సూరి కూడా చివరకు హత్యకు గురయ్యారు. హత్యా రాజకీయాలలో ఇదొక కొత్త మలుపు. ఇప్పుడు వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు కాకుండా సాక్షులు చనిపోతున్నారు. ఇంతే తేడా! ఈ చావుల వెనుక ఎవరున్నారో ప్రస్తుతానికి ఆ పరమాత్ముడికే ఎరుక. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కూడా చావులు ఆగకపోవడం వింతగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించని పక్షంలో దస్తగిరి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. అతను జీవించి ఉండని పక్షంలో వివేకానందరెడ్డి హత్య కేసు కథ కంచికి చేరుకుంటుంది. వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత అలుపెరుగకుండా ఆరేళ్లుగా చేస్తున్న పోరాటం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఈ నేపథ్యంలో మద్యం కుంభకోణం విషయంలో కూటమి ప్రభుత్వం మరింత ఆచితూచి వ్యవహరించాలి. నాటి పాపాలను బయటపెట్టడానికి సిద్ధపడిన అధికారులకు, ఇతరులకు రక్షణ కల్పించాలి. వేంకటేశ్వరస్వామి సాక్షిగా తాను నిజమే చెబుతానని విజయసాయిరెడ్డి చెబుతున్నప్పటికీ ఆయన కాకినాడ పోర్టు విషయంలో నిజాలను మింగేశారు. విజయసాయి నిజంగా నిజం చెబుతానంటే ఆయనను ఎరిగిన వారెవరూ నమ్మరు. అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే విక్రాంత్‌రెడ్డి రంగ ప్రవేశం చేసి పోర్టు యాజమాన్యం చేతులు మారే ప్రక్రియను పూర్తి చేయించారు. అయినా తనకు తెలిసి ఇందులో జగన్‌రెడ్డి ప్రమేయం లేదని విజయసాయిరెడ్డి చెబుతున్నారంటే ఆయనను నమ్మలేం. రాజకీయాలకు దూరమవుతానని ప్రకటించిన విజయసాయిరెడ్డి, ఇతర రాష్ట్రాల నుంచి రాజ్యసభ సీటును డబ్బుతో కొనుక్కోవాలని ప్రయత్నిస్తున్నారు. తమిళనాడులో అటువంటి అవకాశం ఉంటుందేమోనని ఆయన ఆరా తీశారు. అయితే తమిళనాట ద్రవిడ పార్టీలు డబ్బు కోసం రాజ్యసభ సీట్లు అమ్ముకోవని, పార్టీని నమ్ముకున్న వారికే ఆ సీట్లు కట్టబెడతాయని తేలడంతో ఆయన తన ప్రయత్నాలను విరమించుకున్నారు. ఇప్పుడు ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దీన్నిబట్టి విజయసాయిరెడ్డి నమ్మదగిన వ్యక్తి కాదని, మాట మీద నిలబడరని అర్థమవుతోంది. అయితే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో పాటు వైసీపీకి కూడా తను రాజీనామా చేసినప్పుడు పెద్దగా పట్టించుకోని ఆ పార్టీ తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పందించడం విశేషం. జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే విజయసాయిరెడ్డి రాజీనామా చేసేవారా? అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు? నిజమే– జగన్‌రెడ్డి వద్ద విజయసాయిరెడ్డికి అవమానాలు కొత్త కాదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. అయినా మౌనంగా భరించారు. ప్రధానమంత్రి కార్యాలయంతో సంబంధాలను విజయసాయిరెడ్డి చూసేవారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ, ప్రధానమంత్రిని కలవడానికి వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇకపై తన తరఫున అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్న చూసుకుంటారని ప్రధాని కార్యాలయం అధికారులతో విజయసాయిరెడ్డి సమక్షంలోనే చెప్పారు. అయినా ఆయన అప్పుడు మౌనంగానే ఉండిపోయారు. ఆర్థిక నేరాలు చేయడంలో అవిభక్త కవలలుగా వ్యవహరించిన జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి నిజంగా విడిపోతే పాపం పండినట్టే. అవినీతి కేసులలో కాకపోయినా మద్యం కుంభకోణంలో విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతారా? అన్నదే ప్రస్తుతానికి మిలియన్ డాలర్ల ప్రశ్న.

> ఆర్థిక నేరాలు చేయడంలో అవిభక్త కవలలుగా వ్యవహరించిన జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి నిజంగా విడిపోతే పాపం పండినట్టే. అవినీతి కేసులలో కాకపోయినా మద్యం కుంభకోణంలో విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారతారా? అన్నదే ప్రస్తుతానికి మిలియన్ డాలర్ల ప్రశ్న.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

తెలంగాణలో చావు భాష!

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ జమానా అరాచకాల విషయం అలా ఉంచితే, తెలంగాణ రాజకీయాలలో ఇప్పుడు చావు భాష వినిపిస్తోంది. నిన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నాయకులు, శాసనసభ్యులు జుగుప్సాకరమైన భాషను వాడేవారు. తెలుగు ప్రజలు ఆ భాషను మౌనంగా భరిస్తూ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారు. ఇప్పటివరకు తెలంగాణలో నాయకులు భాష విషయంలో అదుపు తప్పలేదు. ఇప్పుడు తెలంగాణలో కూడా పరిస్థితి మారుతోంది. రాష్ట్రానికి సంబంధించిన అంశాలను కేంద్రం నుంచి సాధించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో దీక్ష చేయాలని, అది కూడా చచ్చే వరకు దీక్ష చేయాలని కేటీఆర్ కటువుగా అన్నారు. ఆమరణ నిరాహార దీక్ష అనడం వేరు, చచ్చే వరకు దీక్ష అనడం వేరు. కేటీఆర్ మాటలతో నొచ్చుకున్నారో ఏమో తెలియదు గానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తాజాగా నోరు జారారు. కేసీఆర్ స్టేచర్ నుంచి స్ట్రెచర్ మీదకు వచ్చారని, ఇలాగే వ్యవహరిస్తే మార్చురీకి వెళతారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమైనప్పటికీ బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు వాడాల్సిన భాష ఇది కాదు. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి భాషను మాట్లాడిన వారు ఏం బావుకున్నారు? అలాంటి భాషను ప్రోత్సహించిన జగన్‌రెడ్డి కూడా 11 సీట్లకే పరిమితమయ్యారు. వైసీపీతో పాటు రాష్ట్రం కూడా దెబ్బతింది. రాజకీయాలు కలుషితమయ్యాయి. ఇప్పుడు తెలంగాణలో ఈ జాడ్యం అవసరమా? రాజకీయాలు హుందాగా ఉండాలే గానీ రొచ్చుగా మారకూడదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు ఉన్న అక్కసును కేటీఆర్ దాచుకోలేకపోతున్నారు. ముఖ్యమంత్రి కూడా కేసీఆర్ కుటుంబంపై అంతే అక్కసుగా ఉంటున్నారు. అటు కేసీఆర్ అండ్ కో ఇటు రేవంత్‌రెడ్డి అండ్ కో ఇకనైనా పరుష పదజాలానికి దూరంగా ఉండాలి. వాద ప్రతివాదాలు వేరు, దూషించుకోవడం వేరు. ప్రజలు అన్నీ గమనిస్తుంటారు. హద్దు మీరిన వారిని తగిన సమయంలో శిక్షిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు శాసనసభ్యులుగా ప్రతిపక్షంలో కూర్చొని తమ భాషా నైపుణ్యంతో ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా సభలో నవ్వులు పూయించేవారు. ఆ ఇరువురు నాయకుల వాగ్ధాటి ముచ్చటగా ఉండేది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉండిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా వారిపై కోపగించుకునేవారు కారు. అంతే స్పోర్టివ్‌గా బదులిచ్చేవారు. దూషణ భూషణల వల్ల నాయకుల స్థాయి గానీ, ఔన్నత్యం గానీ పెరగదు. ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది మాజీ మంత్రులను ఇప్పటికీ బూతుల మంత్రులని పిల్లలు కూడా పిలుచుకోవడాన్ని తెలంగాణ రాజకీయ నాయకులు గుర్తించి తమను తాము సంస్కరించుకుంటే మంచిది. రాజకీయాల్లో ఉన్నవారు ప్రత్యర్థుల చావు కోరుకోవడం సమర్థనీయం కాదు. ఇకనైనా తెలంగాణలో ప్రజలు ఎంత స్వచ్ఛంగా ఉంటారో రాజకీయ నాయకులు కూడా అలాగే ఉండాలని, ఉంటారని కోరుకుందాం!

> కొత్తగా అధికారంలోకి వచ్చినవాళ్లు పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. ముఖ్యమంత్రిగా పద్నాలుగేళ్ల పాటు పనిచేసిన చంద్రబాబు కూడా ఇప్పుడు పరిస్థితులను చక్కదిద్దడానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టిందని చెబుతున్నారు. అలాంటిది ముఖ్యమంత్రిగా ఏ మాత్రం అనుభవం లేని జగన్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నాటి నుంచే తాను రూపొందించుకున్న దోపిడీ స్కెచ్‌ను అమలు చేయడం మొదలుపెట్టారు. ఈ స్కెచ్ అమలులో సహకరించే అధికారులను గుర్తించి అంతే వేగంగా ఆయా స్థానాలలో నియమించారు. మద్యం కుంభకోణం సాఫీగా జరగడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించారంటే ఆ స్కాం లోతు తెలుస్తోంది. ఏపీ బ్రూవరీస్ కార్పొరేషన్‌ను ప్రభుత్వ సంస్థగా కాకుండా ప్రైవేటు సంస్థలా నడిపారు. భారతి సిమెంట్‌లో పనిచేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి తన మనుషులతో మద్యం అమ్మకాలను పర్యవేక్షించేవారు. ఆయన మనుషులకు ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించడం హైలైట్.

దళిత సాహిత్యోద్యమ వేగుచుక్క

> దళిత హక్కుల తొలి దండోరా కుసుమ ధర్మన్న. వంద సంవత్సరాల క్రితమే దళిత సాహిత్య మౌలిక ఆశయాలను దశదిశలా చాటిచెప్పిన కుసుమ ధర్మన్న సృజన తత్వాన్ని, జీవన గమనాన్ని తడిమిచూస్తే ఆయన ప్రత్యామ్నాయ దృక్పథం అవగతమవుతుంది. హైదరాబాద్ కేంద్రంగా దళిత విముక్తి కోసం చారిత్రాత్మకమైన పోరాటం చేసిన భాగ్యరెడ్డివర్మ స్ఫూర్తి, ఆయన స్థాపించిన ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్, జీవరక్షా జ్ఞాన ప్రచార మండలి, మన్యసంఘాల పనితీరు, ఆ సంస్థల లక్ష్యాలు కుసుమ ధర్మన్న ఉద్యమ ప్రస్థానానికి ఎంతగానో దోహదపడ్డాయి.

జాతీయోద్యమ సందర్భంలో రాజమండ్రి వచ్చిన మహాత్మగాంధీ మాల మాదిగ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, ఒక ప్రజానాయకుణ్ణి ఆహ్వానించారు. గాంధీ పిలిచాడు కదా అని ఆ నాయకుడు మహదానందంతో అమాంతం పరుగెత్తుకుంటూ వెళ్లలేదు. 'అంటరాని ప్రజల పట్ల నిజంగా మీకు ప్రేమ ఉంటే స్వయంగా మా మాల పేటకు రావాలని' ఆ నాయకుడు గాంధీ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. గాంధీ స్వయంగా లక్ష్మీవారపుపేటకు వెళ్ళి ఆ నాయకుడిని కలుసుకున్నాడు. అంటరాని ప్రజల సంక్షేమానికి సంబంధించి ఆ నాయకుడి సూచనలు, సలహాలు తీసుకున్నాడు. అచంచలమైన అతని దీక్షాదక్షతలను, ఆత్మగౌరవతత్వాన్ని గ్రహించిన గాంధీ అప్పటికప్పుడు అభినందన పత్రం రాసి ఆయనకందించాడు. సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో అభినివేశం కలిగిన ఆ నాయకుడు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌తో పాటు నిజామాంధ్రలోని ప్రముఖ నాయకుల ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. అణగారిన వర్గాల అభివృద్ధికి జీవితాన్ని ధారవోసిన ఆ ప్రజానాయకుడి పేరు దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న. 'హక్కుకై ప్రాణమిడుట ద్రోహంబుకాద'ని తెలుగు సాహిత్యంలో తొలిసారిగా దళిత హక్కుల దండోరా మ్రోగించిన కవి. కుల, మత, వర్గాది సనాతన వ్యాధులతో కునారిల్లుతున్న సమాజ ఆరోగ్యానికి తన రచనల ద్వారా సముచితమైన కార్యాచరణ ప్రణాళిక నందించిన అసమాన సాంస్కృతిక వైద్యుడు కుసుమ ధర్మన్న. దేశ సౌభాగ్య మూలాలను విస్మరించి స్వరాజ్య ఫలాలను ఆరగించాలని వడివడిగా పరుగులు తీస్తున్న పోరాట యోధులకు సరైన దారి చూపిన దార్శనికుడు కుసుమ ధర్మన్న.

కవిగా, రచయితగా పత్రికా సంపాదకునిగా, బహుముఖ పాత్ర పోషించిన ధర్మన్న వెలివాడల చీకటిలో కుమిలిపోతున్న దళిత జాతిని చైతన్యభరితం చేశాడు. ఆధిపత్యవర్గాలు నిర్దేశించే ప్రధాన స్రవంతి ఉద్యమాల వెల్లువలో కొట్టుకుపోకుండా, మొక్కవోని సంకల్పంతో 'ఆత్మగౌరవంబు నలరంగ', 'సాంఘిక సమరమ్ము సలుపంగ' కుసుమ ధర్మన్న అట్టడుగు బతుకు పొరల్లోకి సాగిపోయాడు. అస్తిత్వ ఉద్యమాలు, కుల నిర్మూలనా పోరాటాలు అందించిన కొత్త అజెండా వెలుగుల్లో దళిత సాహిత్య చింతన గురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా చర్చలు జరుగుతున్న ఈ సందర్భంలో దాదాపు వంద సంవత్సరాల క్రితమే దళిత సాహిత్య మౌలిక ఆశయాలను దశదిశలా చాటిచెప్పిన కుసుమ ధర్మన్న సృజన తత్వాన్ని, జీవన గమనాన్ని తడిమిచూస్తే ఆయన ప్రత్యామ్నాయ దృక్పథం అవగతమవుతుంది. ఆధునికాంధ్ర మహాకవులు 'హంగ్రీథర్టీస్' ప్రభావిత మహామహులు చూపుసారించని అసమ సమాజ ముఖచిత్రాన్ని కుసుమ ధర్మన్న తన రచనల్లో అద్భుతంగా ఆవిష్కరించాడు. అణగారిన వర్గాల నాయకుడిగా నిరంతరం ప్రజాజీవితంలో గడిపిన ధర్మన్న తదనుగుణమైన అనుభవాలతో, దళిత జీవన వాస్తవికతతో గొప్ప రచనలు చేశాడు.

'స్వరాజ్యం నా జన్మహక్కు' నినాదానికి భిన్నంగా 'సమానత్వం నా జన్మహక్కు' అని జాతీయోద్యమ పరిమితులను విమర్శించిన డాక్టర్ బాబాసాహెబ్



అంబేడ్కర్ కంటే ముందుగానే కుసుమ ధర్మన్న 1921 నుండి దళిత జాతీయ వాదాన్ని తన పాటల ద్వారా, పద్యాల ద్వారా సరళ సుందరంగా ప్రబోధించాడు. సామాజిక ప్రతిబంధకాల పట్ల మౌనం వహించి, స్వదేశ దాస్య బంధనాలను నిర్మూలించాలనే సందేశంతో సమకాలిన కవులందరూ ఘోషిస్తుంటే, 'స్వకులమునకాపాదించిన హైన్యతను నివారించుటయే జీవితోద్దేశము'గా కుసుమ ధర్మన్న కవితాగానం చేశాడు. స్వాతంత్ర్యోద్యమ కవులు భారతదేశ విముక్తి తత్వోపదేశాలను ప్రవచిస్తుంటే ఇందుకు భిన్నంగా కుసుమ ధర్మన్న 'నిమ్నజాతి ముక్తి తరంగిణి'యై జీవితపు సన్నని సందుల్లోకి ప్రవహించాడు. జాతీయోద్యమ కవులు, రచయితలు, భారతదేశ పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక వైభవప్రాభవాలను కీర్తిస్తుంటే ధర్మన్న మాత్రం సామాజిక వాస్తవికతను అర్థం చేసుకుని దళితుల చారిత్రక ఔన్నత్యాన్ని దళితుల సాంస్కృతిక ఘనతను, వారి శ్రమైక జీవన స్థితిగతులను విశదీకరించాడు. బ్రిటీష్ పాలకుల దుర్నీతిని ఎండగట్టాడు. ఒకవైపు సాటి మనుషులను కఠినంగ అణిచివేస్తూనే, మరొకవైపు తెల్లదొరల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే నాయకుల ద్వంద్వ ప్రవృత్తిని ధర్మన్న విమర్శించాడు. ప్రత్యామ్నాయ వివేచనతో, అనుభవజ్ఞానంతో జాతీయోద్యమ లోపభూయిష్ట విధానాలను ఎంతో సాహసోపేతంగా ఎత్తిచూపాడు. గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన మాకొద్దీ 'తెల్లదొరతనం' అనే గేయం తెలుగునాట ప్రతిధ్వనిస్తున్న సమయంలో ఖ్యాతి గాంచిన గరిమెళ్ళ గేయస్ఫూర్తికి భిన్నంగా 'మాకొద్దీ నల్లదొరతనం' అనే గీతంతో కుసుమ ధర్మన్న సాహిత్యంలో సంచలనం సృష్టించాడు. అణగారిన ప్రజల్లో అగ్ని పర్వతంలా పెల్లుబుకుతున్న భావావేశానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన ఈ గీతం భారతీయ సాహిత్యంలోనే విలక్షణమైనదిగా పేర్కొనవచ్చు. విప్లవాత్మకమైన మా కొద్దీ నల్లదొరతనం గీతం దళిత జాతీయవాదానికి మేనిఫెస్టోలాగా కనబడుతుంది. అవిశ్రాంతమైన శ్రమతో తమ జవసత్వాలను ధారపోసి వ్యవసాయ అభివృద్ధికి ఆధారభూతంగా నిలిచే కూలీలతో సంబంధం లేకుండా అన్నట్లుగా కేవలం రైతును మాత్రమే తెలుగు కవులు ఉన్నతీకరించారు. ఇలాంటి వేలం వెర్రి సాహిత్య తత్వాన్ని త్రోసిరాజని బడారైతుల పెత్తనాన్ని విమర్శించి దళిత పాలేరుల కృషిని ప్రస్తుతించాడు ధర్మన్న. 'కడుపు గొట్టి నీదు కష్టార్జితము లాగి/ గుణముధనము జెరచి కూడు తినుచు/ గొప్పవాడననుచు నొప్పుచుండడె? రైతు' అంటూ రైతుల ఉన్నతికి దళితుల పతనానికి కారణాలను విశ్లేషించాడు.

హైదరాబాద్ కేంద్రంగా దళిత విముక్తి కోసం చారిత్రాత్మకమైన పోరాటం చేసిన భాగ్యరెడ్డివర్మ స్ఫూర్తి, ఆయన స్థాపించిన ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్, జీవరక్షా జ్ఞాన ప్రచార మండలి, మన్యసంఘాల పనితీరు, ఆ సంస్థల లక్ష్యాలు కుసుమ ధర్మన్న ఉద్యమ ప్రస్థానానికి ఎంతగానో దోహదపడ్డాయి. మాకొద్దీ నల్లదొరతనం గీతంలో తెలంగాణ దళిత సంస్కర్తలైన బాలముకుంద, రావిచెట్టు రంగారావు, పల్లాట శేషయ్య, ఆదయ్యలాంటి ఎంతో మంది సేవలను ధర్మన్న స్మరించుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చు. హైదరాబాద్‌ను కుసుమ ధర్మన్న గుండెలకు హత్తుకున్నాడని, నైజాంరాష్ట్ర సంస్కర్తల గురించి ధర్మన్న లాగా తెలంగాణవాళ్లు రికార్డు చేయలేదని సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నాడు.

▪ డాక్టర్ కోయి కోటేశ్వరరావు

(నేడు కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా మునిమనుమరాలు రాధా కుసుమ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో సాహితీ సమాలోచన, గోరేటి వెంకన్న, బిక్కి కృష్ణలకు జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం)





ఇల వైకుంఠం

వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ (ఇన్‌సెట్‌లో) అందంగా ముస్తాబైన కల్యాణ వేదిక, పెండ్లి కుమారుడిగా స్వామివారు





కల్యాణం.. కమనీయం

వెంకటపాలెంలో ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

- తిరుమలను తలపించిన అమరావతి
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- హాజరైన సీఎం దంపతులు, గవర్నర్, ఇతర ప్రముఖులు

తిరుమలేశుని తిరు కల్యాణ మహోత్సవంతో ఆధ్యాత్మిక నగరి అమరావతి అపర వైకుంఠాన్ని తలపించింది. అన్నమయ్య సంకీర్తనాగానాలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, ముచ్చటైన మంగళవాయిద్యాల నడుమ వెంకటపాలెంలోని తిరుమల తిరుపతి దేవస్థాన ప్రాంగణంలో శనివారం సాయంసంధ్యవేళ ఉభయ దేవేరుల సహితంగా శ్రీవారి కల్యాణోత్సవం జరిగింది. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి ఉత్సవాన్ని కనులారా వీక్షించి తరించేందుకు అశేష భక్తవాహిణి అమరావతికి తరలిరాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. - ఆంధ్రజ్యోతి, గుంటూరు

● ఇక ఒంటిపూట

జిల్లాలోని అన్ని పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు మొదలయ్యాయి. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొన్ని పాఠశాలలకు సెలవులు కూడా ప్రకటించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు మిట్ట మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శనివారం ఇలా చున్నీ కప్పుకొని ఇంటికి బయల్దేరారు.



రైతు సమస్యల్ని గడువులోపు పరిష్కరించాలి

- అధికారులకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఆదేశాలు

8లో

మిగులుతో దిగులు

ఉమ్మడి కృష్ణాజిల్లా రేషనలైజేషన్‌లో 600 మంది ఉద్యోగుల మిగులు

రెవెన్యూ శాఖకు చెందినవారే ఎక్కువ

- 300 పైబడి వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు
- ఇతర శాఖలకు వెళ్లాలంటున్న ప్రభుత్వం
- ఒప్పుకోమంటున్న వీఆర్వోలు
- రెవెన్యూలోనే కొనసాగించాలంటూ పట్టు

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో 600 మంది ఉద్యోగులు మిగులు తేలారు. వీరిని వివిధ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పంచాయతీరాజ్‌కు జవసత్వాలు ఇచ్చేందుకు ఇది దోహదపడుతుంది. ఇతర శాఖల్లోనూ ఖాళీ పోస్టుల కొరత తీర్చనుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో మిగులు ఉద్యోగుల్లో సగభాగం రెవెన్యూ ఉద్యోగులే ఉన్నారు. మొత్తం 600 మంది మిగులు ఉద్యోగుల్లో 300 మంది వరకు వీఆర్వోలు ఉన్నారు. మిగిలిన వారిలో 50 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు, మిగతావారు ఇంజనీరింగ్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతరులు.

వీఆర్వోల ఆందోళన

రేషనలైజేషన్ ప్రక్రియలో సగభాగం వీఆర్వోలు ఉండటంతో వారందరినీ వేరే శాఖకు బదిలీ చేశారు. దీనిపై వీఆర్వోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూలోనే తమను కొనసాగించాలని పట్టుబడుతున్నారు. సమస్యను రెవెన్యూ సంఘ నేతల దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణ తెలపాలని ఒత్తిడి తెస్తున్నారు. 2012-14 సంవత్సరంలో నియమితులైన వీఆర్వోలు మాత్రం తాము ఏ శాఖకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు. మిగిలిన వారు మాత్రం ససేమిరా అంటున్నారు. సచివాలయ వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నట్టుగా.. సాధారణ రెవెన్యూ విభాగంలోని వీఆర్వో ఖాళీ పోస్టుల్లోకి వెళ్లడానికి వీల్లేదు. ఎందుకంటే.. 2008లో ఏపీపీఎస్సీ ద్వారా డైరెక్టుగా వీఆర్ఏ పోస్టుల కోసం పరీక్షలు రాసి పాసై కొంతకాలం వీఆర్ఏలుగా పనిచేశారు. ఆ తర్వాత వీఆర్వోలుగా పదోన్నతులు అందుకున్నారు. పదోన్నతికి ఇంటర్‌ను విద్యార్హతగా పేర్కొన్నారు. అయితే, పదో తరగతి అర్హతతో ఎంపికైన తమకు మధ్యలో విద్యార్హతలను మార్చి అన్యాయం చేయటమేమిటని వీఆర్వోలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు కోర్టులో విచారణలో ఉంది. కాబట్టి ఖాళీ వీఆర్వో పోస్టులను ఇప్పటికిప్పుడు భర్తీ చేయటం కుదరని పరిస్థితి.



ఇతర శాఖల్లో పనిచేస్తే తప్పేంటి?

సచివాలయ వీఆర్వోలు ఇతర శాఖల్లో పనిచేస్తే వచ్చే నష్టమేమీ ఉండదు. మిగులుగా ఉన్నారన్న పేరుతో ప్రభుత్వం వారి ఉద్యోగాలను తొలగించట్లేదు. వారిని వేరే శాఖలో ఖాళీగా ఉన్నచోట మాత్రమే పోస్టింగ్ ఇస్తోంది. ఒక ఉద్యోగిగా ప్రభుత్వం ఎక్కడ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా విధులు నిర్వహించాలి. ప్రస్తుతం సచివాలయాల్లో అనేక శాఖల ఒత్తిడిని కూడా వీఆర్వోలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో వారిని ఇతర శాఖలకు పంపడం వల్ల ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.

ఎందుకు వెళ్లనంటున్నారు?

రెవెన్యూ శాఖలో త్వరగా పదోన్నతులు ఉంటాయి. వీఆర్వోల నుంచి ఆర్ఐ, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ పోస్టులకు అవకాశం ఉండటంతో సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ఆ శాఖను వదిలి వెళ్లనంటున్నారు. దీనికి తోడు ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఎక్కువగా ఉండే రెవెన్యూ శాఖ పరిధిలో విచ్చలవిడిగా అవినీతి వ్యవహారాలు ఉండటం వల్ల.. వాటికి అలవాటు పడిన కొందరు ఇతర శాఖలకు వెళ్లడానికి ఇష్టపడట్లేదని తెలుస్తోంది.

పంచాయతీలపై తగ్గనున్న భారం

ప్రస్తుతం పంచాయతీల్లో సమర్థవంతమైన పరిపాలనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఐదారు పంచాయతీలకు ఒకే ఒక్క కార్యనిర్వహణాధికారి (ఈవో) పని మిగతా 6లో..

రౌడీషీటర్ దారుణ హత్య

మద్యం మత్తులో రెండు టీమ్‌ల మధ్య గొడవ

- ఒకరినొకరు దూషించుకుని హత్య
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- ఫెర్రీలోని ఓ రేకుల షెడ్డులో ఘటన

ఇబ్రహీంపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. కంచికచర్లకు చెందిన జరబన వెంకట్ (43) గత ఏడాది నుంచి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ కాలనీలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఫెర్రీకి, జూపూడికి చెందిన వ్యక్తులతో స్నేహం ఏర్పడింది. వెంకట్‌కు టీడీపీలో ఉన్న పరిచయాల నేపథ్యంలో.. ఫెర్రీలో ఇసుక రేవు తెరిపిస్తే డబ్బు సంపాదించుకోవచ్చని అతడి స్నేహితులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి ఫెర్రీ వద్ద ఓ చోట మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. జరబన వెంకట్ సహా చిప్పల వెంకటేశ్వరరావు, పీతా రామకృష్ణ (జూపూడి) ఒక బృందంగా, పొనమాల వేణు, చింతా వీరాంజనేయులు, కొప్పనాతి వీర్రాజులు మరో బృందంగా మద్యం సేవించారు. వీరంతా చింతా వీరాంజనేయులుకు చెందిన రేకుల షెడ్డులో మద్యం సేవిస్తుండగా, గొడవ మొదలైంది. చివరకు అది పెద్దది కావడంతో వెంకట్‌ను పొనమాల వెన్నెలరావు అలియాస్ వేణు షెడ్డులో ఉన్న ఇనుప కుర్చీతో గట్టిగా తలపై మోదాడు. తీవ్ర రక్తస్రావంతో రూమ్‌లో నుంచి బయటకు వచ్చిన వెంకట్‌ను వేణు మరోమారు సిమెంట్ రాయితో కొట్టి చంపాడు. అడ్డొచ్చిన చిప్పల వెంకటేశ్వరరావును మరో ఇద్దరు చంపబోతుండగా పరారయ్యాడు. కాగా, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, ఇబ్రహీంపట్నం సీఐ ఎ.చంద్రశేఖర్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేశారు. పొనమల వేణు, చింత వీరాంజనేయులు, కొప్పనాతి వీర్రాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



జరబన వెంకట్ (ఫైల్)

హతుడిది నేరచరిత్రే..

స్నేహితుల చేతిలో హత్యకు గురైన రౌడీషీటర్ వెంకట్‌ది ఆది నుంచి నేరచరిత్రేనని పోలీసులు తెలిపారు. హత్య కేసుతో పాటు మరో పది కేసులు వరకు ఉన్నాయి. ఏడాది క్రితం కంచికచర్లను వదిలేసి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ కాలనీలో భార్య, పాపతో కలిసి అద్దెకుంటున్నాడు. స్నేహితులతో కలిసి జల్సాగా తిరుగుతూ ఉంటాడు. చివరికి ఆ స్నేహితుల చేతిలోనే హత్యకు గురయ్యాడు. కాగా, పోస్టుమార్టం అనంతరం వెంకట్ మృతదేహాన్ని స్వగ్రామం కంచికచర్లకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కోకో ధర ధమాల్!

సగానికి పైగా పడిపోయిన రేటు

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-17	సహర్ : 05-02
(ఆదివారం సాయంత్రం)	(సోమవారం ఉదయం)

● ఇంటిబాట



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. దీంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. విద్యార్థుల రాకపోకలతో పండిట్ నెహ్రూ బస్టాండ్ కిటకిటలాడింది.

ఓఆర్ఆర్‌పై రియల్ ఆశలు

అమరావతివైపు పొరుగు రాష్ట్రాల రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్ల చూపు

నగరంలోని బిల్డర్లతో సంప్రదింపులు.. ఓఆర్ఆర్ గురించి వాకబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై పొరుగు రాష్ట్రాల రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు ఆశ పెట్టుకున్నారు. ఈ రింగ్ రోడ్డుకు భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై పనులకు శంకుస్థాపన జరిగే క్షణం కోసం మిగతా 6లో..

తిరువూరులో నెగ్గేదెవరు?

మునిసిపాలిటీలో వేడెక్కుతున్న రాజకీయం

వైసీపీ కౌన్సిలర్లలో మారుతున్న సమీకరణలు

తిరువూరు మునిసిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య జరుగుతున్న వార్ వన్‌సైడ్ అయిపోతుందా? అసలు అవిశ్వాసం నెగ్గుతుందా? అందుకు సరిపడా బలం అసమ్మతివాదుల వద్ద ఉందా? అవిశ్వాసానికి మరోవర్గం కౌన్సిలర్లు తట్టుకుని నిలబడగలరా? టీడీపీ కౌన్సిలర్ల మద్దతు ఎవరికి?.. ఇన్ని ప్రశ్నల నడుమ తిరువూరు రాజకీయ సమీకరణాలు రోజుకోరకంగా మారిపోతున్నాయి.

ఆంధ్రజ్యోతి, తిరువూరు : తిరువూరు మునిసిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య అంతర్గత పోరుతో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. బోర్డులో కొందరు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించడంతో పాటు అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్‌కు ఇవ్వడంతో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు తమ బలం పెంచుకునేందుకు మిగిలిన కౌన్సిలర్ల మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తుండగా, ఎలాగైనా అవిశ్వాసం నుంచి గట్టెక్కేందుకు ఇతర కౌన్సిలర్లు, పార్టీ నాయకులు వ్యూహరచనలు చేస్తున్నారు. వైసీపీ కౌన్సిలర్లలో ఎక్కువమంది పార్టీకే కట్టుబడి ఉంటామని తేల్చి చెబుతుండటంతో సమస్య శాంతియుతంగానే సమసిపోతుందని కొందరు నాయకులు పేర్కొంటున్నారు.

పార్టీ పెద్దల రహస్య మంతనాలు

- ప్రతిపక్షం అండతో అవిశ్వాసం నెగ్గేందుకు ఆరాటం
- అధిష్ఠానం నిర్ణయమేనంటున్న టీడీపీ కౌన్సిలర్లు

అసమ్మతి నేతల వెనుకున్నదెవరు?

ఎలాగైనా అవిశ్వాసం నెగ్గించుకుని చైర్‌పర్సన్‌గా తమవర్గం వారిని నిలబెట్టాలని వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు.. ఇతర కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎలాగైనా అవిశ్వాస గండం నుంచి గట్టెక్కాలని ఇంకో వర్గం వైసీపీ కౌన్సిలర్లు తమ ప్రయత్నాల్లో మునిగి తేలుతున్నారు. పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వైసీపీకి చెందిన ఓ కౌన్సిలర్ బంధువు అవిశ్వాసం పెట్టే విషయంలో చక్రం తిప్పుతున్నట్టు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. కాగా, స్థానిక వైసీపీ నాయకులు సమస్యను స్థానిక నేతల వద్దకు తీసుకెళ్లి ఆ నాయకుడికి చెక్‌పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

టీడీపీ సభ్యులు మద్దతు ఇచ్చేనా..?

మునిసిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లలో 17 మంది వైసీపీ, ముగ్గురు టీడీపీకి చెందినవారు. కాగా, ప్రస్తుతం మిగతా 6లో..



గతంలో మాదిరిగా సమస్య సర్దుకుంటుందా..?

ఈ అవిశ్వాస అంశం గత టీడీపీ బోర్డు మాదిరిగానే సమసిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తిరువూరు నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యాక 2014లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ 12 స్థానాలు, వైసీపీ 7 స్థానాలు, సీపీఎం ఒకస్థానం గెలుచుకున్నాయి. అప్పట్లో చైర్‌పర్సన్ ఎంపిక అంశం పార్టీలో వివాదం లేపింది. తొలుత ఒకటో వార్డు నుంచి గెలుపొందిన మోదుగు రాజకుమారిని చైర్‌పర్సన్‌గా కొందరు ప్రతిపాదించారు. దాదాపు ఎంపిక ఖాయం అవుతుందనుకునే సమయంలో కొందరు నాయకులు ప్రవేశించి రాజకీయాన్ని విజయవాడకు మార్చారు. అప్పటి పరిణామాల్లో చైర్‌పర్సన్‌గా మరకాల కృష్ణకుమారిని కూర్చోబెట్టారు. రెండున్నరేళ్ల తరువాత ఆమె పదవి నుంచి దిగిపోయి, రాజకుమారికి అవకాశం ఇచ్చేలా బాండు పేపర్‌పై పార్టీ పెద్దల సమక్షంలో అగ్రిమెంట్ రాయించారు. ఆ తర్వాత ఆ అగ్రిమెంట్ అమలుకు నోచుకోలేదు. ఆశావాహుల్ని బుజ్జగించి బోర్డును కొనసాగించారు. ప్రస్తుతం చైర్‌పర్సన్ మార్పు విషయంలో ఎటువంటి లిఖితపూర్వక హామీ లేదని, నాడు ప్రతిపాదించిన నాయకుడు ప్రస్తుతం లేడని, ఈ అవిశ్వాసం అంశం నాటి అగ్రిమెంట్ లాగానే ముగిసిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



● భక్త ప్రహ్లాద

8లో

సురభి నాటక మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు భక్తప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారుల అభినయం ఆకట్టుకుంది.



● రథోత్సవం

తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి అమ్మవారి రథోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి రథం వెంట సాగారు.

8లో


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు





అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణ్యాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు


ర్యాలీలో పాల్గొన్న సీసీఎల్ఏ ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే వసంత

మానవ తప్పిదాలతో మనుగడకు ముప్పు

- సీసీఎల్ఏ ప్రత్యేకాధికారిణి జయలక్ష్మి

ఇబ్రహీంపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మనిషి చేసే చిన్న చిన్న తప్పులే మనుగడకు పెద్ద ముప్పు అని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను వినియోగించకుండా మనం చేసే ఓ చిరు ప్రయత్నం భావితరాలకు బంగారు భవిష్యత్‌కు నాంది అని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), జిల్లా ప్రత్యేక అధికారిణి జి.జయలక్ష్మి అన్నారు. స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర దివస్'ను జూపూడిలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మితో పాటు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు. తొలుత చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీ, విక్రయాల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటి గ్రామసభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల మనం సమాజానికి చెడు చేస్తున్నామన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం దుష్పరిణామాలను వివరించారు. జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్దామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ నియంత్రణకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కృషి చేయనున్నట్లు చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో నావంతు కృషి చేస్తానని కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్, చెన్నుబోయిన చిట్టిబాబు, గరికపాటి శ్రీనివాసరావు, ఎంపీపీ జ్యోత్స్న, సర్పంచ్ కె.దేవమాత, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆసుపత్రిలో విజయవంతంగా రీడో వాల్వ్ సర్జరీ

పెనమలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో సంక్లిష్ట రీడో వాల్వ్ చికిత్స విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఘంటసాలకు చెందిన లక్ష్మికి 17సంవత్సరాల వయస్సులో గాంధీ ఆసుపత్రిలో గుండెకు సంబంధించి మొదటి వాల్వ్ సర్జరీ జరగ్గా.. 28ఏళ్ల వయస్సులో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో రెండో వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది. మళ్లీ 39 ఏళ్ల వయస్సులో ప్రొస్థెటిక్ వాల్వ్ క్షీణత కారణంగా తీవ్రమైన శ్వాస సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె పోరంకిలోని క్యాపిటల్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు వీఎస్ఆర్ భూపాల్, డాక్టర్ హేమ కృష్ణ సాయిల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద విజయవంతంగా శనివారం సర్జరీ నిర్వహించారు.


రోగితో ఆసుపత్రి వైద్యులు

సమష్టి కృషితోనే జిల్లా ప్రగతి

- భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి


మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమష్టి కృషితో అన్ని రంగాల్లోనూ జిల్లాను అగ్రగామిగా నిలపాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ), జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆయా శాఖల ప్రగతిపై తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాధాన్యత రంగాలు, కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల అమలు నూరుశాతం జరగాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల లబ్ధిని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించి లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రానీయకుండా ముందుగానే పరిశీలించుకోవాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం, ఇతర మార్గాల ద్వారా నమోదవుతున్న అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంపై అలసత్వం వహించే అధికారులపై చర్యలు వుంటాయన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను జిల్లాలో నూరుశాతం అమలుతో లబ్ధిచేకూరుస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో జాబ్‌మేళా నిర్వహణ, నైపుణ్యాన్ని పెంపొందించడం ఉద్యోగ కల్పన తదితర లక్ష్యాలను పూర్తిచేశామన్నారు. నాటుసారా నిర్మూలన, నకిలీ మద్యం నియంత్రణలో భాగంగా నవోదయం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాన్ని చేరుకొన్నామని, ఉపాధి పథకంలో ప్రతి కూలీకి పని కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇ-పంట, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథక అమలు, పశుసంవర్ధ శాఖలో గోకులాలు, వాక్సినేషన్ తదితర లక్ష్యాలను పూర్తిచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మికి వివరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహం, సీపీఓ శ్రీలత, ఆర్డీఓలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చైతన్య స్ఫూర్తి వినియోగదారుల హక్కుకు దిక్సూచి

- వినియోగదారుల హక్కుల దినోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : చైతన్య స్ఫూర్తి వినియోగదారుల హక్కులకు దిక్సూచి అని, వినియోగదారులు తమ హక్కులపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకొని హక్కులను పరిరక్షించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సం సందరభంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత పౌరసరఫరాల శాఖ-దీపం-2 పథకం, ఆహార భద్రత ప్రమాణాలు, తూనికలు-కొలతల శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరం వినియోగదారులమేనని, నిత్యజీవితంలో రోజూ ఏదో ఒక వస్తువును కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్లో లభించే వివిధ రకాల వస్తువుల నాణ్యత, సరైన ప్రమాణాలతో రూపొందాయా అనే అంశంపై వినియోగదారులు దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది సుస్థిర జీవనశైలికి మార్పు ఇతివృత్తంతో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, వారసత్వంగా వచ్చి వనరులను ఎంత అవసరమో అంతవరకు మాత్రమే వినియోగించుకొని భావితరాలకు అందించాల్సిన అవసరముందని, అప్పుడే సుస్థిరత సాధ్యమని పేర్కొన్నారు. మారుతున్న అవసరాలు, మార్కెట్ ధోరణులు, సాంకేతికత అనుసంధాన ఈ-కామర్స్, ఆన్‌లైన్ లావాదేవీలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టాలు అమలవుతున్నాయని జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు శశికళ వివరించారు. డీఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, డీఎస్‌వో ఎ.పాపారావు, లీగల్ మెట్రాలజీ అధికారి ఎ.కృష్ణచైతన్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


స్టాల్‌లో వస్తువులను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఓఆర్ఆర్‌పై రియల్ ఆశలు

(5వ పేజీ తరువాయి)

చూస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో ఉంటున్న పలు రియల్ ఎస్టేట్ సంస్థలు విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన బిల్డర్లతో తరచూ సంప్రదింపులు చేయటం ఓఆర్ఆర్‌పై వారికున్న ఆసక్తిని తెలియజేస్తోంది. దీంతో వీరంతా భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నారు. నగరంలోని పలువురు బిల్డర్లతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడిన సందర్భంలో ఇతర రాష్ట్రాల బిల్డర్ల ఆసక్తి వెలుగులోకి వచ్చింది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు.. దేశంలోని అనేక ఎకనమిక్ కారిడార్లతో పాటు నూతన రాజధానికి అనుసంధానం కావటం వల్ల రియల్ ఎస్టేట్ వృద్ధి చెందుతుంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అవాంతరాలు లేకపోయినప్పటికీ ఎప్పటికి కార్యరూపంలోకి వస్తుందో అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ అవుటర్ అలైన్‌మెంట్ పరిధిలో ఇప్పుడిప్పుడే భూముల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందినవారు వెంచర్లు, నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా ఆలోచనలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అవుటర్ రింగ్ రోడ్డు వచ్చాక భారీస్థాయిలో అభివృద్ధి జరిగింది. అనేక రాష్ట్రాల నుంచి రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు వచ్చి పెట్టుబడులు పెట్టారు. అదే తరహాలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుపై పొరుగు రాష్ట్రాల సంస్థలు ఆసక్తి చూపించటం మంచి పరిణామంగానే చెప్పుకోవచ్చు.

మిగులుతో దిగులు

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి వస్తోంది. ఈవోలపై తీవ్ర పనిభారం పడుతోంది. గ్రామ కార్యదర్శులు లేకపోవటం వల్ల పంచాయతీలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే, మిగిలిన కొన్ని ప్రభుత్వ శాఖల్లో కూడా ఖాళీ పోస్టులను భర్తీచేసే అవకాశం ఉంటుంది.

వీఆర్వోల అంగీకారంతో ఖాళీలు భర్తీ చేయండి

- జి.అనుపమ, ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలను ఇతర శాఖలకు బదలాయించే విషయంలో వారి నుంచి ప్రభుత్వం అంగీకారం తీసుకోవాలి. ఇతర శాఖలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్న వారిని నిరభ్యంతరంగా ఆయా శాఖలకు వాడుకోవచ్చు. అంగీకారం తెలపని వారిని.. రెవెన్యూలో విభాగంలోని ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలి. కోర్టు కేసుల గురించి పక్కన పెడితే, సీసీఎల్ఏ తాజా ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని వాటిని భర్తీ చేసే వరకు మిగులు వీఆర్వోలను కదిలించవద్దు.లేదంటే సచివాలయ వీఆర్వోలను రెవెన్యూతో అనుబంధమైన దేవదాయ శాఖ, సర్వే అండ్ ల్యాండ్స్, సివిల్ సప్లయిస్ వంటి శాఖల్లోకి పంపించాలి.

తిరువూరులో నెగ్గేదెవరు?

(5వ పేజీ తరువాయి)

వైసీపీలోని రెండు వర్గాల వారూ టీడీపీ సభ్యుల మద్దతు ఆశిస్తున్నారు. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఓ నాయకుడు.. పార్టీకి చెందిన పట్టణ స్థాయి నాయకుడు, ప్రతిపక్ష సభ్యుడితో మునిసిపాలిటీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చిస్తున్నారు. అవసరమైతే చైర్‌పర్సన్‌కు మద్దతుగా నిలవాలని ఆ నాయకుడు కోరగా.. టీడీపీ సభ్యులు మాత్రం తటస్థంగా ఉంటామని తేల్చిచెప్పారు. పార్టీ ఆదేశాలను బట్టి తమ నిర్ణయం ఉంటుందని చెప్పినట్లు తెలుస్తోంది.

సికింద్రాబాద్‌కు రాకుండా మరో 9 రైళ్ల దారి మళ్లింపు

- స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం నిర్ణయం: ద.మ.రైల్వే

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనుల నిమిత్తం మరో 9 రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు శనివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో 4 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, లింగంపల్లి మీదుగా, మరో 5 ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపు మళ్లించాలని నిర్ణయించినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 22 నుంచి విశాఖపట్నం-ముంబై-విశాఖపట్నం (20809/20810), మచిలీపట్నం-షిర్డీ-మచిలీపట్నం వీక్లీ (17207/17208), ఏప్రిల్ 23 నుంచి కాకినాడ-షిర్డీ-కాకినాడ ట్రై వీక్లీ (17205/17206), మే 9 నుంచి వాస్కోడగామా-జసిదిద్-వాస్కోడగామా వీక్లీ (17321/17322) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, అమ్ముగూడ, సనత్‌నగర్, లింగంపల్లి మీదుగా మళ్లించనున్నట్లు చెప్పారు. అలాగే ఏప్రిల్ 24 నుంచి విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ- విశాఖపట్నం వీక్లీ (18503/18504), ఏప్రిల్ 25 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ (12787/12788), సంబల్‌పూర్-నాందేడ్ ట్రైవీక్లీ (20809/20810), ఏప్రిల్ 26 నుంచి విశాఖపట్నం-నాందేడ్- విశాఖపట్నం ట్రైవీక్లీ (20811/20812), ఏప్రిల్ 28 నుంచి నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్ బై వీక్లీ (17231/17232) ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి, మౌలాలి బైపాస్ మీదుగా కామారెడ్డి వైపు మళ్లించనున్నట్లు డీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్ లీగ్ పోటీల్లో షైనింగ్ స్టార్ జట్టుపై.. ఆంధ్రా బ్ల్యూస్ విజయం

విజయవాడ(స్పోర్ట్స్)మార్చి15(ఆంధ్ర జ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బీ లీగ్ మ్యాచ్‌ల్లో శనివారం ఆంధ్రా బ్ల్యూస్, షైనింగ్‌స్టార్స్ మధ్య జరిగింది. మెదట బ్యా టింగ్ చేసిన ఆంధ్రాబ్ల్యూ జట్టు 49.4 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన షైనింగ్ స్టార్ జట్టు 46.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసి ఓటమి పాలైంది.

విద్యార్థులే టార్చ్ బేరర్స్ : ఎంపీ కేశినేని చిన్ని

పటమట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రా - 2047 విజన్‌కు విద్యార్థులే టార్చ్ బేరర్స్ అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్టెల్లా కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్స వంలో ఆనయ నాల్గొని ఇంఫర్మేషన్ కార్నర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మేరీ స్టెల్లా కళాశాలలో మార్క్ ట్రస్టు మహిళా సాధికారిక విభాగం ఈకార్యక్రమాన్ని నిర్వహిం చింది. కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కూన రామ్‌జీతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో నందిగామ, జగ్గయ్య పేట, మైలవరం, తిరువూరు శానిటరీ మ్యానిఫ్యాక్టరీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సేవా దృక్ప థంతో పని చేసిన పలువురు మహిళలను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రస్, మార్క్ ట్రస్టు చైర్మన్ సూజీ, ట్రస్టీ సాధిక్, హైకోర్టు న్యాయవాది డి.అనుపమ పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు ఎంపీ అభినందన

వన్‌టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి క్యాడెట్ (అండర్-14), సీని యర్ తైక్వాండో పోటీల్లో 46 పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్ మలిశెట్టి అంకమ్మరావు, టీమ్ మేనేజర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వ ర్యంలో గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఎంపీని తైక్వాండో క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. కోచ్ అంకమ్మ రావు తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందిన 25 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొ న్నారు. జిల్లా క్రీడాకారులు 19బంగారు, 16 రజిత, 11 కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు కోచ్ తెలిపారు. జాతీయ స్థాయిలో 46 పత కాలు సాధించేలా శిక్షణ ఇచ్చిన కోచ్ అంకమ్మ రావును ప్రత్యేకంగా ప్రశంసించారు. క్రీడాకారులు కలతోటి దామిని, రిట్విక, అక్షిత, అఖిలేష్, ధరణి, పూజిత, వంశీ, దినేష్, సాత్విక, బాలచందర్, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా మంత్రి లోకేశ్ సంస్కరణలు

14వ డివిజన్ పాఠశాలలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో ఉత్తమ ఫలితాల కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 14వ డివిజన్‌లోని ఈనాం స్కూల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శనివారం నగర బీజేపీ అధ్యక్షుడు యార్లగడ్డ సందీప్ వితరణతో ప్యాడ్స్, పెన్నులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాల న్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, హెచ్ఎం శ్రీనివాస్, పోతంశెట్టి నాగేశ్వరరావు, మాదల రమేష్, నర్రా కిషోర్ పాల్గొన్నారు.

జీవనశైలిలో జాగ్రత్తలతో వినికిడికి రక్షణ

బెంజిసర్కిల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో తీసుకునే జాగ్రత్తలే వినికిడికి రక్షణగా నిలుస్తాయని ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి అన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డాక్టర్ జి.సమరం అధ్యక్షతన చెవుడు నివారణ అనే అంశంపై జరిగిన ఆరోగ్య సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మూర్తి మాట్లాడుతూ వినికిడి సరిగాలేకపోతే జీవితాన్ని సరిగా ఆస్వాదించలేమని, ప్రతిఒక్కరూ వినికిడి విషయంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పుట్టుకతోనే జన్యుపరమైన లోపాలవల్ల కొందరికి వినికిడి సమస్య ఉంటుందన్నారు. జాగ్రత్తలు పాటించి, వైద్యుల సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములవ్వండి

‘స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర’లో ప్రజలకు ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



మహానాడు రోడ్డులో మొక్కలు నాటుతున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె, పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భారతీనగర్, మార్చి15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నివారించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, ఆటోనగర్ ఐలా సంస్థ, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహానాడు రోడ్డులో ‘స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీ కేశినేని చిన్న, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19రకాల సింగిల్ ప్లాస్టిక్ వస్తువులపై ప్రజలకు అవగాహన కలిగించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటేరు. ఎంపీ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాల న్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి వాటిస్థానంలో పర్యావరణహితమైన సంచులను వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుత సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను సమాజం నుంచి తరిమికొట్టాలంటే ప్రజల సహకారంతోనే సాధ్యం అవుతుందన్నారు. మొక్కలు పెంపకం, పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు చిన్నప్పటి నుంచే అవగాహన పెంచాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాస్, జెడ్ఎం ఏపీఐఐసీ జోనల్ కమిషనర్ కె.బాబ్జీ, ఐలా మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్పొరేటర్ ప్రసాద్, కూటమినేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి ఆధ్వర్యంలో శనివారం ‘స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర’ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులు తరగతి గదులను, కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ



సదస్సులో మాట్లాడుతున్న పూర్ణిమ

మొగల్రాజపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): డబ్బులు చెల్లించి వస్తువులను, వస్తు సేవలను కొనుగోలు చేసే ప్రతి వ్యక్తి ఒక వినియోగదారునిగా తన హక్కులను తెలుసుకోవాలని జనశిక్షణా సంస్థాన్ డైరెకర్ ఎ.పూర్ణిమ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగల్రాజపురం కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ నష్టపోయిన వినియోగదారుడు పరిహారం జిల్లా ఫోరంలో రూ.25 లక్షల వరకు, రాష్ట్ర ఫోరంలో కోటి రూపాయల వరకు, జాతీయ ఫోరంలో కోటికి పైన పరిహారం పొందడానికి వీలుంటుందన్నారు. ప్రతి దానికి బిల్లు, దాని మీద అమ్మకం దారుడి సంతకం, స్టాంప్ ,తేదీ, వారంటీ, గ్యారంటీ కార్డులు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ ఒ.భవానీదేవి, పి. వరలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉంటే ఎక్కడ ఫిర్యాదు చేయాలో నష్ట పరిహారం ఎలా పొందాలో కూడా అవగాహన లేదన్నారు.

ఆటోనగర్ సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

ఆటోనగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లోని స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శనివారం ఆటోనగర్‌లో పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి సమస్యలపై కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకుల మారినా ఆటోనగర్ అభివృద్ధి మాత్రం గాలికి వదిలేశారన్నారు. కృష్ణానది తీరాన ఉన్నా కార్మికులకు ఇప్పటికీ తాగునీరు అందించలేదంటే పాలకులు సిగ్గుపడాలని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల కోసం స్థలాలపై రాయితీలు. విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామని ఊదరగొడతున్న ప్రభుత్వం కనీసం ఆటోనగర్‌లో కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం బాధకారమన్నారు. ఆటోనగర్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.చిన్నారావు, టి.చంద్రశేఖర్, కె.రమణ, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం మహాసభ 23న

మొగల్రాజపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రగతి శీల ఆటోకార్మిక సంఘం మహాసభలను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తెలిపారు. మొగల్రాజపురం యూనియన్ కార్యాలయంలో శనివారం పోస్టర్ అవిష్కరించి, మాట్లాడుతూ జీవో 21 రద్దు, సంక్షేమబోర్డు ఏర్పాటు, ఏడాదికి ప్రతి డ్రైవర్‌కు రూ.15వేలు వంటి హామీలను అమలు చేయించేందుకు ప్రభుత్వం దృష్టికి ఈ మహాసభ ద్వారా తీసుకెళతామన్నారు. ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీధర్ బాబు, రమణ, రఫీఖాన్, యాదగిరి పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

గుణదల: సోషల్ మీడియా వేదికగా నన్ను మానసి కంగా కించపరిచే పోస్టులు పెట్టిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవా లని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ మాచవరం సీఐ ప్రకాష్‌ను కోరారు. ఈ మేరకు దుర్గా నరేష్ మాచవరం సీఐ ప్రకాష్‌ను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. బీసీ యువత కోసం పోరాడుతున్న తనపై అసభ్యకర పద జాలంతో ఈనెల 14న పోస్టులు పెట్టారన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మజ్జిగ ప్యాకెట్ల వితరణ

పటమట: వెంకట పాలెంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొనే భక్తులకు విజయవాడ దత్తపీఠం రెండు వేల మంచినీటి బాటిళ్లు, 2 వేల మజ్జిగ ప్యాకెట్లను వితరణగావించారు. టీటీడీ ఈవో శ్యామలరావుకు వాటిని అందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

భారతీనగర్ : తమ కాలనీలో త్వరగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నాలుగో డివిజన్‌లోని పలు కాలనీలకు చెందిన పలువురు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రాజశేఖర్ బాబుకు విన్నవించారు. సీసీ కెమెరాల కొనుగోలు వ్యయంలో తమ వంతుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, సమన్వయ కర్త కృష్ణమూర్తి భారతీనగర్ కాలనీకి చెందిన మైనేని సాయి బాబు, ప్రసాద్, సుబ్బారావు కాలనీకి చెందిన రాజారావు, సుబ్బారావు, సీటీవో కాలనీకి చెందిన రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోకో ధర ఢమాల్!

సగానికి పైగా పడిపోయిన రేటు ● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కోకో రైతులకు కోలుకోలేని షాక్ తగిలింది. ఈ ఏడాది కనీస గిట్టుబాటు ధర కూడా దక్కని విధంగా ధరలు పడిపోయాయి. దీంతో కోకో సాగుచేస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇతర దేశాల్లో కోకో గింజలు చౌకగా వస్తున్నాయని అవసరాలకు మించి కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకోవడంతో స్థానికంగా సాగు చేసే తమకు ధర అందటం లేదని రైతులు వాపోతున్నారు. మద్దతు ధర లేకపోవడంతో కొందరు రైతులు చెట్లపైనే కాపునకు వచ్చిన కాయలను వదిలేస్తుంటే మరి కొందరు అయినకాడికి దళారులకు అమ్మి నష్టపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్



కోకో పంట మన రాష్ట్రంలో కృష్ణా, ఏలూరు, ఉభయగోదావరి, మన్యం జిల్లాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేస్తుండగా, కృష్ణాజిల్లాలో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా సాగు చేస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఏటా సుమారు 13వేల టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. కోకో గింజల ఉత్పత్తిలో దేశంలోనే మొదటిస్థానంలో మన రాష్ట్రం ఉన్నా గిట్టుబాటు ధర కోసం రైతులు దిక్కులు చూడాల్సి వస్తోంది. కోకో గింజలు ప్రధానంగా చాక్లెట్లు, కేక్ తయారీలో ఎక్కువగా వాడుతుంటారు. సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చాక్లెట్ ఫ్యాక్టరీల లాంటివి స్థాపించడంతో పాటు మల్లవల్లి పారిశ్రామికవాడలోని సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే అక్కడే ఉన్న చాక్లెట్ ఫ్యాక్టరీలతో పాటు పార్లే వంటి పెద్ద ఫ్యాక్టరీలకు కూడా సరఫరా చేయవచ్చని రైతులు సూచిస్తున్నారు. కోకో సాధారణంగా ఏడాదికి రెండు పంటలిస్తుంది. నవంబర్ నుంచి జూన్, జూలై నుంచి అక్టోబర్ వరకూ పంట చేతికి వస్తుంది. గత ఏడాది కిలో రూ.900 ఉన్న ధర, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.550 పడిపోయిందని దీంతో కోతకొచ్చినా కూలీ ధర కూడా చెల్లించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళారుల సిండికేట్

కంపెనీల గుత్తాధిపత్యం వల్ల అంతర్జాతీయ మార్కెట్ మాయాజాలంతో రైతులు చిత్తవుతున్నారు. దేశీయంగా 1.10 టన్నుల కోకో గింజలు అవసరముండగా దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతుంది కేవలం 35 వేల టన్నులు (32శాతం) మాత్రమే. మిగిలిదంతా దిగుమతి చేసుకుంటున్నాం. అయినా కోకో గింజల రేట్లు మాత్రం దిగజారిపోతోంది. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో మాత్రమే కోకో సాగు అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా మన రాష్ట్రం 35శాతం ఉత్పత్తి చేస్తోందని అంచనా. దేశీయంగానే కాక విదేశాల్లోనూ చాక్లెట్ వాడకంతో పాటు డార్క్ చాక్లెట్ వినియోగం పెరిగి డిమాండ్ పెరిగినా రైతులకిచ్చే ధర మాత్రం పడిపోయింది. కోకోలో ప్రధాన సమస్య పర్మెంటేషన్.. అంటే పులియబెట్టడం, ఎండబెట్టడంలోనే ఉంది. ఎండబెట్టడంలో తేడా వస్తే గింజలు నల్లబడిపోతాయి. చాక్లెట్‌పొడికి మంచి వాసన, రుచి రాదు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి రాదు. నిలువ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. నిలువకు నాణ్యతా ప్రమాణాలున్న వసతి అవసరం.



కౌలు రైతుకు మరింత నష్టం: బెజవాడ శ్రీనివాసరావు, రైతు

కోకో సాగులో కౌలు రైతులు ఎక్కువగా ఉండటంతో నష్టపోతున్నారు. ఆయిల్ పామ్‌లో సాగుచేసిన కోకోపంటకు ఎకరానికి రూ.25వేలు కౌలు చెల్లిస్తుంటే, కొబ్బరిలో సాగు చేసిన కోకోకు ఎకరానికి రూ.30వేల వరకూ కౌలు చెల్లిస్తున్నామని రైతులు వివరించారు. ఆయిల్‌పామ్‌లో సాగుచేసిన కోకోపంట 2 క్వింటాళ్ల వరకూ, కొబ్బరిలో సాగు చేసిన కోకో పంట 4 నుంచి 5 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. కౌలు కాక ఎకరానికి రూ.30వేల వరకూ ఖర్చవుతుంది. గత ఏడాది కోకో పంటకు మంచి ధర పలకడంతో మరిన్ని ఎకరాలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లేదు సరికదా పెట్టుబడి ఖర్చులు రావడంలేదని బెజవాడ శ్రీనివాసరావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సహకారం అవసరం

పెరిగిన సాంకేతిన పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి. సిండికేట్‌గా ఏర్పడి రైతు కష్టాన్ని దోచుకుంటున్న దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలి. దిగుమతులను తగ్గిస్తూ స్థానిక పంటను కొనుగోలు చేయాలి. కోకో గింజలను కొనుగోలు చేసే కంపెనీ ప్రతినిధులతో, రైతులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి రైతుకు న్యాయం చేయాలి. కోకో ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు, పొదుపు సంఘాలను, మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి ఇంటివద్దే చాక్లెట్ల తయారీకి ప్రోతహించవచ్చు. దీంతో యువతకు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. గింజలను పులియబెట్టడం, ఎండబెట్టడంతో పాటు పొడి చేసేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణను రైతులకిస్తూ పరికరాలను అందుబాటులోకి తేవాలి. ఉద్యానవనశాఖ కోకో పంటను ప్రోత్సహించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేసేలా కోకోబోర్డు ఏర్పాటు ప్రాధాన్యత గురించి పరిశీలించాలి.



ఘనంగా 'సురభి' ప్రారంభం

విజయవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సురభి నాటక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆడిటోరియంలో 6 రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలిరోజు భక్తప్రహ్లాద నాటకాన్ని శనివారం ప్రదర్శించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం (ఎస్‌జడ్‌సీసీ, తంజావూరు), రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నారు.

రక్తి కట్టిన భక్త ప్రహ్లాద

140 ఏళ్ల ప్రస్థానం కలిగిన సురభి నాటక సంస్థ ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం సంప్రదాయ రంగస్థల కళలను, ప్రత్యేక ఎఫెక్టులను, సంగీతాన్ని, పద్యాలను కలిగి ప్రేక్షకులకు మహాదానందాన్ని కలిగించింది. భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన రంగస్థలంపై ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. రాజ్యసభ, నరసింహాడి అవతారం వంటి కీలక ఘట్టాలు కనువిందు చేశాయి. ప్రహ్లాద భక్తిని, హిరణ్యకశ్యపుని అహంకారాన్ని, నరసింహ స్వామి ప్రతాపాన్ని చూపిస్తూ నటులు పాత్రలకు ప్రాణం పోశారు. శ్లోకాలు, హరిభజనలు, నాటకీయ సంభాషణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రత్యేక లైటింగ్ ఎఫెక్ట్స్, భయానక శబ్దాలు, ఆహ్లాదకరమైన నేపథ్య సంగీతం ద్వారా నరసింహస్వామి అవతార ఘట్టాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. ప్రహ్లాదుడిగా అస్సికా వర్మ, పర్నికా వర్మలు, హిరణ్యకశ్యపునిగా జయచంద్ర వర్మ, లీలావతిగా కేతశ్రీ ప్రధాన పాత్రలు పోషించారు. హారికవర్మ, రవివర్మ, పద్మజ వర్మ, హేమమానస, ఉపేంద్ర, రిషిక, లేఖజ్‌లు తమ పాత్రలతో రక్తి కట్టించారు. కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు, మాధవి పురాణం, ప్రోగ్రాం అధికారి రంగ భాష్యం పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విధానాలనే అవలంభిస్తున్న కూటమి

● కేఎస్ లక్ష్మణరావు

గాంధీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో మార్పుల పేరుతో విద్యార్థులకు విద్యను దూరం చేసిందని కేఎస్ లక్ష్మణరావు మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకే పీ4 విధానాన్ని ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. దీంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందని, ప్రజలకు ఉచిత వైద్యం అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటతోనే విద్యరంగంలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాటాలకు తమ మద్దతు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, ఎ.అశోక్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన చలో విజయవాడ సందర్భంగా ఇచ్చిన హామీలను నేటి వరకు ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రూ.7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకాయిలు తక్షణమే చెల్లించాలని, జీవో77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కామన్ సెట్ రద్దు చేసి గతంలో మాదిరిగా ఏ విశ్వవిద్యాలయానికి ఆ విశ్వవిద్యాలయం సెట్ నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీఎస్, రైతు సంఘం నేతలు ఆంధ్ర మాల్యాద్రి, వై.కేశవరావు, హరిబాబు, పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ నేతలు రాజేష్, మహేష్ వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు ఈ దీక్షకు మద్దతు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.వినోద్, ఎం.కిరణ్, సీహెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

నీటి కాలుష్యం తగ్గించండి

● కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి కాలుష్యం నివారణకు మైక్రోబియల్ బయోరిమిడియేషన్ విధానాన్ని అవలంభించాలని కాంగ్రెస్ నేతల బృందం కలెక్టర్ లక్ష్మీశను కోరింది. హైదరాబాద్‌లో ఈ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని వివరించింది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్, డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.గురునాథం, నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితరులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో శనివారం కలిశారు. నీటి కాలుష్యం తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు మరో రెండు అంశాలపై కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాలను అందజేశారు.

రైతు సమస్యల్ని గడువులోపు పరిష్కరించాలి

● అధికారులకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఆదేశం

బెంజిసర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ పరిధిలో రైతు సమస్యల పరిష్కారం పూర్తిగా వారి సంతృప్తి చెందేలా ఉండాలని కమిషనర్ కె.కన్నబాబు అన్నారు. అదనపు కమిషనర్ జీ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలిసి ఆయన శనివారం నగరంలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ నమోదు చేసిన రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఒకపక్క రైతు సమస్యలు తెలుసుకుంటూనే మరోవైపు అధికారులతో చర్చించారు. కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించారు. మిగిలినవి గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టర్‌లో 93 సమస్యలు నమోదవగా రైతులందరినీ పిలిచి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం తుళ్లూరులో జరిగే గ్రీవెన్స్‌డేతోపాటు ప్రతి శనివారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో స్వయంగా తానే సమీక్షా సమవేశం నిర్వహిస్తానన్నారు. రైతుల నుంచి నేరుగానే కాకుండా ఆన్‌లైన్‌టనూ ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి పరిష్కారమయ్యే వరకు రైతుల ఫోన్‌లకు మెసేజ్ వెళుతుందన్నారు. పలువురు రైతులు గ్రామకంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్యతాక్రమంలో వీలైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. రైతులు ఎక్కువగా రిటర్నబుల్ ప్లాట్లు, కౌలు చెల్లింపు, సీఆర్‌డీఏ పింఛన్ వంటి అంశాలపై తమ సమస్యలను విన్నవించారు. సీఆర్‌డీఏ ల్యాండ్స్ అండ్ ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు..

ఒడిశా యువతికి క్లిష్టమైన గుండె చికిత్స

● అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్



ఒడిశా యువతితో కుటుంబ సభ్యులు, హాస్పిటల్ వైద్యులు

ప్రభుత్వాసుపత్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లాకి చెందిన జెనా (26) అనే యువతికి విజయవాడ ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారు మూడు రకాలైన క్లిష్టతరమైన గుండె శస్త్రచికిత్సలు చేసి కొత్త జీవితాన్ని అందించారు. ఈసందర్భంగా శనివారం హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ వాసుదేవ్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌కు వచ్చిన జెనాకు మూడు రకాలైన గుండె సమస్యలను గుర్తించామని శస్త్ర చికిత్స ద్వారా సరి చేయగలమని నిర్ధారించి శస్త్ర చికిత్సకు తీసుకున్నట్లు చెప్పారు. సీనియర్ గుండె శస్త్ర చికిత్సా వైద్య నిపుణులు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ ఆధ్వర్యంలో నిష్ణాతులైన అనస్థీషియా వైద్య బృందం ఆధ్వర్యంలో సెన్నింగ్ రిపేర్ (ఏట్రియల్ స్విచ్), కరెక్టడ్ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్ సమస్యలో గుండె రక్త ప్రవాహ మార్గాలు తప్పుగా అనుసంధానమై ఉన్న సమస్యకు శస్త్ర చికిత్స ద్వారా గుండె లోపల వెంట్రికల్ నుంచి అయోర్టా బాఫుల్ రిపేర్ ఎడమ గుండె గది (ఎల్‌వీ) నుంచి అయోర్టాకు రక్త ప్రవాహం సరిగ్గా లేకపోవడంతో రోగికి ఆక్సిజన్ ఉన్నా రక్తం శరీరానికి తగినంతగా వెళ్లకపోవడంతో బాఫుల్ టన్నెల్ లాంటి మార్గం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైట్ వెంట్రికల్ నుంచి పల్మనరీ ఆర్టరీ కాండుయిట్ రిపేర్ ఆర్వీ టు పీఏ కండుయిట్ రీపేరట్ కుడివైపు గుండె గది (ఆర్‌వీ) నుంచి ఊపిరితిత్తులకు (పీఏ) రక్తం సరైన విధంగా వెళ్లకపోవడంతో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందడం లేదని ఆర్‌వీ, పీఏ మధ్య ఒక కృత్రిమ పైపు (కండుయిట్ - ట్యూబ్)ను అమర్చి రక్త ప్రవాహాన్ని మెరుగుపరిచినట్టు చెప్పారు. చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వైద్య బృందాన్ని అభినందిస్తూ క్లిష్టతరమైన ఈ శస్త్రచికిత్సకు 12 గంటలు సమయం పట్టిందన్నారు. దేశంలోనే ఇటువంటి అరుదుగా జరుగుతాయని తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి చికిత్స మొదటి సారిగా నిర్వహించినట్టు చెప్పారు. డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ కె.అనూష, గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ, జనరల్ మేనేజర్ డాక్టర్ సుమ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు పాల్గొన్నారు.



దుర్గగుడి కళావేదికపై సంగీతార్చనలో కీర్తనలు ఆలపిస్తున్న ప్రముఖ సంగీత విద్వాంసురాలు వనిత సురేష్

దుర్గమ్మకు సంగీతార్చన

ఇంద్రకీలాద్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సకల కళా ప్రియ కనకదుర్గమ్మకు శనివారం ఇంద్రకీలాద్రిపై సంగీతార్చన జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసురాలు వనిత సురేష్ గాత్ర కచేరితో భక్తులు పరవశించారు. సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గగుడి కళావేదిక కేంద్రంగా వనిత సురేష్ తమ బృందంతో గాత్ర కచేరీ నిర్వహించారు. మూడు గంటలపాటు జరిగిన ఈ కచేరీలో పలు అమ్మవారి కీర్తనలను హృద్యంగా ఆలపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ శాస్త్రీయ సంగీతంపై ఆసక్తితో 15ఏళ్లుగా దేశంలోని అనేక ప్రాంతాల్లో గాత్ర కచేరి ప్రదర్శనలు ఇస్తున్నానని వనిత సురేష్ తెలిపారు. తొలిసారిగా దుర్గమ్మ సన్నిధిలో స్వరార్చణ చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి, ఈవో కె.రామచంద్ర మోహన్‌కు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది రవికుమార్ తనయుడు మల్లాది శివానంద్ మృదంగంపై, కుమారి సింధు రాగేశ్వరి వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు. అనంతరం కళా బృందం అమ్మవారిని దర్శించుకోగా వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు వారికి అందజేశారు.

దాసాంజనేయస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి

గుణదల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయానికి హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వాదం అందించారు. ఈవో పాతూరి లోకేశ్వరి జడ్జి గోపాలకృష్ణకు దుశ్శాలువా కప్పి ఆంజనేయస్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు, మాచవరం ఎస్ఐ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి గోపాలకృష్ణకు చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఈవో

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

గంపలగూడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుకల్యాణం శుక్రవారం రాత్రి వేలాది భక్తుల నడుమ విద్యుత్ కాంతులతో నయనానందకరంగా జరిగింది. స్వామిని మేళతాళాలతో కల్యాణ మండపంలో ప్రవేశం చేయించారు. నిత్య హోమం బలిహరణ ముగించిన తరువాత రమణాచార్యులు ఆధ్వర్యంలో కన్యాదాన పీటలపై కూర్చున్న 260 మంది దంపతుల గోత్రనామాలు చదివించారు. ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ దంపతులు కన్యాదాన పీటలపై కూర్చున్నారు. వేద మంత్రాల నడుమ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కన్యాదానం పీటలపై కూర్చున్నవారికి ప్రత్యేక మెమొంటోలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణం అనంతరం స్వామిని గరుడ వాహనంపై ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సంధ్య, చైర్మన్ కావూరి శశిరేఖ, టీడీపీ నేతలు వనమా చిన్నబాబు, వడ్లమూడి రాజశేఖర్, బెల్లం మధు, పామర్తి కొండలరావు, సురేష్ పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ చిన్ని దంపతులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎడ్ల పందేలు ప్రారంభం

నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పూటీ లాగుట ఎడ్ల పందేలను శనివారం సాయంత్రం కొల్లి కిరణ్, కొల్లి అజయ్ ప్రారంభించారు. టీడీపీ నేతలు వనమా చిన్నబాబు, ధారా రవికుమార్, సురేష్, మందా జమలయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ రథోత్సవం

పెనుగంచిప్రోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం రాత్రి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతమ్మ-గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి బయటకు తెచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఎక్కించి ఉత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. రథాన్ని గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ ఎద్దులతో లాగించి గ్రామోత్సవం నిర్వహించి రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగి అమ్మవారి ఆలయానికి చేర్చారు. భక్తులు రథానికి అడుగడుగున నీళ్ల వారపోసి టెంకాయలు, పూజా ద్రవ్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తహసీల్దార్ శాంతి లక్ష్మి, ఈఈ ఎల్.రమా, ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, పెద్ద ఎత్తున భక్తులు అధికారులు పాల్గొన్నారు. ముందుగా సోమవారం జరగనున్న తిరుపతమ్మ అమ్మవారి పట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవంపై ఏసీపీ తిలక్ వివిధ రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టింటి పసుపు, కుంకుమల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న ఈవో, చైర్మన్ శ్రీనివాసరావు, తహసీల్దార్ శాంతిలక్ష్మి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వసంత నాగేశ్వరరావు, రచయిత రామదాసప్పనాయుడు

'సక్సెస్ పోలీస్' పుస్తకావిష్కరణ

గాంధీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు నీతి, నిజాయితీతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పలువురు వక్తలు ప్రశంసించారు. అమరావతి డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ తిప్పినేని రామదాసప్పనాయుడు రాసిన 'సక్సెస్ పోలీస్' పుస్తకావిష్కరణ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రాద్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ద్వారకా తిరుమలరావు జీవిత చరిత్రపై రాసిన ఈ పుస్తకంలో ఆయన విధి నిర్వహణలో వ్యవహరించిన తీరుతో పాటు అనేక మంది ఐపీఎస్ అధికారుల పనితీరును రచయిత వివరించిన తీరును వక్తలు అభినందించారు. నిజాయితీ పోలీస్ అధికారుల సమర్థతను మెచ్చుకుంటూనే అవినీతి పోలీస్ అధికారుల వ్యవహార్శైలిని ఎండగట్టారన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వినియోగదారుల పరిరక్షణ చట్టం-ప్రజా చైతన్యం' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ చట్టం వివరాలను రాజేంద్రప్రసాద్ వివరించారు. ప్రజా చైతన్యంతోనే చట్టాలకు సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం వసంత నాగేశ్వరరావు రచయిత రామదాసప్పనాయుడుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. రామదాసప్పనాయుడు మాట్లాడుతూ మావోయిస్టు కేంద్ర కమిటీ నుంచి బహిష్కరించబడిన హిడ్మా ఆధ్వర్యంలో మరో కొత్త మావోయిస్టు పార్టీ ఏర్పడబోతుందన్నారు. ఇతడికి రెండు ప్రముఖ రాజకీయ పార్టీలు తెలుగు రాష్ట్రాల్లో చేయూతనివ్వబోతున్నాయని, దీంతో రాజధాని అమరావతితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు బలమైన ముప్పు పొంచి ఉందని ఈ విషయాలను ఈ పుస్తకంలో పొందుపరచినట్టు పేర్కొన్నారు.



పీఎం ఉపాధి కల్పనలో మాట్లాడుతున్న కేవీఐసీ అధికారులు

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

బెంజిసర్కిల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా యువ పారిశ్రామికవేత్తలను వివిధ పథకాలకు రాయితీస్తూ ప్రోత్సహిస్తోందని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. నగరంలోని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పీఎం ఉపాధి కల్పనలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువ పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలతో నూతన పరిశ్రమలను స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించాలని కోరారు. కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. గ్రీస్, ఎ. ఆనంద్‌కుమార్, మహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సండే సెలబ్రిటీ



సినిమా... జీవితం నేర్పిన పాఠాలివే

వెంకట ప్రభు ప్రసాద్... ఈ పేరు అంతగా ఎవరికీ గుర్తుకురాక పోవచ్చు. కానీ 'సప్తగిరి' అనగానే ప్రేక్షకులు వెంటనే గుర్తుపట్టేస్తారు. సప్తగిరి చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి పదిహేనేళ్లు అవుతోంది. ఈ తరం హాస్యనటుల్లో అతి తక్కువ కాలంలోనే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్న సప్తగిరి జీవితంలో ఎవరూ ఊహించని కొన్ని కోణాలున్నాయి. కొంత గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు 'పెళ్లికాని ప్రసాద్' చిత్రంతో హీరోగా వస్తున్న సప్తగిరితో 'నవ్య' ఇంటర్వ్యూ.

హాస్య నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న మీరు ఈ మధ్య తెర మీద తక్కువగా కనిపిస్తున్నారు. కారణం ఏమిటి?

నాకే కాదు పరిశ్రమలోకి వచ్చిన పది, పదిహేనేళ్ల తర్వాత ఎవరికైనా కెరీర్ పరంగా కొంత గ్యాప్ రావడం సహజం. అప్పుడు ఆత్మపరిశీలన చేసుకొని, అడుగు ముందుకు వేస్తే మళ్లీ విజయాలు అందుకోవచ్చు. కెరీర్ పరంగా ఎలా ముందుకు వెళ్లాలా? అనే కొంత అయోమయ పరిస్థితే నా గ్యాప్‌నకు కారణం. రకరకాల కథలు, పాత్రలు నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి కానీ వాటిని 'అంగీకరించాలా? వద్దా?' అనే కన్‌ఫ్యూజన్ వల్లే ఇలా జరిగింది. చేసిన కొన్ని పాత్రలు ఫలితాన్ని ఇవ్వకపోవడం మరో కారణం. అలాగే చేసుకుంటూ పోతే కన్‌ఫ్యూజన్ పెరుగుతుందనిపించింది. అందుకే కొంత విరామం తీసుకొని, రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులను మరికొంత కాలం అలరించాలనే అభిప్రాయంతో తీసుకున్న గ్యాప్ ఇది.

హీరో పాత్రలు, కామెడీ వేషాలు... ఈ రెండు పడవల ప్రయాణం ఇబ్బందేనా?

ఒక దశలో అలా ఇబ్బంది పడిన మాట వాస్తవం. 'రెండు పడవల ప్రయాణం చేస్తున్నాం. ఎటూ కాకుండా ఉన్నాం. ఇలాగైతే ఎలా?' అని మధనపడిన సందర్భాలు ఉన్నాయి. పరిశ్రమలో నాకు ఎలాంటి నేపథ్యం లేదు కనుక 'ధైర్యంగా నిలబడాలి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి' అని నాకు నేనే చెప్పుకొన్నా. కొంత ఇబ్బంది పడినా చాలా మంచి కథలు వచ్చాయి. వాటిల్లో 'పెళ్లికాని ప్రసాద్' ఒకటి.

> ఏ మనిషి జీవితంలోనైనా ఒడుదొడుకులు సహజం. ఆ స్ట్రగుల్ నాకూ ఉంది. ఓపిక, సహనం ఉండాలి. సినిమా జీవితం అదే నాకు నేర్పించింది. ఇక్కడకు వచ్చి పోగొట్టుకున్నది ఏదీ లేదు.

'ఇక సినిమా ఫీల్డ్ వద్దు... ఇంటికి వెళ్లిపోదాం' అని ఎప్పుడైనా అనిపించిందా?

ఆ ఏడుకొండలస్వామి దయ వల్ల నాకు ఎప్పుడూ అలా అనిపించలేదు. 'ఏది ఏమైనా ఇక్కడే ఉండాలి, సాధించాలి' అని ఎప్పుడూ అనుకుంటాను. ఇది నాకు ఇష్టమైన రంగం, కష్టపెట్టే రంగం కాదు. ఇక్కడ ఎంత కష్టమైనా చాలా ఇష్టంతో ముందడుగు వేస్తాను. అందుకే 'వెనక్కి తిరిగి వెళ్లిపోదాం' అనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు, రాదు కూడా.

మీరు స్ట్రగుల్ అయ్యే రోజుల్లో ఇబ్బంది పెట్టిన సంఘటనలు ఏవీ లేవా?

మనకు సంబంధం లేకుండా కొంతమంది మనమీద బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నప్పుడు చాలా బాధగా అనిపిస్తుంటుంది. 'వాళ్లను ఎలా తట్టుకోవాలి, ఆ పరిస్థితుల్ని ఎలా అధిగమించాలి?' అని అర్థం కాని రోజులు ఉన్నాయి. కొంతమంది నన్ను డీ గ్రేడ్ చేయాలని చూడడం, అవకాశాలు రాకుండా అడ్డుకోవడం కూడా జరిగింది. "హీరోగా నటిస్తున్నా కమెడియన్ వేషాలు కూడా చేస్తాను" అని ప్రకటించాను. పెద్దలను కలిసి వివరించాను. అయినా దాన్ని కూడా కొందరు చులకన చేసి మాట్లాడారు. నేను పట్టించుకోలేదు. మనం నిజాయితీగా ప్రయత్నాలు చేస్తే దేవుడి అండదండలు తప్పకుండా ఉంటాయని నమ్మాను. అలాగే అడుగులు వేస్తున్నాను.

> శత్రువులు నా జోలికి రాకుండా ఉంటే చాలు. అదే పదివేలు. నేను ఎదురు తిరిగే వ్యక్తిని కాదు, స్టేట్‌మెంట్లు ఇచ్చే రకాన్ని కూడా కాదు. "నా బతుకు నే బతుకుతాను. నా దారిన నన్ను పోనివ్వండి" అని బతిమాలుకునే మనిషిని నేను.

హీరో కావాలనే కోరిక మీకెందుకు కలిగింది?

పదేళ్లు కమెడియన్‌గా నటించాను. వైవిధ్యం ఏదీ లేకుండా చేసిన కొన్ని పాత్రలు నాకే విసుగ్గా అనిపించాయి. 'విభిన్న పాత్రలు ఇస్తే అవి కూడా చేయగలను' అనిపించినప్పుడు, ఇతరుల నుంచి అటువంటి అవకాశాలు రానప్పుడు నన్ను నేను ప్రాజెక్ట్ చేసుకోవాలి కనుక హీరోగా నటించాలని అనుకున్నాను. సరిగ్గా అప్పుడే 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్‌ఎల్‌బీ' కథలు దొరికాయి. ఎమోషన్, సెంటిమెంట్ కూడా బాగా పండించగలనే పేరు వచ్చింది. అలా నన్ను నేను నిరూపించుకోకపోతే కమెడియన్‌గా కూడా కొనసాగడం కష్టం. 'అరే... సప్తగిరి ఇవి కూడా చెయ్యగలడా? ఇతనిలో ఈ టాలెంట్ కూడా ఉందా?' అనిపించుకోవడం కోసమే హీరోనయ్యాను. కేవలం కమెడియన్ కాదు, మంచి నటుడు కూడా అనిపించుకోవాలనే తాపత్రయంతోనే అప్పుడప్పుడు హీరో వేషాలు వేస్తున్నాను. ఆ రోజు 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్‌ఎల్‌బీ' చిత్రాలతో బీజం వేశాను కనుకే నాకు 'పెళ్లికాని ప్రసాద్' సినిమా వచ్చింది. హీరోగా మరో రెండు సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఇన్నాళ్లుగా నేను చేయాలనుకుంటున్న హీరో పాత్ర 'పెళ్లికాని ప్రసాద్' లో దొరికింది. రెగ్యులర్‌గా కనిపించే సప్తగిరి ఇందులో ఉండడు. ఇది వినోదంతో నిండిన సినిమా. ఫ్యామిలీ ఓరియంటెడ్ చిత్రం.

హీరోగా నటిస్తున్నప్పుడు మిస్ అయిన వేషాలు ఉన్నాయా?

నేను మిస్సయ్యాను అనడం కంటే 'మిస్ అయ్యేలా చేశారు' అని చెప్పడం బెస్ట్. నా బాధ కూడా అదే!

అటువంటి పరిస్థితుల్లో మీకు మద్దతుగా ఎవరున్నారు?

దర్శకుడు మారుతి అన్న గురించి మొదట చెప్పాలి. నన్ను సొంత తమ్ముడిలా ఆయన చూస్తాడు. "ఏం పర వాలేదు నేనున్నా" అని ధైర్యం ఇస్తాడు. అలాగే అనిల్ రావిపూడి కూడా కొండంత అండగా ఉంటాడు.

అనిల్ రావిపూడి సినిమాల్లో మీకు కనిపించకపోవడానికి కారణం?

మేమిద్దరం మంచి స్నేహితులం. ఆయన సినిమాల్లో నేను లేకపోవడానికి ప్రత్యేకించి కారణాలు ఏవీ లేవు. సందర్భం కుదరలేదు అంతే! అయితే ఆ లోటు కూడా త్వరలోనే తీరుతుంది. నాకు ఓ మంచి పాత్ర ఇవ్వబోతున్నాడు. మరో విషయం ఏమిటంటే 'పెళ్లికాని ప్రసాద్' బిజినెస్ విషయంలో అనిల్ చేస్తున్న సాయం అంతా ఇంతా కాదు. "ఈ సినిమా బాగుంటుంది. మీరు రిలీజ్ చేయాలి" అని శిరీష్ అన్నతో మాట్లాడాడు. స్నేహానికి అంత విలువ ఇచ్చే వ్యక్తి అనిల్ రావిపూడి.

'పెళ్లికాని ప్రసాద్' ఎలా ఉంటాడు?

ఇంతకాలం కమెడియన్‌గా నవ్వించాను. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్‌ఎల్‌బీ' లాంటి మెసేజ్ ఓరియంటెడ్ చిత్రాల్లో హీరోగా నటించాను. మొదటి సినిమాలో పోలీస్, రెండో సినిమాలో లాయర్ పాత్రలు పోషించాను. ఇక ఇప్పుడు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడం కోసమే చేసిన సినిమా 'పెళ్లికాని ప్రసాద్'. పల్లెటూరులో జరిగే హిలేరియస్ ఎంటర్‌టైనర్ ఇది. అదృష్టవశాత్తూ కంటెంట్ బాగా కుదిరింది. సినిమాలో 54 సీన్లు ఉంటే అందులో 45 సీన్లలో సన్నివేశపరమైన హాస్యం అందరినీ నవ్విస్తుంది.



> 'రాజాసాబ్' చిత్రం హాస్యనటుడిగా నన్ను మళ్లీ నిలబెడుతుంది. ప్రభాస్ అన్న పక్కన దాదాపు సినిమా అంతా ఉంటా. 'పెళ్లికాని ప్రసాద్ టీజర్ రిలీజ్ చేసింది ప్రభాస్ అన్నే. సినిమాలో కొన్ని సీన్స్ చూసి ఇష్టపడి "ఈ సినిమాను నేను ప్రమోట్ చేస్తా" అని ముందుకు వచ్చారు. మహారాజు లాంటి మనస్తత్వం ఆయనది.

హీరోగా మీకు తోటి హాస్యనటుల సపోర్ట్ ఎలా ఉంది?

అందరూ బాగా సపోర్ట్ చేస్తున్నారు. "గిరీ... నువ్వు మళ్లీ విజృంభించాలి. నువ్వు కేవలం కమెడియన్‌వి మాత్రమే కాదు, మంచి నటుడివి" అని చెబుతున్నారు. 'పెళ్లికాని ప్రసాద్' బాగా ఆడాలని కోరుకుంటున్నారు.

'పెళ్లి కాని ప్రసాద్' పెళ్లి ఎప్పుడు?

చెబుతా. ఈ సినిమా తర్వాత అన్నీ శుభవార్తలే వింటారు.

• వినాయకరావు

ఇంట్లో ఇంపుగా...

కొన్ని రకాల మొక్కలను ఎండ ఎక్కువగా తగిలే ప్రాంతాల్లోనే కాకుండా ఇంట్లో నీడలో కూడా పెంచుకోవచ్చు. ఇలాంటి మొక్కల వల్ల ఇంటి అందం ఇనుమడిస్తుంది. అలాంటి మొక్కల గురించి.. వాటిని ఎలా అలంకరించుకోవాలో తెలుసుకుందాం..

మొక్కలు ఇవే...

- స్నేక్ ప్లాంట్, స్పైడర్ ప్లాంట్, పీస్ లిల్లీ వంటి మొక్కలకు ఎక్కువ సూర్యరశ్మి అవసరం ఉండదు. అందువల్ల వీటిని నీడలో ఉంచినా బాగా పెరుగుతాయి.
- ఎక్కువ నీళ్లు పోయకపోయినా కొన్ని మొక్కలు పెరుగుతాయి. సక్యులెంట్స్ జాతికి చెందిన ఎఖివెరియా, లేస్ అలో, జీబ్రా హవోర్తియా మొదలైన మొక్కలు ఈ కోవకు చెందినవి. ఇవి ఇప్పుడు అన్ని నర్సరీలలో దొరుకుతున్నాయి.
- కొబ్బరి మొక్కల జాతికి చెందిన చైనీస్ ఫ్యాన్, సాగో పామ్ వంటి వాటిని బాల్కనీలలో పెట్టుకుంటే బాగుంటుంది. వీటికి ఎక్కువ నీళ్లు పోయాల్సిన అవసరం కూడా ఉండదు.



అలంకరణ ఇలా...

- ఇంటి అలంకరణలో మొక్కలకు స్థానం కల్పించాలనుకున్నప్పుడు.. వ్యక్తిగత అభిరుచికి తగినట్లుగా తొట్లు ఎంచుకోవాలి. మట్టి తొట్లకు బదులుగా ఇత్తడి, రాగి లోహపు తొట్లను ఎంచుకుంటే ఆధునికత ఉట్టిపడుతుంది. పింగాణీ తొట్లను ఇష్టపడేవారు లేత రంగులను ఎంచుకోవాలి.
- ఈ మధ్యకాలంలో మొక్కలను అలంకరించుకొనేందుకు వీలుగా స్టాండ్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటిని వాడి మొక్కలను వేర్వేరు ఎత్తుల్లో అమర్చుకోవచ్చు.
- వేర్వేరు ఆకారాల్లో... పరిమాణాల్లో... రంగుల్లో ఉన్న మొక్కలను ఎంచుకుంటే అవి వినూత్నంగా కనిపిస్తాయి. కాబట్టి రెండు మూడు రకాల మొక్కలను ఎంచుకుని వేర్వేరు ప్రదేశాల్లో అలంకరించుకోవాలి.
- గాజు సీసాలు, గ్లాసులు, పాత్రలను కూడా మొక్కల పెంపకానికి వాడుకోవచ్చు. వెదురు బుట్టలు, చేతి సంచులను కూడా మొక్కల పెంపకానికి వాడుకోవచ్చు.

కాలుష్యాన్ని తగ్గించే మొక్కలు

పీస్ లిల్లీ, స్నేక్ ప్లాంట్, మనీ ప్లాంట్, అలొవెరా, స్పైడర్ ప్లాంట్, బోస్టన్ ఫెర్న్ మొదలైనవి గాలిలో కాలుష్యాన్ని తగ్గిస్తాయి. అందుకే వీటిని ఇంటిలోపల అలంకరించుకోవచ్చు. ఇవి గాలిలోని కార్బన్ మోనాక్సైడ్, ట్రైక్లోరోఎథిలీన్ లాంటి కలుషితాలను తొలగిస్తాయి.

ఓటీటీ విన్నర్స్



ఖాకీతో మాఫియా పోరు

తుషార్ కాంతిరే దర్శకత్వంలో శీతల్ భాటియా నిర్మించిన క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'ఖాకీ: ది బెంగాల్ ఛాప్టర్'. గతంలో వచ్చిన 'ఖాకీ: ది బిహార్ ఛాప్టర్'కు ఇది సీక్వెల్. కోల్‌కతాలో మాఫియా చేతిలో ప్రభుత్వ అధికారులు హత్యకు గురవ్వడం, క్రిమినల్స్ అరాచకాలు పెరిగిపోవడం... శాంతి భద్రతలను కాపాడేందుకు ఐపీఎస్ అర్జున్ మైత్రా ఏం చేశాడనేది కథ. శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్స్, అవినీతి రాజకీయ నాయకుల బారి నుంచి సామాన్య ప్రజలను రక్షించేందుకు పోలీస్ వ్యవస్థ జరిపిన పోరును ఆసక్తికరంగా తెరకెక్కించారు. హిందీ, బెంగాలీ భాషల్లో తెరకెక్కిన ఈ సిరీస్‌లో జీత్, ప్రసేన్ జిత్ చటర్జీ, చిత్రాంగద సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు.

కెనడాలో పంజాబీ డాన్

ఓ పంజాబీ యువకుడు కెనడా వెళ్లి డాన్‌గా ఎదిగిన కథతో తెరకెక్కిన సిరీస్ 'కన్నెడ'. తమ కలలను నిజం చేసుకునేందుకు విదేశాలకు వెళ్లే భారతీయులు అక్కడ పడే కష్టాలను ఈ సిరీస్ ఆవిష్కరిస్తుంది. 1990ల్లో కెనడా నేపథ్యంలో కథ సాగుతుంది. పంజాబ్‌కు చెందిన నిమ్మా తన పాటల ద్వారా జాతివివక్ష, జాత్యాహంకారంపై పోరాటం చేస్తాడు. కొన్ని మాఫియా శక్తులు పగబట్టి అతన్ని వేటాడతాయి. తనను మట్టుపెట్టాలని చూస్తున్న గ్యాంగ్‌స్టర్స్ బారి నుంచి కాపాడుకోవడానికి అతనే ఓ ముఠాను ఏర్పాటు చేసి డాన్‌గా మారతాడు. చందన్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో పర్మీష్ వర్మ, రణవీర్ షోరే, జాస్మిన్ బజ్వా కీలకపాత్రలు పోషించారు.



ఒక్క హిట్.. ప్లీజ్!

ప్రతి శుక్రవారం టాలీవుడ్‌లో అనేక మంది రాతలు మారిపోతూ ఉంటాయి. పెద్ద పెద్ద అంచనాలతో వచ్చిన చిత్రాలు ఫట్ మంటాయి. కథబలం ఉన్న చిన్న సినిమాలు ఆడేస్తుంటాయి. ఈ క్రమంలో కొందరు స్టార్ హీరోలు కూడా హిట్‌ల కోసం పరితపిస్తూ ఉంటారు. మళ్లీ మంచి రోజులు రాకపోతాయా అని ఎదురుచూస్తూ ఉంటారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అలాంటి హీరోలెవరున్నారో చూద్దాం..



విజయం కోసం...

పెళ్లి చూపులు, అర్జున్‌రెడ్డి, గీత గోవిందం చిత్రాల హ్యాట్రిక్ హిట్‌లతో కెరీర్ ప్రారంభించిన విజయ్ దేవరకొండకు ఈ మధ్యకాలంలో విజయాలు దక్కలేదు. లైగర్ పూర్తిగా నిరాశపరిస్తే.. ఆ తర్వాత వచ్చిన ఫ్యామిలీ స్టార్ కూడా అంచనాలు అందుకోలేదు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఒక స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. ఇది మేలో విడుదలయ్యే అవకాశముంది. వరుస ఫ్లాప్‌ల బారిన పడిన విజయ్‌ని ఈ చిత్రమైన గట్టెక్కిస్తుందో లేదో చూడాలి.

ఆరేళ్ల నుంచి...

గత ఆరేళ్లుగా హిట్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్‌తేజ్. 2019లో వచ్చిన 'గద్దల కొండ గణేశ్' తరవాత వరుణ్‌కు చెప్పుకోదగిన విజయం లభించలేదు. ఈ మధ్యనే విడుదలైన 'మట్కా' ప్రేక్షకులను బాగా నిరాశపరిచింది. ప్రస్తుతం వరుణ్ ఒక ఇండో కొరియన్ హారర్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు.

ఇంకా దక్కని అదృష్టం...

అక్కినేని కుటుంబం నుంచి భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అఖిల్‌కు ఇప్పటి దాకా ఒక్క సూపర్ హిట్ కూడా దక్కలేదు. ఎంతో శ్రమకోర్చి తీసిన 'ఏజెంట్' తీవ్ర నిరాశనే మిగిల్చింది. అఖిల్ త్వరలోనే రెండు ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడని వార్తలు వినబడుతున్నాయి.

రాబిన్‌హుడ్ అలరిస్తాడా?

2020లో వచ్చిన 'భీష్మ' తరవాత నితిన్‌కి ఒక్క హిట్ కూడా లేదు. 'చెక్', 'రంగ్ దే', మాస్ట్రో, 'మాచర్ల నియోజకవర్గం' మొదలైనవన్నీ నిరాశే మిగిల్చాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రాబిన్‌హుడ్ ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

నిరాశలే ఎక్కువ...

గోపిచంద్‌కు 'సౌఖ్యం' తరవాత ఒక్క హిట్ కూడా పడలేదు. ఆక్సిజన్, పంతం, సీటీమార్, అరడగుల బుల్లెట్, పక్కా కమర్షియల్, రామబాణం, భీమా, విశ్వం చిత్రాలు నిరాశనే మిగిల్చాయి. తాజాగా 'ఐబీ 71', 'ఘాజీ' వంటి చిత్రాలతో గుర్తింపుతెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఒక చిత్రంలో నటిస్తున్నాడు. ఇది ఏ మేరకు ప్రేక్షకులకు అలరిస్తుందో చూడాలి.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు




ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇన్‌సైడ్	వెబ్‌సిరీస్	మార్చి 17
కోకోమిలన్ లేన్	వెబ్‌సిరీస్	మార్చి 17
లవ్ అండ్ హిప్‌హాప్ 3-4	వెబ్‌సిరీస్	మార్చి 18
ది అవుట్‌రన్	హాలీవుడ్ మూవీ	మార్చి 18
ట్విస్టర్	డాక్యుసిరీస్	మార్చి 19
ఉమన్ ఆఫ్ ది డెడ్ 2	వెబ్‌సిరీస్	మార్చి 19
ది రెసిడెన్స్	వెబ్‌సిరీస్	మార్చి 20
ఖాకీ: ది బెంగాల్ ఛాప్టర్	హిందీ సిరీస్	మార్చి 20
బెట్ యువర్ లైఫ్	వెబ్‌సిరీస్	మార్చి 20
డెన్ ఆఫ్ థీవ్స్ 2: పంటేరా	హాలీవుడ్ మూవీ	మార్చి 20
వోల్ఫ్ కింగ్	యానిమేటెడ్ సిరీస్	మార్చి 20
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	మలయాళ చిత్రం	మార్చి 20
గో	వెబ్‌సిరీస్	మార్చి 21

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
లిటిల్ సైబీరియా	ఒరిజినల్ ఫిల్మ్	మార్చి 21
డ్రాగన్	తమిళ చిత్రం	మార్చి 21
సకమోటో డేస్	యానిమేషన్ సిరీస్	మార్చి 22
అమెజాన్ ప్రైమ్		
ఎ వాక్ అమాంగ్ ది టోంబ్‌స్టోన్స్	హాలీవుడ్ మూవీ	మార్చి 16
పాప్‌స్టార్	హాలీవుడ్ మూవీ	మార్చి 16
ట్విస్టర్స్	హాలీవుడ్ మూవీ	మార్చి 18
లాస్ట్ ఒన్ లాఫింగ్	వెబ్‌సిరీస్	మార్చి 20
టైలర్ పెర్రీస్ డూప్లిసిటీ	వెబ్‌సిరీస్	మార్చి 20
స్పాట్‌లైట్	హాలీవుడ్ మూవీ	మార్చి 22
జియో హాట్‌స్టార్		
అనోరా	హాలీవుడ్ మూవీ	మార్చి 17

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
శారద	కన్నడ చిత్రం	మార్చి 17
గుడ్ అమెరికన్ ఫ్యామిలీ	వెబ్‌సిరీస్	మార్చి 19
కన్నెడా	హిందీ సిరీస్	మార్చి 21
టాటా ఐపీఎల్	క్రికెట్ సిరీస్	మార్చి 22
వికెడ్	హాలీవుడ్ మూవీ (హిందీలో)	మార్చి 22
ఈటీవీ విన్		
జితేందర్‌రెడ్డి	తెలుగు చిత్రం	మార్చి 20
హెచ్‌బీవో మ్యాక్స్		
ఎ బాడీ ఇన్ ది స్నో1	వెబ్‌సిరీస్	మార్చి 17
ఎ క్లీన్ షీట్	వెబ్‌సిరీస్	మార్చి 17
సింగ్ సింగ్	హాలీవుడ్ మూవీ	మార్చి 21
ఎ డీసెంట్ మాన్	వెబ్‌సిరీస్	మార్చి 22

పన్ను పోటు తగ్గించే ఫిక్స్‌డ్ డిపాజిట్లు



తొందర పడితే బెటర్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు దగ్గర పడుతోంది. దీంతో ట్యాక్స్ ప్లానింగ్ కూడా చివరి దశకు చేరిందని చెప్పాలి. పాత పన్ను చెల్లింపు విధానంలో ఉండి.. ఇంకా ఎవరైనా తమ ట్యాక్స్ ప్లానింగ్ పూర్తి చేయకపోతే వెంటనే బ్యాంకులు, పోస్టాఫీసులు అందించే పన్ను ఆదా చేసే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (టీఎస్‌బీఎఫ్‌డీ)పై దృష్టి పెట్టడం మంచిది. ఈ ఎఫ్‌డీలు పన్ను పోటు తగ్గించడంతో పాటు ఎలాంటి రిస్క్ లేకుండా స్థిరమైన ఆదాయాన్ని ఇస్తాయి.

దేశంలో వడ్డీ రేట్ల పెరుగుదలకు దాదాపుగా తెరపడింది. ఫిబ్రవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ఠ స్థాయి 3.6 శాతానికి దిగొచ్చింది. దీంతో ఏప్రిల్‌లో జరిగే ద్రవ్య పరపతి విధాన సమీక్ష (ఎంపీసీ) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును మరో పావు శాతం (0.25%) తగ్గిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే బ్యాంక్ ఎఫ్‌డీల పైనా వడ్డీ రేట్లు తగ్గుతాయి. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో ఏ మాత్రం నష్టభయాన్ని (రిస్క్) భరించలేని మదుపరులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (టీఎస్‌బీఎఫ్‌డీ)పై దృష్టి పెట్టడం మంచిది.

అర్హత: ఇది కూడా ఒకరకమైన ఫిక్స్‌డ్ డిపాజిట్టే. కాకపోతే సెక్షన్ 80సీ కింద ఏటా ఈ ఎఫ్‌డీ పెట్టుబడులకు రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), దేశంలోనే నివసించే భారతీయులు ఈ ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీల్లో మదుపు చేయవచ్చు. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు, ట్రస్టులకు మాత్రం ఈ ఎఫ్‌డీల్లో మదుపు చేసే అర్హత లేదు. వ్యక్తిగతంగా లేదా ఉమ్మడిగా కూడా పన్ను చెల్లింపుదారులు ఈ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. మైనర్లు కూడా పెద్దలతో కలిసి ఈ ఎఫ్‌డీల్లో మదుపు చేయవచ్చు. అయితే ఉమ్మడిగా మదుపు చేస్తే ఫస్ట్ హోల్డర్‌కు మాత్రమే పన్ను మినహాయింపు లభిస్తుంది.

వడ్డీ చెల్లింపు: నెలనెలా లేదా మూడు నెలలకు ఒకసారి ఈ ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలపై వడ్డీ చెల్లిస్తారు. ఏ ఆప్షన్ కావాలన్నది డిపాజిటర్లే ఎంచుకోవాలి. ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం ఆ టైమ్‌కు వడ్డీ ఆదాయం నేరుగా వారి ఖాతాల్లో జమవుతుంది. ఒకవేళ వద్దనుకుంటే ఈ మొత్తాన్ని అసలులో తిరిగి పెట్టుబడి పెట్టవచ్చు.

పరిమితులు: ఈ ఎఫ్‌డీల్లో కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూ.100 చొప్పున ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు మించకుండా మదుపు చేయవచ్చు.

బదిలీ: ఈ ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీని ఒక ఊరి నుంచి మరో ఊరికి లేదా ఒక బ్యాంక్ లేదా పోస్టాఫీస్ బ్రాంచీ నుంచి మరో బ్రాంచీకి బదిలీ చేసుకోవచ్చు. కాబట్టి తరచూ బదిలీలు ఉండే ఉద్యోగులకు ఇది అత్యంత అనుకూలం.

వడ్డీ రేటు: ఈ డిపాజిట్లపై ఒక్కో బ్యాంక్ ఒక్కో వడ్డీ రేటు చెల్లిస్తుంది. ప్రస్తుతం బ్యాంకులు ఈ డిపాజిట్లపై 6.5 శాతం నుంచి 7 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్నాయి. నాన్-సీనియర్ సిటిజన్లతో పోలిస్తే ఆరు పదుల వయసు పైబడి సీనియర్ సిటిజన్లకు ఈ ఎఫ్‌డీలపై అర శాతం (0.5%) వరకు అధిక వడ్డీ చెల్లిస్తారు.

లాక్ ఇన్ పీరియడ్

ఈ ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీల లాక్ ఇన్ పీరియడ్ ఐదేళ్లు. అంటే ఈ ఐదేళ్ల పాటు ఈ ఎఫ్‌డీలను వెనక్కి తీసుకునే అవకాశం ఉండదు. అలాగే ఈ ఎఫ్‌డీల హామీపై ఎలాంటి రుణాలు గానీ, ఓవర్ డ్రాఫ్ట్ గానీ తీసుకునే అవకాశమూ లేదు. వీటికి ఆటో-రెన్యూవల్ ఆప్షన్ కూడా ఉండదు. కాబట్టి గడువు ముగిసిన వెంటనే ఈ ఎఫ్‌డీలను వెనక్కి తీసుకోవాలి. అయితే గడువు ముగిసిన వెంటనే మరో ఐదేళ్లకు ఎఫ్‌డీని రెన్యూవల్ చేసుకోవచ్చు.

ఎవరికి అనుకూలం ?

ఆయా వ్యక్తుల వయసు, ఆర్థిక లక్ష్యాలు, నష్టాలు భరించే శక్తి (రిస్క్), వేచి ఉండగల కాలం, ప్రస్తుత-భవిష్యత్ ఆదాయ అంచనాల ఆధారంగా మదుపరులు ఈ ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలను ఎంచుకోవాలి. అసలుకు ఏ మాత్రం ఢోకా లేకుండా పన్ను ఆదా కోరుకునే మదుపరులకు ఈ ఎఫ్‌డీలు అత్యంత అనుకూలం. సీనియర్ సిటిజన్లు, రిటైర్మెంట్‌కు దగ్గర పడుతున్న వారికి ఇవి అనుకూలమని చెప్పాలి. ఇక పాత పన్ను చెల్లింపు విధానంలో ఉండి, పెట్టుబడుల అసలుకు ఢోకా లేకుండా పన్ను ఆదా కోరుకునే ఉద్యోగులు, వృత్తి నిపుణులూ ఈ ఎఫ్‌డీలపై ఒక కన్నేయడం మంచిది.

జాగ్రత్తలు: అన్ని గుడ్లూ ఒకే బుట్టలో పెట్టకూడదనేది సామెత. ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలకూ ఇది వర్తిస్తుంది. అధిక వడ్డీకి ఆశపడి ఉన్న నాలుగు రాళ్లూ ఒకే బ్యాంకులో కాకుండా రెండు మూడు బ్యాంకుల్లో ఎఫ్‌డీ చేయడం మంచిది. దీనివల్ల ఎంత డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకం కవరేజీ ఉన్నా, ఒక బ్యాంక్ దివాలా తీసినా మరో బ్యాంక్ ఎఫ్‌డీ ఆదుకుంటుంది.

పన్ను ప్రభావం

ఈ ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్స్'గా పరిగణించి ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు. సీనియర్ సిటిజన్లకు వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష మించినా, ఇతరులకు వచ్చే వడ్డీ ఆదాయం రూ.50,000 మించితే 10 శాతం చొప్పున టీడీఎస్ కట్ అవుతుంది. పాన్ నంబరు సమర్పించకపోతే మాత్రం 20 శాతం చొప్పున టీడీఎస్ కట్ అవుతుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే నాన్-సీనియర్ సిటిజన్లు ఫామ్ 15జీ, సీనియర్ సిటిజన్లు ఫామ్ 15హెచ్ సమర్పించడం ద్వారా ఈ టీడీఎస్ పోటు నుంచి తప్పించుకోవచ్చు.

ఏప్రిల్ నుంచి కొత్త టీడీఎస్ నిబంధనలు

సీనియర్ సిటిజన్లకు మరింత ఊరట

ఏప్రిల్ 1 నుంచి మూలంలో పన్ను కోత (టీడీఎస్)కు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. ఈ నిబంధనలు సీనియర్ సిటిజన్లతో పాటు సాధారణ పన్ను చెల్లింపుదారులకూ మేలు చేయనున్నాయి. లాటరీల్లో జాక్‌పాట్ కొట్టే వాళ్లు, బీమా ఏజెంట్లపైనా కొత్త నిబంధనలతో టీడీఎస్ భారం తగ్గనుంది. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

2025-26 కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ టీడీఎస్‌కు సంబంధించి పలు మార్పులు ప్రకటించారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు చాలా మేలు జరగనుంది. కమిషన్ ఏజెంట్లు, ఇన్వెస్టర్లకి కూడా ఈ కొత్త నిబంధనలు మేలు చేయనున్నాయి. ఈ మార్పులు ఏంటంటే ?



సీనియర్ సిటిజన్లకు: మధ్య తరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్ల చేతిలో మరిన్ని డబ్బులు ఉంచాలన్నది 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రధాన లక్ష్యం. ఇందుకోసం టీడీఎస్ పరిధిలోకి వచ్చే సీనియర్ సిటిజన్ల వార్షిక వడ్డీ ఆదాయాన్ని ఆర్థిక మంత్రి రెట్టింపు చేశారు. ఏప్రిల్ 1 నుంచి ఒక బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ల (ఆర్‌డీ)పై వీరికి వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.లక్ష లోపు ఉంటే ఆ ఆదాయానికి టీడీఎస్ వర్తించదు.

సాధారణ ప్రజలకూ ఊరట: సాధారణ ప్రజల వడ్డీ ఆదాయానికీ మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో కొద్దిగా ఊరట లభించింది. 2025 ఏప్రిల్ 1 నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక నాన్-సీనియర్ సిటిజన్ వార్షిక వడ్డీ ఆదాయం రూ.50,000 మించకుండా ఉంటే బ్యాంకులు, ఆ వడ్డీ ఆదాయంపై టీడీఎస్ కట్ చేయవు.

లాటరీ టిక్కెట్లు, గుర్రప్పందాల ఆదాయం: లాటరీ టిక్కెట్లు, క్రాస్‌వర్డ్ పజిల్స్, గుర్రప్పందాల జాక్‌పాట్ ఆదాయానికి ఏప్రిల్ 1 నుంచి కొద్దిగా ఉపశమనం లభించనుంది. గతంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ మార్గాల్లో వచ్చే మొత్తం ఆదాయం రూ.10,000 మించితే టీడీఎస్ పడేది. ఇప్పుడు నిబంధనలు మార్చి ఒక్కో దానిపై వచ్చే వార్షిక ఆదాయం రూ.10,000 మించకుండా ఉంటే చాలని స్పష్టం చేశారు. అంటే ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో లాటరీ టిక్కెట్‌పై రూ.8,000, క్రాస్ వర్డ్ పజిల్ ద్వారా రూ.8,000, గుర్రప్పందంపై బెట్టింగ్ ద్వారా రూ.8,000 ఆదాయం వచ్చిందనుకున్నాం. పాత నిబంధనల ప్రకారం ఈ మూడింటిని కలిపి రూ.10,000కు మించిన ఆదాయంపై టీడీఎస్ కట్ అయ్యేది. ఇప్పుడు ఒక్కోదానిపై రూ.8,000 చొప్పున రూ.24,000 వార్షిక ఆదాయం వచ్చినా పైసా టీడీఎస్ కూడా కట్ కాదు.

బీమా ఏజెంట్లు, బ్రోకర్లకూ ఊరట: వివిధ రకాల కమిషన్ల ఆదాయానికి సంబంధించిన టీడీఎస్ నిబంధనలనూ బడ్జెట్‌లో సవరించారు. గతంలో ఈ వార్షిక కమిషన్ ఆదాయం రూ.15,000 మించితే టీడీఎస్ వర్తించేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.20,000కు పెంచారు. బీమా ఏజెంట్లు, స్టాక్ బ్రోకర్లకు ఇది ఎంతో కొంత మేలు చేస్తుందనడంలో సందేహం లేదు.

ఎంఎఫ్‌లు, షేర్లపై టీడీఎస్: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు, కంపెనీల నుంచి యూనిట్ హోల్డర్లు, వాటాదారులకు అందే వార్షిక డివిడెండ్ ఆదాయం గతంలో రూ.5,000 మించితే టీడీఎస్ వర్తించేది. ఏప్రిల్ 1 నుంచి ఈ మినహాయింపు పరిమితి రూ.10,000కు పెరగనుంది.

సన్‌రైజర్స్‌తో సీయూబీ జట్టు

కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డుల విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ).. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)కు ప్రత్యేక బ్యాంకింగ్ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఈ మేరకు ఎస్ఆర్‌హెచ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఎస్ఆర్‌హెచ్ అభిమానులు, క్రికెటర్లు, సిబ్బంది కోసం కస్టమైజ్డ్ సేవలతో పాటు ప్రత్యేక ఆఫర్లను అందించనున్నట్లు సీయూబీ చైర్మన్ మహాలింగం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ ఆనంద్ తెలిపారు. ఎస్ఆర్‌హెచ్ అభిమానుల కోసం ప్రత్యేక పొదుపు ఖాతాలు, రుణాలు, కో-బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డులను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు విజయ్ చెప్పారు. అలాగే ఎస్ఆర్‌హెచ్‌కు చెందిన జెర్సీలు, క్యాప్స్, ఇతర వస్తువుల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లతో పాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్‌హెచ్ కో-బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డుల కోసం రూపే, మాస్టర్ కార్డ్‌తో జట్టు కట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా తొలిసారిగా రూపే వర్చువల్ క్రెడిట్ కార్డ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మొత్తం నాలుగు రకాల క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు విజయ్ వెల్లడించారు. ప్రస్తుతం సీయూబీ దేశవ్యాప్తంగా 840 శాఖలను నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 90 శాఖలను కలిగి ఉందన్నారు.

ఇండస్‌ఇండ్ ఖాతాదారులూ ఆందోళన వద్దు..

బ్యాంక్ ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందన్న ఆర్‌బీఐ

ముంబై: హిందూజా గ్రూప్‌నకు చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ తగినంత మూలధన నిల్వలను కలిగి ఉందని, బ్యాంక్ ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని ఆర్‌బీఐ శనివారం ప్రకటన జారీ చేసింది. బ్యాంక్ కార్యకలాపాలనూ తామూ నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది. అలాగే, బ్యాంక్‌లో వెలుగు చూసిన అకౌంటింగ్ లోపాలకు సంబంధించి ఈ నెలాఖరులోగా నివారణ చర్యలను పూర్తి చేయాలని ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు, యాజమాన్యాన్ని ఆదేశించింది. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఈ వారంలో వెల్లడించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆర్థిక పరిస్థితిపై ఖాతాదారుల్లోనూ ఆందోళనలు పెరగడంతో ఆర్‌బీఐ రంగంలోకి దిగింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,670 ▼	82,200 ▼	1,12,000 ▲
విజయవాడ	90,500 ▲	85,500 ▼	1,02,500 ▼
విశాఖపట్నం	88,300 ▼	80,940 ▼	1,00,900 ▼
రాజమండ్రి	89,670 ▼	82,200 ▼	1,03,600 ▲
ప్రొద్దుటూరు	89,100 ▼	82,510 ▼	1,00,800 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	395
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	92
కర్నూలు	78	నెల్లూరు	97
విశాఖపట్నం	79	అనంతపురం	97
గోదావరి	85		

స్పోర్ట్స్

కంగారు పడకండి.. ఆ ఆలోచనే లేదు

వీడ్కోలు వార్తలపై విరాట్ కోహ్లీ



బెంగళూరు: క్రికెట్‌కు గుడ్‌బై చెప్పే ఆలోచన లేదంటూ ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేయగా.. తాజాగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా తన రిటైర్మెంట్ వార్తలపై స్పందించాడు. ఆట నుంచి వైదొలగాలని తాను అనుకోవడం లేదని.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ జరిగిన స్పోర్ట్స్ సమ్మిట్‌లో పాల్గొన్న సందర్భంగా విరాట్ వెల్లడించాడు. 'కంగారు పడకండి. నేనె లాంటి ప్రకటనలు చేయడం లేదు. రిటైర్మెంట్‌పై ఎలాంటి ఆలోచనా చేయలేదు. ప్రస్తుతానికైతే అంతా బాగుంది. క్రికెట్ ఆడడాన్ని నేనింకా ఆస్వాదిస్తున్నా' అని 36 ఏళ్ల కోహ్లీ చెప్పుకొచ్చాడు. అయితే, ఆ మధ్య ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీనే ఆస్ట్రేలియాలో తన చివరి పర్యటనగా భావిస్తున్నానని ఈ సందర్భంగా విరాట్ తెలిపాడు. 'నాలో మరో ఆసీస్ పర్యటన మిగిలి ఉండకపోవచ్చు. అందుకే గడచిన జ్ఞాపకాలతో ఎంతో ప్రశాంతంగా ఉంటా. కెరీర్‌కు వీడ్కోలు పలికాక ఏం చేయాలో కూడా నాకు తెలియదు. ఈ మధ్య సహచరులు కొందరిని రిటైర్మెంట్ ప్లానింగ్ గురించి అడిగితే.. వారి నుంచి కూడా ఇదే సమాధానం. బహుశా పెద్ద ఎత్తున పర్యటనలు చేస్తానేమో' అని విరాట్ అన్నాడు.

ఆ ఒక్క మ్యాచ్ కోసం రిటైర్మెంట్ వెనక్కి తీసుకుంటా!

ఇప్పటికే టీ20లకు గుడ్‌బై చెప్పిన కోహ్లీ.. ఒకవేళ భారత జట్టు 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో గనక ఫైనల్ చేరితే, రిటైర్మెంట్ వెనక్కి తీసుకుంటా అని సరదాగా అన్నాడు. 'ఆ విశ్వక్రీడల్లో టీమిండియా ఫైనల్ చేరితే, ఆ ఒక్క మ్యాచ్ ఆడేందుకైనా టీ20ల్లో రిటైర్మెంట్ వెనక్కి తీసుకుంటా. ఒలింపిక్స్‌లో పతకం గెలవడమంటే అద్భుతమే కదా' అని విరాట్ చమత్కరించాడు.

టెస్టు కెప్టెన్‌గా రోహిత్ ఓకేనా?

గంభీర్ చేతిలో భవితవ్యం!



న్యూఢిల్లీ: భారత టెస్టు జట్టు సారథిగా రోహిత్ శర్మ భవితవ్యం ఇప్పుడు కోచ్ గౌతం గంభీర్ చేతుల్లో ఉందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లపై టీమిండియా వరుసగా టెస్టు సిరీస్‌లను కోల్పోవడంతో రోహిత్ సారథ్యంపై విమర్శలు చెలరేగాయి. అలాగే ఆటగాడిగానూ అతను విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో సుదీర్ఘ ఫార్మాట్‌కు కూడా రోహిత్ వీడ్కోలు పలికే అవకాశం ఉందని కథనాలు వినిపించాయి. కానీ వాటిని రోహిత్ తోసిపుచ్చాడు. అయితే జూన్‌లో భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాలి. ఆ సిరీస్‌కు సారథిగా ఎవరనేది బీసీసీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బహుశా ఐపీఎల్ మధ్యలో ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఈ సిరీస్‌కు రోహిత్‌నే కొనసాగించే చాన్సుందని సమాచారం. కానీ అంతకంటే ముందు కోచ్ గంభీర్ అభిప్రాయం కూడా తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. 'ఆస్ట్రేలియా టూర్ తర్వాత భారత్ టెస్టులు ఆడలేదు. అలాగే కెప్టెన్సీ మార్పు కూడా జరగలేదు. సాంకేతికంగా రోహితే ఇప్పటికీ టెస్టు కెప్టెన్. అయితే, రోహిత్‌ను కొనసాగించే విషయంలో గంభీర్ నిర్ణయం కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశముంది' అని బీసీసీఐ అధికారి గుర్తుచేశాడు.

నితీశ్‌కు లైన్‌క్లియర్



బెంగళూరు: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ సందర్భంగా నితీశ్ పక్కటెముకలనొప్పికి గురైన సంగతి తెలిసిందే. అయితే, నితీశ్ తాజాగా జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందినట్టు సమాచారం. యోయో టెస్టు కూడా అతను పాస్ అయ్యాడట. దీంతో ఐపీఎల్‌లో ఆడేందుకు నితీశ్‌కు మార్గం సుగమమైంది. ఈ ఆంధ్ర క్రికెటర్ త్వరలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో చేరనున్నాడు.

ముంబై అ'ద్వితీయం'

బౌలర్ల విజృంభణ ● హర్మన్ కెప్టెన్ ఇన్నింగ్స్ ● ఫైనల్లో ఢిల్లీకి మళ్లీ నిరాశే



లో స్కోరింగ్ థ్రిల్లర్‌తో డబ్ల్యూపీఎల్‌కు అదిరే ముగింపు.. బ్యాటింగ్ పవర్‌హౌస్‌గా పేరున్న ముంబై ఇండియన్స్ చేసిందే 149 పరుగులు.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మినహా అంతా విఫలమయ్యారు. కానీ తమ బ్యాటర్లు రాణించలేని చోట బౌలర్లు విజృంభించారు. ఆరంభం నుంచే టపాటపా వికెట్లు పడగొడుతూ ఢిల్లీ క్యాపిటల్స్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. చివర్లో మరిజానె కాప్ ఢిల్లీ విజయంపై ఆశలు రేపినా.. సివర్ బ్రంట్ దెబ్బ తీయడం మలుపు తిప్పింది. దీంతో రెండోసారి ముంబై టైటిల్‌తో మురిసిపోగా.. అటు సువర్ణావకాశాన్ని చేజార్చుకున్న ఢిల్లీకి వరుసగా మూడోసారీ ఫైనల్ ఫోబియా వదల్లేదు.


హర్మన్‌ప్రీత్ (66)

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ చరిత్ర సృష్టించింది. జరిగిన మూడు సీజన్లలో ఏకంగా రెండో టైటిల్‌తో అదరగొట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 66) ఒంటరి పోరాటానికి బౌలర్ల నుంచి గట్టి మద్దతు లభించింది. దీంతో శనివారం జరిగిన ఫైనల్లో ఢిల్లీ జట్టు స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక 8 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ప్రతీ సీజన్‌లోనూ ఢిల్లీ టేబుల్ టాపర్‌గా నిలిచి నేరుగా ఫైనల్‌కు వెళ్లినా.. అన్నిసార్లూ రన్నరప్‌గానే నిలవడం గమనార్హం. ముందుగా ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 149 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ (66), సివర్ బ్రంట్ (30) మాత్రమే రాణించారు. కాప్, జొనాసెన్, శ్రీచరణిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 141 పరుగులు చేసి ఓడింది. కాప్ (40), జెమీమా (30), నికీ ప్రసాద్ (25 నాటౌట్) పోరాటం సరిపోలేదు. సివర్‌కు 3, అమేలియా కెర్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది.

ఒత్తిడికి చిత్తు: 150 పరుగుల స్వల్ప ఛేదనలో ఢిల్లీ ఘోరంగా తడబడింది. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై కాస్త కుదురుకుంటే చాలనే ఆలోచన లేకుండా పేలవ షాట్లతో వికెట్లను సమర్పించుకుంది. కాప్, జెమీమా పోరాటం ఏమాత్రం సరిపోలేదు. పవర్‌ప్లేలో ముంబైకన్నా మెరుగ్గానే ఆడి 37/2 స్కోరుతో నిలిచినప్పటికీ.. ఆరంభం నుంచి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడం ఒత్తిడిలో పడేసింది. ఓపెనర్లు లానింగ్ (13), షఫాలీ (4).. 17 పరుగులకే పెవిలియన్ చేరారు. కాస్త బ్యాట్ ఝుళిపిస్తున్న జెమీమా 11వ ఓవర్‌లో వెనుదిరగడంతో డీసీ 66/5 స్కోరుతో ఇక కష్టమే అనిపించింది. అయితే చివర్లో కాప్ జట్టును విజయ తీరాలకు చేర్చే ప్రయత్నం చేసింది. 16వ ఓవర్‌లో 4,6,4తో 17 రన్స్ రాబట్టి ముంబై శిబిరంలో గుబులు రేపింది. ఇక గెలుపునకు 27 పరుగులు కావాల్సిన వేళ కాప్‌ను సివర్ అవుట్ చేయడం మ్యాచ్ పూర్తిగా ముంబై వైపు మళ్లింది. నికీ ప్రసాద్ కాస్త బ్యాట్ ఝుళిపించగా.. ఆఖరి ఓవర్‌లో 14 రన్స్ అవసరమయ్యాయి. అయితే సివర్ ఐదు పరుగులే ఇచ్చి ముంబైని సంబరాల్లో ముంచింది.

హర్మన్ పోరాటం: 28/2.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై తొలి 8 ఓవర్లలో చేసిన పరుగులివి. పేసర్ మరిజానె కాప్ ధాటికి ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (3), యాస్తిక భాటియా (8) ఐదు ఓవర్లలోపే వెనుదిరిగారు. అయితే, పేలవంగా ఆరంభమైన వీరి ఇన్నింగ్స్ గౌరవప్రదమైన స్కోరు సాధించడానికి కెప్టెన్ హర్మన్ దూకుడే కారణం. హర్మన్‌కు సివర్ నుంచి కాస్త తోడ్పాటు లభించింది. ఆరంభంలో మాత్రం బౌలర్ల కట్టడితో హర్మన్, సివర్ పరుగుల కోసం చెమటోడ్చారు. దీంతో తమ డబ్ల్యూపీఎల్ కెరీర్‌లోనే రెండో నెమ్మదైన పవర్‌ప్లే (20)ను ముంబై నమోదు చేసుకుంది. కానీ ఓపిగ్గా అదను కోసం చూసిన ఈ జోడీ మధ్య ఓవర్లను తమకు అనుకూలంగా మార్చుకుంది. తొమ్మిదో ఓవర్‌లో సివర్ రెండు ఫోర్లతో స్కోరులో కాస్త కదలిక తెచ్చింది. ఇక పదో ఓవర్‌లో హర్మన్ 6,4తో పాటు తర్వాతి ఓవర్‌లో ఆమె హ్యాట్రిక్ ఫోర్లతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. తానే ఎక్కువగా స్ట్రయిక్ తీసుకుని ఎదురుదాడికి దిగిన కెప్టెన్ 33 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తి చేసింది. మరో ఎండ్‌లో భారీ షాట్లు ఆడలేకపోయిన సివర్‌ను 15వ ఓవర్‌లో స్పిన్నర్ శ్రీచరణి అవుట్ చేసింది. దీంతో రెండో వికెట్‌కు 89 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఒక్కసారిగా ముంబై ఇన్నింగ్స్ కూడా తడబడింది. 16వ ఓవర్‌లో అమేలియా కెర్ (2), సజన (0)లను పేసర్ జొనాసెన్ అవుట్ చేయడంతో ఢిల్లీదే పైచేయి అయ్యింది. అటు ఒత్తిడి పెరిగిన హర్మన్ భారీ షాట్‌కు యత్నించి సదర్లాండ్‌కు చిక్కింది. ఆఖరి ఓవర్‌లో 12 రన్స్ సాధించిన ముంబై ప్రత్యర్థికి 150 పరుగుల టార్గెట్‌ను విధించింది.

1
డబ్ల్యూపీఎల్ చరిత్రలో 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా సివర్ బ్రంట్.
డబ్ల్యూపీఎల్‌లో ఎక్కువ టైటిళ్లు (2) గెలిచిన జట్టుగా ముంబై. 2023లో తొలిసారి విజేతగా నిలిచింది.

స్కోరుబోర్డు

ముంబై: యాస్తిక (సి) జెమీమా (బి) కాప్ 8; హేలీ మాథ్యూస్ (బి) కాప్ 3; సివర్ (సి) మిన్ను (బి) శ్రీచరణి 30; హర్మన్ (సి) కాప్ (బి) సదర్లాండ్ 66; కెర్ (సి) షఫాలి (బి) జొనాసెన్ 2; సజన (ఎల్బీ) జొనాసెన్ 0; కమలిని (స్టంప్) సారా (బి) శ్రీచరణి 10; అమన్‌జోత్ (నాటౌట్) 14; సంస్కృతి (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 149/7. వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-103, 4-112, 5-112, 6-118, 7-132. **బౌలింగ్:** కాప్ 4-0-11-2; శిఖా పాండే 4-0-29-0; సదర్లాండ్ 4-0-29-1; జొనాసెన్ 3-0-26-2; శ్రీచరణి 4-0-43-2; మిన్ను 1-0-10-0.

ఢిల్లీ: లానింగ్ (బి) సివర్ 13; షఫాలీ (ఎల్బీ) షబ్నం 4; జొనాసెన్ (సి) యాస్తిక (బి) కెర్ 13; జెమీమా (సి అండ్ బి) కెర్ 30; సదర్లాండ్ (స్టంప్) యాస్తిక (బి) సైకా 2; కాప్ (సి) మాథ్యూస్ (బి) సివర్ 40; సారా (రనౌట్) 5; నికీ (నాటౌట్) 25; శిఖా (బి) సివర్ 0; మిన్ను (సి) సజన (బి) మాథ్యూస్ 4; శ్రీచరణి (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 141/9. వికెట్ల పతనం:** 1-15, 2-17, 3-37, 4-44, 5-66, 6-83, 7-123, 8-123, 9-128. **బౌలింగ్:** షబ్నం 4-0-15-1; సివర్ బ్రంట్ 4-0-30-3; మాథ్యూస్ 4-0-37-1; కెర్ 4-0-25-2; సైకా 4-0-33-1.

చాంపియన్‌కు షాకిచ్చి ఫైనల్‌కు

ఇండియన్ వెల్స్‌లో ఆంద్రీవా జోరు



న్యూఢిల్లీ: రష్యా టెన్నిస్ సంచలనం, 17 ఏళ్ల మిర్రా ఆంద్రీవా.. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరుగుతున్న ఇండియన్ వెల్స్ మాస్టర్స్ డబ్ల్యూటీఏ టోర్నమెంట్‌లో జోరు కొనసాగిస్తోంది. డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియటెక్ (పోలెండ్)కు షాకిచ్చి సింగిల్స్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో 9వ సీడ్ ఆంద్రీవా 7-6 (1), 1-6, 6-3తో స్వియటెక్‌ను ఓడించి సబలెంక (బెలారస్)తో ఫైనల్‌ఫైట్‌కు సిద్ధమైంది. ఈ క్రమంలో 2001లో క్లియ్‌స్టర్స్ (బెల్జియం) తర్వాత ఇండియన్ వెల్స్‌లో తుదిపోరుకు చేరిన తొలి టీనేజర్‌గా ఆంద్రీవా రికార్డు సృష్టించింది.

15 చెంపదెబ్బలు కొట్టారు

- డీఆర్ఐ కస్టడీలో ఆహారం కూడా ఇవ్వలేదు
- 40 తెల్లకాగితాలపై సంతకాలు చేయించారు
- సినీ నటి రన్యారావు ఆరోపణ



బెంగళూరు, మార్చి 15: తాను అమాయకురాలినని, తనను తప్పుడు కేసులో ఇరికించారంటూ సినీనటి రన్యారావు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్) అధికారులకు లేఖ రాశారు. బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన ఆమె ఈనెల 5వ తేదీన చేతితో రాసిన ఐదు పేజీల లేఖను ఆ తర్వాతి రోజు జైలు అధికారుల ద్వారా డీఆర్ఐ అదనపు డీజీకి పంపారు. హర్షవర్థిని రన్య(33)గా ఆ లేఖలో తనను తాను ఆమె పరిచయం చేసుకున్నారు. తన భర్త జతిన్ హుక్కేరి అని తెలిపారు. 'విమానంలో నన్ను అదుపులోకి తీసుకున్నారు. వివరణ ఇచ్చే అవకాశం కూడా నాకు కల్పించకుండానే అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకునే, కోర్టులో ప్రవేశపెట్టే సమయాల్లో కనీసం 10 నుంచి 15 సార్లు అధికారులు నన్ను చెంపదెబ్బలు కొట్టారు. వారిని నేను గుర్తుపట్టగలను. నా తండ్రి పాత్ర ఏమీ లేకపోయినా.. అధికారులు తయారు చేసిన పత్రాలపై నేను సంతకం చేయకుంటే గనుక నా తండ్రి పేరు, ఆయన ఎవరనేది బహిర్గతం చేస్తామని ఒక అధికారి నన్ను బెదిరించారు. తీవ్ర ఒత్తిడి, భౌతిక దాడి నేపథ్యంలో టైప్ చేసిన 50-60 పేజీలతోపాటు సుమారు 40 తెల్ల కాగితాల పైనా సంతకాలు చేశాను. డీఆర్ఐ కస్టడీలో నన్ను సరిగా నిద్ర పోనీయలేదు. ఆహారం కూడా ఇవ్వలేదు. అధికారులు ప్రకటించినట్టు మహజర్ తీసుకోలేదు. నన్ను సోదా చేయనూ లేదు. ఏమీ స్వాధీనమూ చేసుకోలేదు. కొందరు ఢిల్లీ అధికారులు ఇతర ప్రయాణికులను కాపాడేందుకు నన్ను ఇరికించాలనుకొంటున్నారు. నన్ను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి కోర్టులో ప్రవేశపట్టే వరకు రికార్డు చేసిన ఏ వాంగ్మూలంపైనా ఆధారపడొద్దని అభ్యర్థిస్తున్నాను' అని ఆ లేఖలో రన్యారావు పేర్కొన్నారు. లేఖపై తన సంతకం వద్ద రిమాండ్ ఖైదీ నంబరు 2198/25ను కూడా రన్యారావు రాశారు.

రూ.229 కోట్ చేసి.. అధిక ధరకు అమ్ముతారా?

- సాధ్యం కాకపోతే ఆ ధర ఎందుకు కోట్ చేశారు?
- ఉచిత ఇసుక విధానంలో నిబంధనలు పాటించాల్సిందే
- తేడా వస్తే చర్యలు తప్పవు: మైన్స్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్



జిల్లా ఇసుక కమిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి. ఎస్పీ నరసింహ కిశోర్, కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 'ర్యాంపుల నిర్వాహకులు టన్ను ఇసుకను రూ.229కి సరఫరా చేస్తామని కోట్ చేసి అంత కంటే ఎక్కువ ధరకు ఎందుకు విక్రయిస్తున్నారు?. సాధ్యం కాకపోతే ఆ ధరను ఎందుకు కోట్ చేశారు?' అని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా ఇసుక కమిటీ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక సరఫరా విధానంపై రాష్ట్రంలోని 60 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, మిగతా 40 శాతం మంది కూడా సంతృప్తి చెందేవిధంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం టన్ను ఇసుకను రూ.475 కంటే ఎక్కువగా విక్రయిస్తే.. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తెచ్చారని, కానీ ఇసుక నిర్వహణ ఏజెన్సీలు రూ.400 కంటే ఎక్కువకు అమ్ముతున్నాయని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. దీనిపై ప్రతి నెలా సీఎం సమీక్షిస్తున్నారన్నారు. ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను కూడా చదివి వినిపించారు. ఇకపై తప్పులు జరక్కుండా చూడాలని, రీచ్‌లలో త్వరలో ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులు వస్తే తానే స్వయంగా వినియోగదారులతో మాట్లాడి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వీస్ విధానంలో ఇసుక సరఫరా, రవాణా ఉండాలని స్పష్టం చేశారు. కొన్ని ఏజెన్సీలు సరైన పనితీరు చూపకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వాటికి అందరూ సకాలంలో జవాబు ఇవ్వాలని స్పష్టం చేశారు. నిబంధనలు ధిక్కరిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని, ఎన్జీటీ, సుప్రీంకోర్టు కఠినంగా వ్యవహరిస్తున్నాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజనీ శ్రీనివాసన్

అమెరికా వీసా రద్దు

- హమాస్ అనుకూల కార్యక్రమాలపై చర్యలు

వాషింగ్టన్, మార్చి 15: కొలంబియా యూనివర్సిటీలో చదువుతున్న భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ వీసాను అమెరికా ప్రభుత్వం వారం క్రితం రద్దు చేసింది. ఉగ్రవాద సంస్థ హమాస్‌కు అనుకూలంగా ఆమె వ్యవహరించిన కారణంగా అగ్రరాజ్యం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆమె స్వచ్ఛందంగా స్వదేశానికి మంగళవారం తిరిగి వెళ్లారని హోమ్‌ల్యాండ్ భద్రతా శాఖ వెల్లడించింది. దీనికి సంబంధించి ఎయిర్‌పోర్టులో ఆమె విమానం ఎక్కుతున్నప్పటి ఓ వీడియోను విడుదల చేసింది. అయితే రంజనీ హమాస్‌కు అనుకూలంగా చేసిన కార్యక్రమాల వివరాలను ప్రభుత్వం వెల్లడించలేదు. కాగా, కొలంబియా యూనివర్సిటీలో హోమ్‌ల్యాండ్ భద్రతా అధికారులు సోదాలు నిర్వహించారు. పాలస్తీనాకు అనుకూలంగా పనిచేసే వారు యూనివర్సిటీలో ఇంకా ఎవరైనా ఉన్నారేమో అనే అనుమానంతో ఈ సోదాలు చేశారని యూనివర్సిటీ అత్యున్నత అధికారి వెల్లడించారు. పాలస్తీనాకు అనుకూలంగా గతేడాది జరిగిన కార్యక్రమాల్లో ఇద్దరి పాత్ర ఉన్నట్లు వెల్లడైందని తెలిపారు. యూనివర్సిటీలో హమాస్ వ్యవహారాలపై అమెరికా న్యాయ శాఖ కూడా విచారణ జరుపుతోంది. కాగా రంజనీ కొలంబియా యూనివర్సిటీలో అర్బన్ ప్లానింగ్‌లో డాక్టరేట్ చేస్తున్నారు. ఎఫ్1 వీసాపై ఆమె అమెరికాకు వెళ్లారు. మెరిట్ స్టూడెంట్‌గా ఆమె గుర్తింపు పొందారు.

వీరుడు విక్రమ్



విక్రమ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'వీర ధీర సూరన్ 2'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మించారు. ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోంది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. బలమైన శత్రువుతో తలపడిన సామాన్యుడి కథగా రూపుదిద్దుకున్న చిత్రవిదని తెలుస్తోంది. యాక్షన్ ఘట్టాలు, సంభాషణలు, విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.

సమంత నిర్మాతగా శుభం




కథానాయిక సమంత చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఆమె సొంత నిర్మాణ సంస్థ 'త్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై తొలి సినిమాగా తెరకెక్కిన 'శుభం' చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్రానికి వసంత్ మరిగంటి కథను అందించగా, 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. సి.మల్లిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, శ్రావణి ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రం త్వరలో థియేటర్లలో విడుదల కానుంది.

'రాబిన్‌హుడ్'లో డేవిడ్ వార్నర్



ఆస్ట్రేలియా క్రికెట్ క్రీడాకారుడు డేవిడ్ వార్నర్ తన ఆటతోనే కాదు, పలువురు టాలీవుడ్ హీరోలను అనుకరిస్తూ చేసిన వీడియోల ద్వారానూ తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. త్వరలో ఆయన తెలుగు తెరపై సందడి చేయనున్నారు. నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్'లో వార్నర్ అతిథి పాత్ర పోషించారు. శనివారం వార్నర్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'రాబిన్‌హుడ్'లో వార్నర్‌ది అతిథి పాత్రే అయినప్పటికీ ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ, సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ 'రాబిన్‌హుడ్' చిత్రానికి ప్లస్ కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ యర్నేని, వై. రవిశంకర్ చెప్పారు. ఈ నెల 28న విడుదల కానున్న 'రాబిన్‌హుడ్' చిత్రంలో శ్రీలీల కథానాయిక. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ ముఖ్య పాత్రలు పోషించారు. వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకుడు.

కాలం కలిపిన ప్రేమజంట



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'కాలమేగా కరిగింది' శింగర మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది. శనివారం చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. కలహాలే లేని ఓ ప్రేమ జంటను కాలం విడదీస్తే ఏం జరిగింది, ఆ జంట తిరిగి ఎలా కలిసింది.. అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ ప్లజెంట్ లవ్‌స్టోరీని పొయెటిక్‌గా, అందంగా రూపొందించినట్లు దర్శకుడు సందీప్‌రాజ్ చెప్పారు.

దొంగలొస్తున్నారు



వైవిధ్యమైన కథతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'రాజుగారి దొంగలు'. నడిమింటి లిఖిత సమర్పణలో బంగారు నాయుడు నిర్మించారు. లోకేశ్ రనాల్ హిటాసో దర్శకుడు. లోహిత్ కల్యాణ్, రాజేశ్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 21న 'రాజుగారి దొంగలు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. సంగీతం: నాఫల్ రాజా, సినిమాటోగ్రఫీ: సందీప్ బీ

సందేశంతో సిద్ధం



దేశ భవిత యువత చేతిలో అనే కథాంశంతో గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న సందేశాత్మక చిత్రం 'రైస్ విల్'. లౌక్య, మేఘన, హరీశ్ ప్రధాన తారాగణం. సీఎం మహేశ్ దర్శకుడు. ఎం. వంశీధర్‌రెడ్డి, శ్రీనివాస్ సాయిని నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది, ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. సంగీతం: సతీశ్ సాధన్, సినిమాటోగ్రఫీ: ఈదర ప్రసాద్

చిత్రజ్యోతి
SINCE 1965

శివయ్యకు కన్నప్ప స్తుతి



మంచు విష్ణు ప్రధాన పాత్రలో ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మోహన్ బాబు నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఏప్రిల్ 25న విడుదల కానుంది. విష్ణు శనివారం అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని ఊటుకూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలోనే భక్త కన్నప్ప జన్మించారని భక్తుల విశ్వాసం. తొలుత అక్కడ ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించిన విష్ణు కన్నప్ప ఇంటిని సందర్శించారు. ఆలయ అభివృదికి తోడ్పాటునందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

సమాజానికి అద్దం పట్టేలా




సప్తగిరి కథానాయకుడిగా అభిలాష్ రెడ్డి గోపిడి తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. రోహిణి, ప్రియాంక శర్మ కీలక పాత్రలు పోషించారు. దిల్ రాజు సమర్పణలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. ఈనెల 21న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. సప్తగిరి మాట్లాడుతూ "ఈ సినిమా విజయం సాధిస్తుందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. దర్శకుడు అభిలాష్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అందరూ పొట్టచెక్కలయ్యేలా నవ్వుకోవడం గ్యారంటీ. ఈ సినిమా ఇంటిల్లిపాదినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను ఈ సినిమా చక్కగా ప్రతిబింబిస్తుంది. అవుట్‌పుట్ బాగా వచ్చింది" అని దర్శకుడు అభిలాష్ అన్నారు. "ఈ కుటుంబ కథా చిత్రంలో మంచి వినోదం ఉంది" అని చిత్ర నిర్మాత కె.వై.బాబు తెలిపారు.

మోగ్లీ యాక్షన్



తన తొలి సినిమా 'బబుల్ గమ్'తో అందరి దృష్టినీ ఆకర్షించిన యువ నటుడు రోషన్ కనకాల ప్రస్తుతం 'మోగ్లీ 2025' చిత్రంలో నటిస్తున్నారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రోషన్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'మోగ్లీ 2025'లో అతని పాత్ర స్వభావాన్ని తెలియజేసేలా ఈ పోస్టర్ ఉంది. సినిమా గ్లింప్స్‌లో రోషన్‌ను యాక్షన్ అవతార్‌లో చూపించారు. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరిలో విడుదల కానుంది.

అనగనగా ఓ ప్రేమకథ



నూతన తారాగణంతో ఆస్ట్రేలియా గడ్డపై తెరకెక్కిన ప్రేమకథా చిత్రం 'అనగనగా ఆస్ట్రేలియాలో'. తారకరామ దర్శకత్వంలో బీటీఆర్ శ్రీనివాసరావు నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాజాగా చిత్ర బృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. తారకరామ మాట్లాడుతూ 'మెల్‌బోర్న్‌లో చిత్రీకరణ అంత సులువు కాదు, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సినిమాను పూర్తి చేశాం' అన్నారు.


సాలూరులో శనివారం గిరిబజార్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

గిరిశిఖర గ్రామాలకు నిత్యావసరాలు

- ‘గిరిబజార్’ ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి
- రాష్ట్రంలో మన్యం జిల్లాలోనే తొలిసారి

పార్వతీపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మారుమూల కొండల్లో నివసించే గిరిజనులకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిబజార్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కొండశిఖర గ్రామాల ప్రజలు వారపు సంతలకు వెళ్లి వారానికి ఒకసారి నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ స్వయంగా ఈ సంతలను పరిశీలించారు. సంతల్లో కూడా నాణ్యమైన నిత్యావసర సరుకులు అందడం లేదని గిరిజనులు చెప్పడంతో.. వారి చెంతకే సరుకులు చేరవేసేందుకు గిరిబజార్ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో వచ్చిన సరుకులు గిరిజనులు కొనుగోలు చేయవచ్చు. ఈ వాహనాలను గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం సాలూరులో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు నిత్యావసర సరుకులు చేరవేసేందుకు ఈ వాహనాలను ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వంలో గిరిజనుల కష్టాలను పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో గిరిజన గ్రామాలకు రోడ్లు వేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాకు అందించిన అంబులెన్స్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.

18 నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు

- పకడ్బందీగా ఏర్పాట్లు.. పరిశీలించిన శాప్ చైర్మన్

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఇండోర్ స్టేడియాల్లో జరిగే క్రీడలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను శాప్, వీఎంసీ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే క్రికెట్, వాలీబాల్, టెన్ని కాయిట్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, థగ్‌ఆఫ్ వార్, అథ్లెటిక్స్ 100 మీటర్ల కోర్టులను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహించే షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను తనిఖీ చేశారు.క్రీడల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారని, ఆయన అధికారులకు తెలియజేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చక్కని ఏర్పాట్లతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. శాప్, వీఎంసీ అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పూర్తి చేయాలని రవినాయుడు వారికి పలు సూచనలు చేశారు.


విజయవాడలోని గవర్నర్‌పేటలో ఎండ వేడిమికి విద్యార్థినుల అవస్థలు

మండుతున్న ఎండలు
నేడు కోస్తాలో తీవ్ర వడగాడ్పులు

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేశాయి. శనివారం కూడా పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా నంద్యాల జిల్లా గోస్పాడు, కర్నూలు జిల్లా ఉలిందకొండలో లో 41.8, ప్రకాశం జిల్లా దరిమడుగు, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 41.7, కడప జిల్లా మద్దూరు, ఖాజీపేటలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు వడగాడ్పులు తోడయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 19 మండలాల్లో తీవ్రంగా, 54 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. ఆదివారం కోస్తా ప్రాంతంలో 45 మండలాల్లో తీవ్రంగా, 185 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సోమవారం 34 మండలాల్లో తీవ్రంగా, 171 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు ఉంటాయని అంచనా వేసింది.


విజయవాడలోని పటమటలో మండుటెండలో పిల్లలను స్కూల్ నుంచి తీసుకొస్తున్న మహిళలు

రోగమొకటి.. మందొకటి!

‘రెవెన్యూ’ పరిష్కారంపై గందరగోళం
ప్రజా సమస్యలపై సీఎం చెప్పేదొకటి..అధికారులు చేసేది మరొకటి

- క్షేత్రస్థాయికి వెళ్లాలని సీఎం ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా సగానికి పైగా మండలాల్లో తహశీల్దార్ పోస్టులు ఖాళీ
- భర్తీ చేయకుండా పరిష్కారం ఎలా?
- ఆర్ఐ, డీటీ పదోన్నతులు ఇస్తే సరిపోతుందా?
- రెవెన్యూ శాఖలో పొంతన లేని చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో 679 మండలాలు ఉండగా... తహశీల్దార్ పోస్టులు 380 దాకా ఖాళీ ఉన్నాయి. మండల రెవెన్యూ కార్యాలయాల్లో కీలకమైన తహశీల్దార్ పోస్టులను భర్తీ చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం ఎలా? డిప్యూటీ తహశీల్దార్ (డీటీ)లకు ఒక్కొక్కరికి రెండు మండలాల బాధ్యతలు అప్పగిస్తే ఫిర్యాదులన్నీ పరిష్కరించడం సాధ్యమేనా? ప్రస్తుతం రెవెన్యూ శాఖ ముందున్న అతి పెద్ద సమస్య ఇది? ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల విన్నపాలు, ఫిర్యాదులపై రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఓ సమీక్షా సమావేశంలో ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ఏదో సాదాసీదాగా సాగితే ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. రెవెన్యూ శాఖ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో పదోన్నతుల ద్వారా కొన్ని ఖాళీలను భర్తీ చేద్దామంటూ రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. ఏయే ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్నో ఆ లేఖలో ప్రస్తావించారు. మండల కార్యాలయాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహశీల్దార్ పోస్టుల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయాల్లో డీటీల కంటే తహశీల్దార్ పోస్టులే ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. రాష్ట్రంలో 679 మండలాలకు గాను రెగ్యులర్ తహశీల్దార్లు ఉన్నది కేవలం 40 శాతమే. మిగిలిన మండలాల్లో సగటున ఒక్కో డీటీని రెండు మండలాలకు ఇన్‌చార్జి తహశీల్దార్లుగా కొనసాగిస్తున్నారు. ఇక డీటీల విషయానికొస్తే రాష్ట్రవ్యాప్తంగా 260 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్ఐలకు పదోన్నతులు ఇస్తే డీటీలు అవుతారు. మరి తహశీల్దార్ పదోన్నతుల మాటేమిటి? రెవెన్యూ శాఖ కలెక్టర్లకు పంపించిన లేఖలో తహశీల్దార్ పదోన్నతుల ప్రస్తావనే లేదు. అంటే.. మండలాల్లో తహశీల్దార్‌గా రెగ్యులర్ అధికారి లేకుండా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం చేయాలనుకుంటోందా? అది సాధ్యమయ్యే పనేనా? ముఖ్యమంత్రి చెప్పిన దాంట్లో సగం మాత్రమే పనిచేస్తాం, మిగతా సగం అలాగే పెండింగ్ పెడతామన్నట్లుగా రెవెన్యూ శాఖ తీరు ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డీటీలకు అదనపు పని

మండల రెవెన్యూ వ్యవస్థకు తహశీల్దార్‌నే కీలకం. రాష్ట్రంలో సగానికి పైగా మండలాల్లో తహశీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీటీ పోస్టులు కూడా తగినంతగా లేకపోవడంతో 12 జిల్లాల పరిధిలో ఒక్కో డీటీకి సగటున రెండు మండలాల ఇన్‌చార్జి తహశీల్దార్ పోస్టులు అప్పగించారు. అంటే.. ఆయా మండలాల్లో డీటీ వారే.. తహశీల్దార్ కూడా వారే అన్న మాట. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర ఉంటుంది. ప్రజలు ఇచ్చిన అర్జీలపై విచారణ చేసేది గ్రామ వీఆర్‌ఓ, ఆర్ఐలే. వారు ఇచ్చే నివేదికలను మండల స్థాయిలో డీటీ పరిశీలించి పరిష్కారం ఎలా ఉండాల్నో సిఫారసు చేస్తారు. ఆ తర్వాత తహశీల్దార్ దాన్ని అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేస్తారు. ప్రస్తుతం ఈ రెవెన్యూ చక్రంలో తహశీల్దార్ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయి. ఆర్ఐ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా 230 ఖాళీగా ఉన్నాయి. ఇక ఆఫీసులో పని చేసే సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 360 పైనే ఖాళీలున్నాయి. కీలకమైన రెవెన్యూ వ్యవస్థలో ఇన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భర్తీలో ప్రాధాన్య క్రమమేదీ?

రెవెన్యూ శాఖ ప్రాధాన్య క్రమంలో తొలుత తహశీల్దార్ పోస్టులను భర్తీ చేయాలి. అంటే.. సర్వీస్ కమిషన్ ద్వారా వచ్చిన డీటీలు, పదోన్నతుల ద్వారా వచ్చిన డీటీలకు వారి అర్హతలను బట్టి తహశీల్దార్‌గా పదోన్నతి ఇవ్వాలి. ఆ తర్వాత వారికి మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలి. అప్పుడు డీటీల కేటగిరిలో ఎన్ని ఖాళీలు ఏర్పడతాయో వాటి ఆధారంగా కింది స్థాయి పదోన్నతులు చేపట్టాలి. అయితే రెవెన్యూ శాఖ అసలు పని చేయకుండా కొసరు పని చేస్తానంటోంది. ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌లకు డీటీ పదోన్నతులు ఇవ్వాలని కలెక్టర్లను పురమాయించింది. అసలైన తహశీల్దార్ ఖాళీల భర్తీ అంశాన్ని వదిలేసింది. ఇది.. నేల విడిచి సాము చేయడమేనని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారం పక్కాగా సాగాలంటే, ప్రజల సమస్యలు తీరాలంటే రెవెన్యూ వ్యవస్థ సరిగ్గా ఉండాలి. అలా కాకుండా కేవలం రెండు రకాల పోస్టుల ఖాళీలే భర్తీ చేసి, నిర్ణయాత్మకమైన తహశీల్దార్ పోస్టులను ఖాళీగా ఉంచుతామంటే ఎలా? ప్రభుత్వం చెప్పే దానికి, ఆచరణలో రెవెన్యూ శాఖ చేసే పనికి ఏమైనా పొంతన ఉందా? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ వ్యవస్థలో తహశీల్దార్ కీలకం కాబట్టి తొలుత ఆ పోస్టులను భర్తీ చేయాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. ఆ తర్వాత కింది స్థాయిలో ఏర్పడే ఖాళీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలా చేయకపోతే ప్రజా సమస్యల పరిష్కారం మళ్లీ మొదటికే వస్తుందని రెవెన్యూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.


శాఖను సంస్కరించాలి

‘ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని రెవెన్యూ శాఖను సంస్కరించాలి. ఉన్నత స్థాయి నుంచి ప్రక్షాళన చేయాలి. అప్పుడే ప్రజలకు భూముల కష్టాలు తీరుతాయి. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో సమూల మార్పులు తీసుకురావాలి. తహశీల్దార్ స్థాయిలో ఖాళీలు ఉంచి డీటీలకు రెండు మూడు మండలాలు అప్పగించడం దారుణం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి? ఇకనైనా ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి చొరవ తీసుకొని శాఖను సమూలంగా బలోపేతం చేయాలి’ అని రెవెన్యూ నిపుణుడు రామయ్య సూచించారు.

న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వర్ధంతిని పురస్కరించుకుని కడప జిల్లా పులివెందులలో ఉన్న వివేకా సమాధి వద్ద కుటుంబంతో సహా ఆమె నివాళులు అర్పించారు. అనంతరం భర్త రాజశేఖర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. "ఆరు సంవత్సరాలుగా న్యాయం కోసం ఎంత పోరాటం చేస్తున్నామో అందరూ చూస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిలో ఒక్కరు తప్ప అందరూ బయటే ఉన్నారు. స్వేచ్ఛగా బతుకుతున్నారన్నారు. సీబీఐ విచారణలు ఆగిపోయాయి. కోర్టు విచారణలు ఇంకా మొదలే కాలేదు. వివేకానందరెడ్డి అంతటి వారికే ఇంత అన్యాయం జరుగుతుంటే.. సామాన్యులకు ఏం న్యాయం జరుగుతుంది. మా న్యాయ పోరాటం ఆగేదే లేదు. కచ్చితంగా పోరాటం సాగిస్తాం. నిందితుల కంటే ఎక్కువ శిక్ష మేము, మా కుటుంబ సభ్యులే అనుభవిస్తున్నారు. ఇది న్యాయమా?. కానీ, కచ్చితంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది. సీబీఐ మళ్లీ విచారణ మొదలుపెడుతుందన్న నమ్మకం ఉంది. నిందితులకు కోర్టు శిక్ష విధిస్తుంది. ఇవన్నీ జరిగేలా ఆయా సంస్థలను నేను ఎంతో ప్రాధేయపడుతున్నా. ఇప్పటి వరకు జరిగిన ఇన్వెస్టిగేషన్‌లో ఎన్నో లోపాలు జరిగాయి. నిందితులకు వీటి నుంచి తప్పించుకునేందుకు బాగా తెలుసు. అందుకే ఇంకా న్యాయం జరగలేదు" అని సునీత అన్నారు. వివేకా కేసు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని చెప్పారు. అయితే, వివేకా కేసులో సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోతున్నారని ఇలాంటి సమయంలో వారికి రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరుతున్నట్టు తెలిపారు. సాక్షుల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు, వారికి భద్రత కూడా కల్పించాలని కోరారు. సాక్షులుగా ఉన్న వారిపై చాలా ఒత్తిళ్లు తెస్తున్నారని, ఇలాంటి చర్యలపైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సునీత విజ్ఞప్తి చేశారు.


పులివెందులలో వివేకా సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఆయన కుమార్తె సునీత

వివేకాకు కుటుంబ సభ్యుల నివాళి

వివేకానందరెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సోదరుడు సుధీకర్ రెడ్డి, వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి తదితరులు సమాధుల తోటకు వచ్చారు. వివేకా సమాధిపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గవర్నర్‌తో సునీత భేటీ

రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో వివేకా కుమార్తె సునీత శనివారం సాయంత్రం భేటీ అయ్యారు. విజయవాడలోని రాజ్‌భవన్‌కు వచ్చిన ఆమె సుమారు 15 నిమిషాల పాటు గవర్నర్‌తో చర్చించారు. తన తండ్రి వివేకా హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేసేలా చూడాలని విన్నవించారు. తన తండ్రి హత్య జరిగి ఆరేళ్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు విచారణ పూర్తి కాలేదని వివరించారు. హత్య జరిగిన నాటి నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను ఆమె గవర్నర్‌కు వివరించారు. హత్య కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి దోషులకు శిక్ష పడేలా చూడాలని కోరారు.

హోరాహోరీ పోరులో సీజే జట్టు గెలుపు



ట్రోఫీ అందుకుంటున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జట్టు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదుల జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో న్యాయమూర్తుల జట్టు విజేతగా నిలిచింది. శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని డాక్టర్ల క్రీడా అకాడమీ మైదానంలో నిర్వహించిన ఈ మ్యాచ్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని జట్టు మొదట బ్యాటింగ్ చేసి 15 ఓవర్లో 111 పరుగులు చేసింది. అనంతరం అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం జట్టు 15 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి వంద పరుగులు మాత్ర మే చేసింది. విజయం సాధించిన సీజే జట్టు ట్రోఫీని అందుకుంది.

రాయలసీమ ఎత్తిపోతలకు
పర్యావరణ అనుమతి నిరాకరణ

- మళ్లీ విధివిధానాలు జారీ చేయాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తరలించడానికి ఉద్దేశించిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర అటవీశాఖ నిపుణుల మదింపు కమిటీ (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) అనుమతిని నిరాకరించింది. ఈ ప్రాజెక్టుకు మళ్లీ అనుమతి కోసం విధివిధానాలు జారీ చేయాలని గతనెల 27న వివిధ ప్రాజెక్టులకు అనుమతి కోసం జరిగిన ఈఏసీ సమావేశంలో నిర్ణయించారు. ఈ ఎత్తిపోతలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వరాదని కేంద్ర పర్యావరణ శాఖకు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖలు రాశారు. కేంద్ర పర్యావరణ మంత్రిని నేరుగా కూడా కలిసి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దీంతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతిని నిరాకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. "ఎన్‌జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి, రాయలసీమ ఎత్తిపోతలను ఏపీ నిర్మిస్తోందనే విషయాన్ని స్పష్టంగా చెప్పడం వల్లే పర్యావరణ అనుమతి ఆగిపోయింది. ఈ ప్రాజెక్టును అడ్డుకోకపోతే తెలంగాణలో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తేవి" అని ఈ నిర్ణయంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

రాజు ప్రజల్లోకి వెళ్లకపోతే..
కోటరీ.. కోటా ఏదీ మిగలదు

- జగన్‌ను ఉద్దేశించి విజయసాయిరెడ్డి ట్వీట్

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ చుట్టూ ఉన్న కోటరీ కారణంగానే తాను పార్టీ నుంచి బయటకు వచ్చేశానని ఇటీవల ప్రకటించిన విజయసాయిరెడ్డి.. శనివారం ఎక్స్ వేదికగా మరో ఆసక్తికర ట్వీట్ చేశారు. కోటరీపై జగన్ ఆధారపడితే.. చివరకు ఆ కోటరీ వదలదు. కోట కూడా మిగలదు.. అంటూ హితోక్తులతో కూడిన హెచ్చరిక చేశారు. 'పూర్వకాలంలో మహారాజులు కోటల్లో ఉండేవారు. కోటలో ఉన్న రాజుగారి చుట్టూ కోటరీ ఉండేది. ప్రజలు ఎన్నికష్టాలు పడుతున్నా, రాజ్యం ఎలా ఉన్నా.. ఆహా రాజా.. ఓహో మహరాజా! అంటూ పొగడ్తలతో రాజు కళ్లకు గంతలు కట్టి, కోటరీ తన ఆటలు సాగించుకునేది. దీనితో రాజూ పోయేవాడు. రాజ్యం కూడా పోయేది. మహారాజు తెలివైనవాడు అయితే.. మారువేషంలో ప్రజల్లోకి వచ్చి, ఏం జరుగుతుందో తనకు తానుగా తెలుసుకునేవాడు. కోటరీ మీద వేటు వేసి, రాజ్యాన్ని కాపాడుకునేవాడు. కోటలో రాజుగారు బాగుండాలంటే సామాన్య ప్రజల్లోకి రావాలి. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవాలి. లేదంటే కోటరీ వదలదు. కోట కూడా మిగలదు. ప్రజాస్వామ్యంలోనైనా జరిగేది ఇదే!' అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

గుంటూరు మేయర్ రాజీనామా

- కూటమి ప్రభుత్వ అవమానాలు భరించలేకే!
- వైసీపీలోనే కొనసాగుతా: మనోహర్ నాయుడు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ పదవికి కావటి శివనాగ మనోహర్‌నాయుడు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కలెక్టర్‌కు పంపుతున్నట్టు శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. చివరి వరకు వైసీపీలోనే కొనసాగుతానని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తానని చెప్పారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని, కూటమి నాయకుల అవమానాలు భరించలేకే పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తన కారు డ్రైవర్‌ను, సిబ్బందిని కూడా పూర్తిగా తొలగించారన్నారు. తనకు తెలియకుండానే స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయటం, అధికారులు, కూటమి నాయకులు కుమ్మక్కయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గుంటూరు చరిత్రలో ఇలాంటిది ఎప్పుడు లేదని చెప్పారు. నాలుగేళ్లపాటు మేయర్‌గా పనిచేశానని, తనకు సహకరించిన కార్పొరేటర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తమిళం మధురమైన భాష...
మన దేశ ఆస్తి, ప్రపంచ ఆస్తి కూడా

- మనం గర్వించాల్సిన విషయం: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

చెన్నై, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 'కాన్పూర్ ఐఐటీలో చదువుతున్న సమయంలో పరిచయమైన ఆచార్య శరగోపన్ నాకు తమిళం నేర్పించారు. తమిళం మధురమైన భాష' అని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ‘తమిళం ఒక తియ్యటి భాష. తమిళ భాష, సంస్కృతి, సంప్రదాయాలను అందరూ గౌరవించాలి. తమిళం మన దేశ ఆస్తి మాత్రమే కాదు... ప్రపంచ ఆస్తి కూడా. అందుకే మనం గర్వపడాలి. భారతీయ భాషలన్నింటినీ గౌరవించాలి. ఆ స్ఫూర్తితోనే ప్రధాని పనిచేస్తున్నారు. దేశంలో మాట్లాడే ప్రతి భాషకూ సముచిత స్థానం కల్పించడంతో పాటు తగిన గౌరవం కల్పించేలా ప్రధాని వ్యవహరిస్తున్నారు. విభిన్న నాగరికతల మధ్య మన దేశ సౌభ్రాతృత్వానికి, స్నేహానికి, సంబంధాలకు ఎలాంటి అడ్డంకులు రాకూడదు. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను రూపొందించడంతో పాటు మన బలాన్ని ప్రపంచం గుర్తించేలా అందరూ పాటుపడాలి. ఐఐటీ చెన్నై విద్యార్థులు ఇటీవల హైపర్‌లూప్ సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ప్రాజెక్ట్ భారతీయ రైల్వేకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది’ అని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

‘నిర్బంధ హిందీ’పై మాట మార్చిన పవన్: కనిమొళి



కనిమొళి ఎక్స్ పేజీలో పెట్టిన ఆంధ్రజ్యోతి క్లిప్పింగ్‌తో కూడిన పవన్ కల్యాణ్ ట్వీట్

చెన్నై, మార్చి 15(ఆంధ్ర జ్యోతి): జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్న డీఎంకే నేతలపై పిఠాపురంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ సీనియర్ నాయకురాలు కనిమొళి కౌంటర్ ఇచ్చారు. 2017లో ఆంధ్రజ్యోతి పత్రికలో చలసాని నరేంద్ర ‘హిందీ గో బ్యాక్’ పేరుతో రాసిన వ్యాస క్లిప్పింగును సామాజిక మాధ్యమాల్లో జత చేసి, ‘ఉత్తర భారత రాజకీయ నాయకులు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలి, గౌరవించాలి’ అని పవన్ కల్యాణ్ అప్పట్లో ఎక్స్‌లో పెట్టిన పోస్టును కనిమొళి గుర్తు చేశారు. బీజేపీకి మద్దతు ఇవ్వక ముందు నిర్బంధ హిందీని వ్యతిరేకించి, బీజేపీతో చేతులు కలిపిన తర్వాత నిర్బంధ హిందీకి మద్దతుగా మాట్లాడుతున్నారంటూ కనిమొళి ఆరోపించారు.

పవన్ బీజేపీ నేతలా మాట్లాడటం తగదు: సీపీఐ

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభలో ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం బీజేపీ స్క్రిప్ట్ చదివినట్లుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ‘త్రిభాషా విధానం అమలు చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. హిందీ భాషను బలవంతంగా అమలు చేయడాన్నే వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించకుండా పవన్ బీజేపీ నేతలా మాట్లాడటం తగదు’ అని రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. హిందీ రాష్ట్రాల్లో దక్షిణాది భాషను మూడో భాషగా అమలు చేస్తారా? అని ప్రశ్నించారు.

హోంగార్డుల వేతనాలను రూ. 25 వేలకు పెంచాలి

తెలంగాణలో మాదిరే ఏపీలో హోంగార్డుల వేతనాన్ని రూ.25 వేలకు పెంచాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. హోంగార్డుల కుటుంబ సభ్యులకూ ఆరోగ్య బీమా కల్పించాలని కోరుతూ హోం మంత్రికి లేఖ రాశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో తణుకులో పారిశుధ్య కార్మికుల గ్రూప్ ఫొటో



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తణుకు ఎన్టీఆర్ పార్కులో చెత్త ఎత్తుతున్న సీఎం చంద్రబాబు

అక్టోబరు నుంచి ఆకస్మిక తనిఖీలు

- చెప్పకుండానే క్షేత్రస్థాయికి వస్తా
- ఎమ్మెల్యేలు పరుగులు పెట్టాల్సిందే
- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే లక్ష్యం
- రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర ఉద్యమం కొనసాగాలి
- తణుకులో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

ఏలూరు/తణుకు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): 'నేను 1995లో సీఎంగా ఉన్నప్పుడు బయటకొస్తున్నానంటే అందరూ అలర్ట్ అయిపోయేవారు. అందరూ హుషారు అయిపోయేవారు. ఇప్పుడు మాత్రం ఇంకా సమయం ఇస్తున్నా. అక్టోబరు 2 తర్వాత ఏ ఊరు వస్తున్నానో చెప్పను. రెండు, మూడు గంటలు ముందు చెప్పి నేరుగా అక్కడికే వస్తా. ఆకస్మికంగా తనిఖీ చేస్తా." అని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చానని, ఎందుకు పరిశుభ్రం కాలేదో మీ ఎమ్మెల్యేని, కలెక్టరును నిలదీస్తానని అన్నారు. "మీకు సమయం ఇచ్చాను సమస్యలు పరిష్కరించండి. ఇంతకుముందు ఈ మాత్రం కూడా సమయం ఇచ్చే వాడిని కాదు. ఇప్పుడలా కాదు.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ అనే కాదు.. నేనేమి చూస్తానో అప్పుడే చెబుతా. ఆకస్మిక తనిఖీ చేస్తా. పాలనా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తా." అని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఎమ్మెల్యేలను పరుగులు పెట్టిస్తా. ఒక ఆశయం కోసం మనమంతా పనిచేయాలి. దాన్ని నెరవేర్చుకోవాలి. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికను రాష్ట్ర ప్రజలు ఆమోదించారు. ఆశీర్వదించారు. రాష్ట్రాభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నాం. కేంద్రం సహకారంతో రాష్ట్రం అభివృద్ధి బాట పట్టింది" అని పేర్కొన్నారు.

గత ముఖ్యమంత్రి వచ్చారా?

గత ముఖ్యమంత్రి ఎప్పుడైనా ఇలా ప్రజల మధ్యకు వచ్చారా? అని చంద్రబాబు స్థానికులను ప్రశ్నించారు. "గత సీఎం ఇలా వచ్చి మీటింగ్ పెట్టారా? ఎవరికైనా మైక్ ఇచ్చారా? పరదాలు కట్టుకుని వచ్చేవారు. విమానంలో వచ్చినా కింద చెట్లను నరికేసేవారు" అంటూ పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పరిపాలనలో మార్పులు తేవడానికే తాను ప్రజల మధ్యకు వస్తున్నట్టు చెప్పారు. "గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. 10 లక్షల కోట్ల అప్పుల భారం ప్రజలపై మోపారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతున్నాం. మీ కష్టాలు తీర్చేందుకు అభివృద్ధి, సంక్షేమం సమానంగా నడిపేందుకు ప్రయత్నిస్తున్నా. నాలుగోసారి సీఎంగా ఉన్న నాకే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూశాక వెసులుబాటు కనిపించడం లేదు. అయినప్పటికీ ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా" అని చంద్రబాబు తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

47 ఏళ్లుగా..

1978, మార్చి 15వ తేదీ.. 47 ఏళ్ల క్రితం ఇదే రోజు నేను మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టా. ఈ రాష్ట్రంలో ఎవ్వరికీ దక్కని అసాధారణ గౌరవం నాకు దక్కింది. తెలుగు ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం. పాలనలో సంస్కరణలు తెస్తున్నా. 2019లో గెలిపించే ఉంటే విభజిత రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళ్లేవాళ్లం. నా తప్పులు కూడా ఉన్నాయి. ప్రతిసారీ వైకుంఠపాళి అవుతుంది. గుజరాత్‌లో సుదీర్ఘ కాలంగా బీజేపీ ప్రభుత్వం ఉంది. అలా సుదీర్ఘ కాలం అవకాశం ఇస్తే స్థిర నిర్ణయాలకు అవకాశం ఉంటుంది. గత పాలకులు చెత్తపై పన్నువేశారు. మీ పట్టాదారు పాస్‌పుస్తకాల పైన వారి బొమ్మ వేశారు. రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యతను తీసుకుంటాం. ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి లక్షల ఎకరాల భూములు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రైవేట్ భూములు 22ఏ కింద పెట్టేశారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ ముసుగులో ఎదురుదాడి చేస్తున్నారు. గత ప్రభుత్వం ముక్కుతూ, మూలుగుతూ పింఛన్లు ఇచ్చింది. ఇప్పుడు ఏటా పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.33 వేల కోట్లు వెచ్చిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల పింఛనును రూ.4 వేలు చేశాం. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు రూ.10 వేలు, మంచం పట్టిన వారికి రూ.15 వేల చొప్పున పింఛను ఇస్తూ మానవత్వం చాటుతున్నాం.

అందరికీ 'తల్లికి వందనం'

ఎన్నికల్లో చెప్పిన విధంగా 'సూపర్ సిక్స్' హామీలు నెరవేరుస్తున్నాం. మే నెల నుంచి ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' అందిస్తాం. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తెచ్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్యతరగతి కుటుంబాలకు బీమా కల్పిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ.20 వేలు ఇచ్చే బాధ్యత తీసుకుంటున్నాం. గత ప్రభుత్వం ధాన్యం సేకరణ, సొమ్ము చెల్లింపుల్లో ఇష్టానుసారంగా వ్యవహరించింది. కోట్ల రూపాయలు బకాయిలు పెట్టింది. మా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాకు సొమ్ములు జమ చేస్తోంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా గుంతలే. మా ప్రభుత్వం 85 శాతం రోడ్లలో గుంతల్లేకుండా చేసింది.

మునిసిపల్ కార్మికులను ఆదుకుంటాం

నేను ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. ప్రతి ఒక్కరూ నెలలో ఒకరోజు దీనికి కేటాయించాల్సిందే. నెలకొకసారైనా మీలో చైతన్యం తేవడానికి ప్రయత్నిస్తున్నా. స్వచ్ఛాంధ్ర కోసం ఒక కోర్సును తయారు చేస్తాను. మునిసిపల్ కార్మికులను వేదికపై నా పక్కనే కూర్చోపెట్టుకున్నానంటే వారు మన ఆరోగ్యం కాపాడుతున్నారు. ఎవరు చేయని పని వారు చేస్తున్నారని అందరూ గుర్తుపెట్టుకోవాలి. మునిసిపల్ కార్మికులను ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. గత పాలకులు ఐదేళ్లలో కనీసం డ్రెయినేజీల్లో మురికి కూడా తీయలేదు. 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చారు. తణుకులో కూరగాయల మార్కెట్ చూశా. మిగిలిన కూరగాయలు అక్కడే ఉంచడంతో కుళ్లి పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. వేస్ట్‌ను కంపోస్టుగా మార్చే సాంకేతికత ఇప్పుడు వచ్చింది. రోజుకి ఒక టన్ను చెత్తతో కంపోస్టు తయారవుతుంది. మునిసిపాలిటీలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు వీలుగా పొల్యూషన్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, పురపాలకశాఖ మంత్రి నారాయణ ఒక అవగాహనకు వచ్చారు. దీనికి రూ.150 కోట్లు మంజూరు చేయబోతున్నాం.

ప్లాస్టిక్ పెనుభూతం

ప్లాస్టిక్ పెనుభూతం ప్రకృతిని నాశనం చేస్తుంది. ప్లాస్టిక్ కారకాలతో శ్వాసకోస వ్యాధులు, క్యాన్సర్లు వస్తున్నాయి. ఢిల్లీకి రోజూ పంజాబ్ నుంచి క్యాన్సర్ రోగులతో రైలు వస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. క్యాన్సర్ కారణంగా మా అత్తగారు(ఎన్టీఆర్ సతీమణి) బసవ తారకం చనిపోయారు. ఆమె పేరిటే బసవ తారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించారు. ఇప్పుడు వేలాది మంది క్యాన్సర్ రోగులకు ఆ సంస్థ వైద్యసేవలందిస్తోంది. క్యాన్సర్ నివారణకు సలహాలు ఇచ్చేందుకు ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించాం. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్(సింగిల్ యూజ్) వస్తువుల కారణంగా అనేక అనర్థాలు జరుగుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. రాష్ట్రంలో ఎక్కడా కాలుష్యకారకాలు లేకుండా, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళతాం.

స్వచ్ఛ భారత్ నివేదిక నాదే

'పచ్చదనం-పరిశుభ్రత' కార్యక్రమాన్ని దేశంలో మొట్టమొదటి సారిగా ఉమ్మడి రాష్ట్రంలో నేనే ప్రారంభించా. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు 'స్వచ్ఛ భారత్' నివేదిక ఇచ్చిందీ నేనే. స్వచ్ఛమైన ఏపీ నా ఆశయం.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర మా లక్ష్యం. రాష్ట్రంలో రోడ్ల మీద 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. దీనిలో ఇప్పటి వరకు 55 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగించాం. అక్టోబరు 2 నాటికి చెత్త అనేది ఎక్కడా కనిపించకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. 2027 నాటికి మురుగునీటిని 100 శాతం శుద్ధి చేసి వ్యవసాయానికి వాడతాం.

పోలీసుల అతి.. పట్టాభి అడ్డగింత

సీఎం పర్యటనలో పోలీసుల అతి ప్రవర్తన పార్టీ నాయకులకు చిరాకు తెప్పించింది. సీఎంకు స్వాగతం పలికే జాబితాలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు అనుమతి లేదంటూ తణుకు పాలిటెక్నిక్ కళాశాలలోని హెలిపాడ్ వద్ద పోలీసులు అడ్డగించారు. షాక్‌కు గురైన ఆయన వాహనం దిగి అనుమతి జాబితా పత్రాన్ని పరిశీలించారు. జాబితా తయారు చేసింది ఎవరంటూ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. కాసేపటికి ఆయనను హెలిప్యాడ్ వద్దకు అనుమతించారు. అలాగే తేతలి వై.జంక్షన్ వద్ద పట్టణంలోకి సాధారణ ప్రజలను అనుమతించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చీపురు పట్టిన చంద్రబాబు

తణుకులోని ఎన్టీఆర్ పార్కులో పారిశుధ్య కార్మికులతో సీఎం చంద్రబాబు ముచ్చటించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. మున్సిపల్ కార్మికుల దుస్తులు ధరించి పార్కులోని రోడ్లను కార్మికులతో కలిసి శుభ్రం చేసి, చెత్తను తొలగించారు. కార్మికులను శాలువాలతో సత్కరించారు. స్వచ్ఛాంధ్ర కోసం పారిశుధ్య కార్మికులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉమ్మడిగా కృషి చేయాలని సీఎం చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పార్కును రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మంత్రి నారాయణను ఆదేశించారు.

'స్వచ్ఛాంధ్ర'లో ఎన్టీఆర్ జిల్లా ఫస్ట్

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాల వారీగా ప్రగతిని ముఖ్యమంత్రి ర్యాంకుల రూపంలో ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా 134 పాయింట్లతో ముందు వరసలో నిలిచింది. అనకాపల్లి 131, తిరుపతి 128, విశాఖ 125, అనంతపురం 123, కాకినాడ 121, గుంటూరు 119, తూర్పుగోదావరి 118, పల్నాడు 117, అన్నమయ్య 115, అంబేడ్కర్ కోనసీమ 115, శ్రీకాకుళం 113, కడప 113, బాపట్ల 111, ఏలూరు 108, కర్నూల్ 104, నంద్యాల 102, సత్యసాయి 102, పార్వతీపురం 100, పొట్టి శ్రీరాములు 100, విజయనగరం 100, కృష్ణా 99, ప్రకాశం 99, పశ్చిమ గోదావరి 97, చిత్తూరు 91, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 68 పాయింట్లు వచ్చాయి.

టార్గెట్ 2029.. తమ్ముళ్లకు బాబు దిశా నిర్దేశం

"నిన్న కన్నా నేడు బాగా పనిచేయడానికి నేనెప్పుడూ సిద్ధపడతా. పార్టీలో మీరు ఇదే మాదిరి సిద్ధపడాలి. మీ లక్ష్యం 2029. పార్టీలో అందరూ క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాల్సిందే" అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. తణుకు నియోజకవర్గ టీడీపీ కేడర్, నాయకులతో శనివారం ఆయన భేటీ అయ్యారు. "తెలుగుదేశం కార్యకర్తకి ఏ ఎన్నిక అయినా ఒక పరీక్ష. జీవితాంతం మీకు పరీక్షలే. ఇది గుర్తు పెట్టుకుని మసలుకోవాల్సిందే. ఎక్కడకు వెళ్లినా కార్యకర్తల సమావేశం తప్పనిసరిగా పెడుతున్నా. వారి బాగోగులతోపాటు పార్టీ వ్యవహారాలపైనా మాట్లాడుకుంటున్నాం. ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ కార్యకర్తలతో మమేకం కావాలి. విషయాలపై చర్చించుకోవాలి. తదనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి అంటే అనుభవించడం కాదు. ప్రజలకు జవాబుదారీగా ఉండటం. పార్టీకి ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తే ఒకటి, రెండుసార్లు చూస్తా.. తర్వాత పనిష్మెంట్ గట్టిగా ఉంటుంది. ఈసారి మహానాడు కడపలో పెడుతున్నాం.ప్రతీ కార్యకర్తకు పార్టీపరంగా బీమా సౌకర్యం ఉంటుంది. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు లభించాలన్నదే నా ఆకాంక్ష." అని చంద్రబాబు చెప్పారు.

రూ.2 కోట్ల విలువైన పైపులు ఆహుతి

- శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో అగ్నిప్రమాదం
- వైసీపీ హయాంలో ఆగిన జల్‌జీవన్ మిషన్ పనులు
- బిల్లులు రాక.. కాంట్రాక్టు రద్దు చేసుకున్న సంస్థ
- అప్పట్లో కొన్న పైపులను నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు

మడకశిర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇంటింటికీ కొళాయి పథకం కోసం తెప్పించి, నిల్వ చేసిన పైపులకు మంటలు అంటుకోవడంతో రూ.2.04 కోట్ల మేర నష్టం వాటిల్లింది. యార్డు ఆవరణలో శుభ్రం చేసే క్రమంలో పిచ్చి మొక్కలకు సిబ్బంది నిప్పు పెట్టారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మంటలు ఎగసి పైపులు అంటుకున్నాయి. పావగడ, హిందూపురం నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోగా 80 శాతం పైపులు ఆహుతయ్యాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో సమీప కాలనీల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ట్రైనీ డీఎస్పీ పావని ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే చర్యలను పర్యవేక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మడకశిరలో గత వైసీపీ ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.34 కోట్లతో పనులు చేపట్టారు. జీపీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఈ కాంట్రాక్టు పనులను దక్కించుకుని ప్రారంభించింది. అయితే చేసిన పనులకు ఒప్పందం ప్రకారం బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టు సంస్థ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో వైసీపీ ప్రభుత్వం కొంత డబ్బు మంజూరు చేసింది. మిగిలిన పనుల కోసం కాంట్రాక్టు సంస్థ రూ.2.45 కోట్లతో పైప్‌లు కొనుగోలు చేసి, మార్కెట్ యార్డులో నిల్వ చేసింది. ఆ తర్వాత చేసిన పనులకూ వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆ సంస్థ 2023లో కాంట్రాక్టును రద్దు చేసుకుంది. ఈ మేరకు జిల్లా అధికారులకు లేఖ రాసింది. ఆ సమయంలో జిల్లా అధికారులు మిగిలిన మెటీరియల్‌ను పరిశీలించి, స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. కానీ నిర్లక్ష్యంగా వదిలేశారు.



భారీగా ఎగసిపడుతున్న మంటల్లో కాలిపోతున్న పైపులు



పారిశుధ్య కార్మికులతో కలిసి టీ తాగుతూ మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం పెరగాలి

- అవగాహన కోసం మంగళగిరిలో ఇంటింటి ప్రచారం
- స్వచ్ఛతలో ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో మంత్రి లోకేశ్
- పార్కులో స్వయంగా చెత్తను ఊడ్చి, ఎత్తిన మంత్రి

మంగళగిరి/నంద్యాల నూనెపల్లె/అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల్లో మరింత చైతన్యాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విదేశాల్లో ఎవరూ చెత్తను ఇష్టమొచ్చినట్లు బయట వేయరని చెప్పారు. పారిశుధ్యంపై అవగాహన కోసం మంగళగిరి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని ఎకో పార్కులో శనివారం మంత్రి స్వయంగా చెత్తను ఊడ్చి ఎత్తి చెత్తకుండీలో వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛతలో మంగళగిరిని ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రజారోగ్యానికి మధ్య అవినాభావ సంబంధం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వ్యాధులను నివారించే వీలవుతుందని చెప్పారు. మంగళగిరిలో త్వరలోనే భూగర్భ డ్రైనేజీ, అండర్ వాటర్, గ్యాస్, పవర్ లైన్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను చేపడతామన్నారు. అలాగే మంగళగిరి ప్రాంతంలోని చెరువులను రూ. 3 కోట్లతో ఆధునీకరిస్తామని లోకేశ్ తెలిపారు. ప్రజలంతా నిద్రకు ఉపక్రమించిన తరువాత పారిశుధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రంగా మార్చే కఠినతరమైన పనులను చాలా ఇష్టంగా చేస్తున్నారంటూ వారందరినీ ఈ సందర్భంగా ప్రశంసించారు. పారిశుధ్య నిర్వహణలో మంగళగిరిని నం.1 చేస్తామన్నారు.

పారిశుధ్య కార్మికుడితో లోకేశ్ ఇష్టాగోష్ఠి

స్థానిక పారిశుధ్య కార్మికుడు ఎం.నాగార్జునతో కలిసి మంత్రి లోకేశ్ ఎకో పార్కులో చెత్తను ఊడ్చి శుభ్రం



మంగళగిరిలోని ఎకో పార్కులో రోడ్డు ఊడ్చి చెత్తను ఎత్తుతున్న మంత్రి లోకేశ్

చేశారు. ఈ సందర్భంగా అతడితో కాసేపు ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఏ ఊరు? ఎక్కడెక్కడ పనిచేస్తున్నారంటూ మంత్రి ప్రశ్నించగా.. తాను మంగళగిరి 16వ వార్డులో నివాసం ఉంటున్నానని, గత 15 ఏళ్లుగా మంగళగిరిలోనే పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నానని చెప్పారు. తన ఇద్దరు పిల్లలు ప్రభుత్వ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారని వివరించారు. ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన బాగుందన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం ఇంకా బాగుందని నాగార్జున మంత్రికి వివరించారు. పారిశుధ్య పనుల నిర్వహణలో ఏవైనా సమస్యలున్నాయా అంటూ మంత్రి లోకేశ్ అడుగగా.. చేతికి వేసుకునే గ్లవ్స్ మరింత మందంగా ఉండాలని నాగార్జున సూచించారు. ఈ ముఖాముఖి అనంతరం పారిశుధ్య కార్మికుడు నాగార్జునను మంత్రి లోకేశ్ ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎకోపార్కులో వాకింగ్ చేసే నేచర్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేశ్‌ను కలిశారు. వాకర్స్ కోసం లోకేశ్ తన సొంత నిధులు రూ. 5 లక్షలు వెచ్చించి ఉచిత ప్రవేశాన్ని కల్పించినందుకుగాను కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసి కమిషనరు షేక్ అలీం బాషా, అదనపు కమిషనరు ఎం.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఏపీకి కృషి: సీఎస్ విజయానంద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో పెద్దచెరువు కట్టపై 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమానికి సీఎస్ విజయానంద్, జిల్లా స్పెషల్ అధికారి నివాస్ హాజరయ్యారు. మొక్కలు నాటి, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. నంద్యాలలోని ఈద్గా మైదానం వద్ద రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రితో కలసి సీఎస్ విజయానంద్ మొక్కలు నాటారు. పర్యావరణం, పచ్చదనం, పరిశుభ్రతకు ఊతమిచ్చేలా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రను పెద్దఎత్తున నిర్వహించారు. రాష్ట్ర పీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆ సంస్థ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల్లోనూ స్వచ్ఛ కార్యక్రమాలు జరిగాయి. తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యాలయంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులను సంస్థ ఎండీ కూర్మనాథ్, సిబ్బంది తొలగించారు.

15 ఏళ్లు సీఎంగా.. 47 ఏళ్లు ఎమ్మెల్యేగా

- ఆ ఘనత చంద్రబాబుదే!
- అభివృద్ధి.. సంక్షేమానికి ఆయనే చిరునామా
- బీటీ నాయుడు, అశోక్‌బాబు, టీడీపీ నేతలు వర్ల రామయ్య, మాల్యాద్రి వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమానికి చిరునామా సీఎం చంద్రబాబు అని, ప్రజానాయకుడిగా ప్రజల మనసులను గెలవగలిగారు కాబట్టే 47 ఏళ్ల సుదీర్ఘకాలం ఆయన రాజకీయాల్లో కొనసాగారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి శనివారం(మార్చి 15)తో 47 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బీటీ నాయుడు, అశోక్‌బాబు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, పార్టీ అధికార ప్రతినిధి పాతర్ల రమేశ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 47 ఏళ్ల క్రితం 1978 మార్చి 15న ఎమ్మెల్యేగా తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారని, అప్పటి నుంచి రాజకీయాల్లో మచ్చలేని నేతగా కొనసాగుతున్నారని వర్ల రామయ్య అన్నారు. ప్రజ మనసులో ప్రత్యేక స్థానం దక్కించుకోవడం వల్లే ఇనేళ్లుగా ఆయన రాజకీయాల్లో మనగలుగుతున్నారని తెలిపారు. "చంద్రబాబు ఓ విజనరీ. రాష్ట్ర యువత భవిత కోసం అమెరికా వీధుల్లో తిరిగి హైదరాబాద్‌కు సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చేలా చేశారు. దాని ఫలితమే నేడు సైబరాబాద్‌లో 30 లక్షల మందికిపైగా యువత ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం ఎస్సీ, బీసీ, మైనారిటీ, రైతు బిడ్డలే" అని అన్నారు. బీటీ నాయుడు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి ఏకంగా 47 ఏళ్లు రాజకీయాల్లో మనగలగడం ప్రపంచ రికార్డుగా పేర్కొన్నారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది అభివృద్ధి మాత్రమేనని, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా రాజధాని అమరావతి కోసం రైతుల నుంచి వేలాది ఎకరాలు సేకరించడం చంద్రబాబుకే సాధ్యమైందని కొనియాడారు. సామాజిక న్యాయానికి చంద్రబాబు 'ఐకాన్' అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ.. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, దానికి నిదర్శనమే విద్యుత్తు సంస్కరణలని పేర్కొన్నారు. నేడు దేశమంతా విద్యుత్తు సంస్కరణ మంత్రాన్ని జపిస్తోందన్నారు. 5 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నుంచి 20 వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే స్థాయికి వచ్చామంటే అది చంద్రబాబు ఘనతేనని తెలిపారు. గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ.. ఇంత వరకు రాష్ట్రంలో 18 మంది ముఖ్యమంత్రులుగా పనిచేస్తే 15 ఏళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఒక్క చంద్రబాబేనని తెలిపారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం వల్లే ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు చేసిన మంచి ఏమిటో ఆయన జైలుకు వెళ్లిన సమయంలో ప్రజలు ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. అదే జగన్‌ని అరెస్టు చేసి 16 నెలలు జైల్లో పెడితే ఒక్కరు కూడా నిరసన తెలిపిన దాఖలాల్లేవన్నారు. పాతర్ల రమేశ్ మాట్లాడుతూ.. జగన్ పాలన అరాచకానికి కేరాఫ్ అయితే చంద్రబాబు పాలన అభివృద్ధికి చిరునామా అని పేర్కొన్నారు.





కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

- అమరావతిలో వైభవోపేతంగా శ్రీవారి కల్యాణోత్సవం
- కనులారా వీక్షించి పులకించిన వేలాది మంది భక్తజనం

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి కల్యాణ మహోత్సవం అమరావతి రాజధానిలో కనులపండువగా జరిగింది. రాజధాని పరిధి వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో తొలిసారిగా శ్రీనివాసుడి కల్యాణాన్ని శనివారం సాయంత్రం టీటీడీ వైభవోపేతంగా నిర్వహించింది. విద్యుత్ కాంతుల ధగధగలతో వెలుగులీనుతున్న ప్రాంగణంలో కల్యాణ మహోత్సవాన్ని చూస్తూ భక్తజన సందోహం పులకరించిపోయింది. అన్నమయ్య సంకీర్తనలు, వేద మంత్రోచ్చరణలతో రాజధాని ఆధ్యాత్మిక నగరిని తలపించింది. కల్యాణ మహోత్సవానికి సీఎం చంద్రబాబు సంప్రదాయబద్ధంగా పట్టు పంచె ధరించి సతీ సమేతంగా హాజరయ్యారు. అధికారులు ప్రకటించిన షెడ్యూల్ కంటే 17నిమిషాలు ముందుగానే, సాయంత్రం 5:43 గంటలకే వెంకటపాలెంలోని ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మంత్రులు, టీటీడీ సిబ్బందితో కలిసి సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబు, గవర్నర్ తిరునామధారణ చేయించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ ముఖ్యమంత్రి దంపతులు ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు పట్టువస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. పెద్ద జీయర్ స్వామి, చిన జీయర్ స్వామి, అహోబిల మఠాధిపతి రామానుజ జీయర్ స్వామి, శివస్వామి తదితరులు హాజరయ్యారు. పెద్ద జీయర్ స్వామి ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు.

శోభాయమానంగా వేదిక

శ్రీవారి కల్యాణ వేదిక విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా విరాజిల్లింది. ఆలయ ప్రాంగణం చుట్టూ ఏర్పాటుచేసిన దేవతామూర్తుల విద్యుత్ దీపాల కటౌట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎస్వీబీసీ ప్రసారాలు, ఆలయంలో జరిగే కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలను భక్తులు తిలకించేందుకు వీలుగా 18 పెద్ద ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30వేల కట్ ఫ్లవర్స్, వివిధ రకాల ఫలాలతో చేసిన అలంకరణలు చూసి వచ్చినవారంతా ముగ్ధులయ్యారు. చెన్నైకి చెందిన నిత్యశ్రీ మహదేవన్, ప్రియా సోదరిమణులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలతో భక్తులు తన్మయత్వం చెందారు. గ్యాలరీల్లో వేచి ఉన్న వేలాది మంది భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు అందించారు. అదేవిధంగా శ్రీవారి లడ్డు, పసుపు, కుంకుమ ప్యాకెట్, పసుపు దారం, కంకణాలు, శ్రీవారి పుస్తకం, ప్రసాదం, కల్యాణోత్సవం అక్షింతలు కలిపి ఉన్న బ్యాగ్‌లను దాదాపు 1,500 మంది శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకువచ్చిన 50 వేల చిన్న లడ్డూలను భక్తులకు అందించారు. టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో అమరావతి అక్షయ ఫౌండేషన్ సంస్థ 40వేల పులిహోర ప్యాకెట్లు, 40వేల పెరుగన్నం, 40వేల రవ్వకేసరి, 40వేల స్వీటు ప్యాకెట్లను పంపిణీ చేసింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు



కల్యాణోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

అంతులేని ‘కిక్కు’ లెక్క!

(మొదటి పేజీ తరువాయి)

సీజ్ చేసిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్కుల వరకూ అన్నింటినీ ల్యాబ్‌కు పంపి నివేదిక తెప్పించుకున్న ‘సిట్’ అనేక సంచలన అంశాలను గుర్తించింది. మరీ ముఖ్యంగా... ఈ స్కామ్‌లో కీలకమైన ‘స్క్రిప్ట్’ కూడా దొరికిపోయింది. మద్యం కుంభకోణంలో వైసీపీ పెద్దలు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక స్థానంలో ఉన్న అధికారులతో మొదలుకుని డేటా ఎంట్రీ ఆపరేటర్ వరకు తమ తమ పాత్రలు పోషించారు. వీరిలో ఐదుగురు విజయవాడ కోర్టులో న్యాయమూర్తి ముందు ఇచ్చిన వాంగ్మూలాలు కీలకంగా మారాయి. వారే... ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి, మద్యం కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్, ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగి, రైల్వే నుంచి వైసీపీ హయాంలో వచ్చి ఎన్నికల తర్వాత తిరిగి వెళ్లిన రమేశ్‌కుమార్ రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ అనూష! వీరిలో సత్యప్రసాద్ న్యాయమూర్తి ఎదుట సుమారు 3 గంటల పాటు సుదీర్ఘంగా వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. స్కామ్ జరిగిన తీరును పూసగుచ్చినట్లు వివరించారని సమాచారం. మద్యం కుంభకోణంలో ప్రభుత్వ ఖజానాకు దాదాపు 18 వేలకోట్ల నష్టం జరిగినట్టు దర్యాప్తులో తేలినట్టు తెలుస్తోంది.

ఆ ముగ్గురూ కీలకం

బేవరేజెస్ కార్పొరేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసిన అనూష పేరు కొత్తగా వెలుగులోకి వచ్చింది. సిట్ దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా ఆమెను విచారించిన అధికారులు ఇటీవల కోర్టులో వాంగ్మూలం రికార్డు చేయించారు. ఎంత పెద్ద భవనం తలుపులు తెరవాలన్నా... చిన్న తాళంచెవి కావాల్సిందే! అలాంటి ‘కీ’... ఈ డేటా ఎంట్రీ ఆపరేటర్! కీలకమైన ఈ-మెయిల్స్‌ను ఆమే నిర్వహించేవారని... సేల్స్ సమాచారం రాజ్ కసిరెడ్డి కార్యాలయానికి ఆమె ద్వారానే చేరేదని వెల్లడైంది. నిబంధనల ప్రకారం మద్యం షాపుల్లో పనిచేసే సూపర్ వైజర్లు ఏ రకమైన లిక్కర్ కావాలో ఇండెంట్ పెడతారు. అయితే సూపర్ వైజర్ల ద్వారా గాక నేరుగా మద్యం డిపోల మేనేజర్లతో ఇండెంట్ పెట్టించారు. ఏ రకమైన బ్రాండ్లకు ఇండెంట్లు పెట్టాలో బేవరేజెస్ కార్పొరేషన్‌లో పనిచేసిన రమేశ్‌కుమార్ రెడ్డి సూచనలు ఇచ్చేవారు. రోజువారీ మద్యం అమ్మకాల వివరాలను అనూష హైదరాబాద్‌లోని రాజ్ కసిరెడ్డి సొంత మనిషి సైఫ్‌కు చేరవేసేవారు. వాటి ఆధారంగా మద్యం కంపెనీల నుంచి కసిరెడ్డి కమీషన్లు వసూలు చేసేవారు. ఆర్నెల్ల క్రితం పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఆమెను ఏరికోరి ఆ పోస్టులో నియమించారనే విషయం కూడా బయట పడింది.

ఇదీ... స్కామ్ రూటు!

జగన్ వచ్చీ రాగానే మద్యం పాలసీ మార్చేశారు. ప్రైవేటు దుకాణాల స్థానంలో ‘ప్రభుత్వ’ దుకాణాలు తెరిచారు. మొత్తం స్కామ్‌కు అదే మూలం. సాధారణంగా... షాప్ సూపర్‌వైజర్ తమకు కావాల్సిన సరుకు ఏది, ఎంత అన్నది ఆన్‌లైన్‌లో డిపో మేనేజర్‌ను అడగాలి! కానీ... ఇక్కడ సూపర్‌వైజర్ పాత్రను ‘సేల్స్’కు మాత్రమే పరిమితం చేశారు. ‘ఇండెంట్ పెట్టడం’ అనే దశను పూర్తిగా ఎత్తేశారు. తమ సొంత బ్రాండ్లు, తమకు కమీషన్ ఇచ్చేందుకు అంగీకరించిన బ్రాండ్లను మాత్రమే దుకాణాలకు పంపించేవారు. ‘ఈ రోజు ఫలానా సరుకు అమ్మాలి’ అంటూ ఎప్పటికప్పుడు జాబితా పంపించేవారు. దాని ప్రకారమే సేల్స్ నడిచేవి. వినియోగదారులు ఇతర బ్రాండ్లు అడిగితే ‘అవి లేవు. ఉన్నవి ఇవే’ అని తమ సరుకును మాత్రమే అంటగట్టేవారు. ‘మా బ్రాండ్లు ఎందుకు అమ్మడం లేదు’ అని ప్రముఖ కంపెనీలు పైస్థాయిలో ప్రశ్నిస్తే.. ‘మీ సరుకు ఎవరూ అడగడం లేదు’ అని చెప్పేవాళ్లు. ఇలా... సొంత బ్రాండ్లను మాత్రమే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ బ్రాండ్ మద్యం ఎంత అమ్ముడయిందనే వివరాలు డేటా ఎంట్రీ ఆపరేటర్ అనూష ద్వారా రాజ్ కసిరెడ్డి కార్యాలయానికి చేరేవి. దాని ఆధారంగా... ఎవరి నుంచి ఎంత కమీషన్ వసూలు చేయాలో లెక్కలు సిద్ధం చేసేవాళ్లు. ప్రభుత్వం నుంచి పేమెంట్ జరగ్గానే... కంపెనీలు కమీషన్‌ను చెల్లించేవి. ‘ఫలానా రోజు, ఫలానా చోటికి రండి. అక్కడ మిమ్మల్ని కలిసే వ్యక్తికి కమీషన్ ఇచ్చివెళ్లండి’ అని చెప్పగానే... అత్యంత నాటకీయంగా కమీషన్ల చెల్లింపులు జరిగేవి. దీనిపై గతంలోనే ‘ఆంధ్రజ్యోతి’ సవిరంగా కథనం ప్రచురించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం విక్రయించాలనే పాలసీ తెచ్చిందే ఈ స్కామ్ కోసం. అదే ప్రైవేటు మద్యం దుకాణాలు ఉంటే ఇది జరగదు. దుకాణదారు తమకు ఏ సరుకు కావాలో ఇండెంట్ పెడతాడు. డబ్బులు కడతాడు. సరుకు తెచ్చుకుని... అమ్ముకుంటాడు. ఇక్కడ కమీషన్ ప్రస్తావనే లేదు. ‘జగన్ పాలసీ’లో జరిగింది దీనికి పూర్తిగా భిన్నం. అసలు ధర వెయ్యి రూపాయలైతే... వీళ్ల నిర్ణయించిన ధర రూ.1200. తమకు కావాల్సిన సరుకును విక్రయించడం... ఆ తర్వాత ఆ కంపెనీలకు బిల్లులు చెల్లించడం... అదనంగా నిర్ణయించిన ధరను కమీషన్ రూపంలో పుచ్చుకోవడం!

ఐటీ సలహాదారు.. మద్యం కలెక్షన్లు!

రాష్ట్రచరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో సలహాదారులను నియమించుకున్న జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా వైసీపీ పెద్దలకు అత్యంత సన్నిహితుడైన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డిని పెట్టుకున్నారు. రాజ్ కసిరెడ్డి సలహాలతో రాష్ట్ర ఐటీ రంగం ఏ మేరకు అభివృద్ధి చెందిందో కానీ మద్యం కమీషన్ల వసూళ్లలో మాత్రం ఆయన పాత్ర కీలకం. మద్యం కుంభకోణంలో ఆయన పాత్ర ఉన్నట్లు సీఐడీ నమోదు చేసిన కేసులోనే ప్రాథమిక ఆధారాలు సేకరించారు. అయితే దర్యాప్తులో జాప్యం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఐజీ ర్యాంకు అధికారి రాజశేఖర్ బాబు నేతృత్వంలో ఏడుగురితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందం ఆధారాలు సేకరిస్తున్న తరుణంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఇటీవల విజయవాడలో సీఐడీ విచారణకు వచ్చినప్పుడు.. మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం అన్ని విషయాలు చెప్పలేనని, త్వరలో అన్నీ చెబుతానని అన్నారు. దీంతో మరోసారి రాజ్ కసిరెడ్డి పాత్ర చర్చనీయాంశంగా మారింది. సిట్ అధికారులకు ఓ స్పష్టత వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మద్యం డిస్టిలరీస్ నుంచి ఆర్గనైజర్లు వసూలు చేసిన మొత్తాన్ని రాజ్ కసిరెడ్డి ద్వారా పార్టీలో కీలకనేతకు, అక్కడి నుంచి బిగ్‌బాస్‌కు చేరేదని చైన్ లింక్‌లో కీలక ఆధారాలు లభించినట్లు తెలిసింది.

కసిరెడ్డిపై ఫిర్యాదు

లీలా మద్యం కంపెనీ యాజమాన్యాన్ని రాజ్ కసిరెడ్డి బెదిరించి ఆ కంపెనీని లాక్కున్నట్లు సీఐడీకి ఫిర్యాదు అందింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదట్లో లీలా కంపెనీ అనుకూలంగానే ఉంది. ఎస్ఎన్‌జే ఉద్యోగి ఒకరు లీలాలో డైరెక్టర్‌గా చేరారు. కొంతకాలానికి బెదిరించి మొత్తం లాగేసుకుని, ఆ బ్రాండ్లు కూడా వైసీపీ పెద్దలు విక్రయించుకున్నట్లు ఫిర్యాదులో యజమాని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపైనా దర్యాప్తు అధికారులు కూపీ లాగుతున్నారు.

18 వేలకోట్ల నష్టం

దశలవారీగా మద్య నిషేధం అమలు చేస్తామని 2019 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. ప్రభుత్వ దుకాణాలు పెట్టించి ఊరూపేరూ లేని బ్రాండ్లను అధిక ధరలకు అమ్మించారు. ఇప్పటి వరకూ సీఐడీ, సిట్ సేకరించిన ఆధారాల్లో విస్తుపోయే అంశాలు ఉన్నట్టు తెలుస్తోంది. గత ఐదేళ్లలో ‘మద్యం’లో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.18,000 కోట్ల వరకూ నష్టం వాటిలినట్టు దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో దిగువ, మధ్య స్థాయి వైసీపీ నేతలు, అధికారులకు 4 వేల కోట్ల కమీషన్లు వెళ్లగా... డిస్టిలరీలకు మరో 4 వేల కోట్లు దాకా వాటా ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన 10 వేల కోట్లు ఎక్కడికి వెళ్లిందన్నది పెద్ద పజిల్! ఈ డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది. కూలీలు, నిరుపేదలు తాగే చీప్ లిక్కర్ నుంచి కూడా వేల కోట్ల రూపాయలు కమీషన్ల రూపంలో దండుకున్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లోని గదులను నోట్ల మూటలతో నింపినట్లు తెలుస్తోంది. అందుకు ఒక పార్లమెంటు సభ్యుడితో పాటు మాజీ ఎంపీ కూడా క్రియాశీలంగా వ్యవహరించినట్లు ఆధారాలు బయట పడుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌ను మించి దోపిడీ జరిగినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. నిందితుల బంధువుల పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది. విచారణలో భాగంగా తర్వాతి అడుగు తాడేపల్లి ప్యాలెస్‌లో వేసేందుకు ప్రభుత్వం సిగ్నలిస్తే సంచలనాలు వెలుగు చూసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఢిల్లీ మద్యం స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళ్లినట్టు... ఇక్కడ మాజీ సీఎం జైలుపాలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఐఏఎస్‌కూ వాటా

మద్యం కుంభకోణంలో ఎవరి వాటా ఎంత అన్నది సిట్ అధికారుల విచారణలో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ వెల్లడించినట్లు తెలిసింది. వారిద్దరూ ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకున్న అధికారులు మరింత లోతుగా కూపీ లాగగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి భారీగా లబ్ధి పొందినట్లు అంచనాకు వచ్చారు. మద్యంబాటిళ్ల విక్రయించిన తర్వాత మిగిలే ఖాళీ అట్టపెట్టెల ద్వారా వచ్చిన సొమ్ములోనూ వాటా అడిగేవారని సమాచారం. ‘సీఐడీలో 1.19కోట్లు దుర్వినియోగం చేశారని ఒక ఐపీఎస్‌పై కేసు నమోదైంది. మద్యం కుంభకోణంలో సీనియర్ ఐఏఎస్ ఇంతకు వంద రెట్లు ఎక్కువగా తీసుకుని రిటైరై వెళ్లిపోయారు’ అంటూ ఉన్నతస్థాయి పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఖాళీసీసాలు, మూతలు, వాటిపై లేబుళ్ల సైతం వదలకుండా ప్రతి దాంట్లోనూ కమీషన్లు కొట్టేసిన బాగోతం వెలుగులోకి వస్తోంది.

ఇంతలో ఎంత వైవిధ్యం!

- నాడు విధ్వంసం... నేడు లోక కల్యాణం..
- రెండింటికీ వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణమే వేదిక
- ఇక్కడే సెంటు పట్టాల పేరుతో రాజధాని రైతుల గుండెల్లో చిచ్చు
- రైతులు, మహిళల ఆక్రందనలు, ఆక్రోశాలతో మార్మోగిన ప్రాంతం
- నేడు వేద మంత్రోచ్చరణలు, అన్నమయ్య సంకీర్తనలతో పునీతం
- రాజధాని రైతులకు, మహిళలకు కల్యాణోత్సవంలో అగ్రతాంబూలం
- వేదికకు సమీపంలో వారికోసం ప్రత్యేకంగా గ్యాలరీలు కేటాయింపు

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇంతలో ఎంత వైవిధ్యం! సరిగ్గా రెండేళ్లలో అంతా మారిపోయింది. నాడు విధ్వంసానికి సాక్షిగా నిలిచిన స్వామివారి సన్నిధి.. నేడు లోక కల్యాణానికి వేదికగా మారింది. అమరావతి రాజధానిని ధ్వంసం చేయడానికి గత జగన్ ప్రభుత్వం వెంకటపాలెం శ్రీనివాసుడి సన్నిధినే సాక్షిగా మార్చుకోగా.. నేడు కూటమి ప్రభుత్వం లోక కల్యాణం కోసం చేసే శ్రీవారి కల్యాణానికి అదే ప్రాంతాన్ని వేదికగా మార్చి కొత్త భాష్యాన్ని ఇచ్చింది. యాదృచ్ఛికమా.. పాలకుల సంకల్పమా.. ఆ స్వామివారి చిత్తమా... ఏదేమైనా రాజధాని అమరావతిలోని ఆ శ్రీనివాసుడి సన్నిధి రెండు భిన్న ఘటనలకు వేదికగా మారింది. రెండేళ్ల కిత్రం అప్పటి వైసీపీ ప్రభుత్వం రాజధాని రైతుల గుండెలపై వెలిగించిన ఆరని కుంపటి ఆర్-5 జోన్ చిచ్చును ఇక్కడే రాజేసింది. రాజధానిలో పేదలకు సెంటు పట్టాల పేరుతో మొదలుపెట్టిన చిచ్చుకు అప్పటి ప్రభుత్వం శ్రీవారి సన్నిధినే వేదికగా ఎంచుకుంది. 2023 మే 25న ఆ తతంగాన్ని నిర్వహించింది. వేలాది మందిని ఇక్కడికి తరలించి, రాజధాని రైతులపై యుద్ధం ప్రకటించారా అనే స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించి రైతులపై బల ప్రదర్శనకు దిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా లెక్కచేయకుండా తన పంతం నెగ్గించుకుంది. ఆర్-5 జోన్‌లో ప్లాట్లను కేటాయిస్తూ లబ్ధిదారులకు పట్టాలిచ్చింది. ఆ రోజున రాజధాని గ్రామాలన్నీ గుండెలు పగిలేలా ఆక్రోశించాయి. మా సమాధులపై ఇవ్వండి సెంటు పట్టాలంటూ రోదించాయి. అవేవీ పట్టని పాలకుడు దర్జాగా హెలికాప్టర్లో వచ్చి ఒకరిద్దరికి సెంటు పట్టాలిచ్చి వెళ్లిపోయాడు.. సరిగ్గా 22 నెలలు గడిచేసరికి మొత్తం పరిస్థితి మారిపోయింది. నాటి విధ్వంసానికి మౌనసాక్షిగా నిలిచిన శ్రీవారు.. నేడు తన కల్యాణంతో లోక కల్యాణానికి శ్రీకారం చుట్టారు. శనివారం వెంకటపాలెంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీవారి కల్యాణోత్సవాన్ని తిలకించి, భక్తి పారవశ్యంలో ఓలలాడారు. అమరావతి చిరకాలం వర్ధిల్లాలని వేద పండితులు ఆశీర్వదించారు. రాజధాని రైతులకు, ప్రత్యేకించి రాజధాని మహిళలకు కల్యాణోత్సవంలో అగ్రతాంబూలం ఇచ్చి ప్రభుత్వం గౌరవించింది. వేదికకు సమీపంలో వారికోసం ప్రత్యేకంగా గ్యాలరీలు కేటాయించి, వేడుకల్లో భాగస్వాములను చేసింది.

ఏర్పాట్లలోనూ వైరుధ్యం

సెంటు పట్టాల పంపిణీ కార్యక్రమానికి వేలాది మందిని బలవంతంగా తరలించిన గత వైసీపీ ప్రభుత్వం సభా ప్రాంగణంలోకి కొంతమందినే అనుమతించింది. మిగిలినవారిని వారి ఖర్మానికి వదిలేసింది. మండు వేసవి ఎండల్లో తినడానికి తిండి లేక, కనీసం తాగడానికి నీళ్లు కూడా లేక మహిళలు, పేదలు అల్లాడిపోయారు. అప్పటి ముఖ్యమంత్రి మాత్రం 8 కి.మీ దూరానికే హెలికాప్టర్లో ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. కాగా ఇప్పుడు పకడ్బందీ ఏర్పాట్లతో ఏ ఒక్క భక్తుడికీ చిన్న ఇబ్బంది కూడా రాకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, శ్రీవారి ప్రసాదం అందించి క్రమశిక్షణతో సేవలు అందించారు.

కన్నతండ్రే ప్రొఫెషనల్ కిల్లర్‌లా..!

- పిల్లలకు భవిష్యత్తు లేదనే చంపేశాడా?!
- అధిక ఫీజులతో మొదలైన ఆత్మనూన్యతా భావమా?!
- చంపేసిన తీరుపై ఎన్నెన్నో సందేహాలు
- కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు పిల్లలు, తండ్రి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

సర్పవరం జంక్షన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని ఇద్దరు బిడ్డలనూ కన్నతండ్రే.. ఒక ప్రొఫెషనల్ కిల్లర్‌లా.. అతి పాశవికంగా చంపేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఇప్పుడు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరు చిన్నారులతో పాటు, తండ్రి చంద్రకిశోర్ మృతదేహాలకు వైద్యులు శనివారం పోస్ట్‌మార్టం చేశారు. ఈ సందర్భంగా మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

విద్యావంతుడు.. ఆపై కేంద్ర ఉద్యోగి..

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన వానపల్లి చంద్రకిశోర్ (37) ఎంకామ్, ఎంబీఏ చేశారు. వాకలపూడిలోని ఓఎన్‌జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తూ.. కాకినాడ తోట సుబ్బారావునగర్ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఆయనకు భార్య తనూజా, జోషిల్(6), నిఖిల్(5) ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడ్ని కాకినాడలోని ప్రముఖ స్కూల్‌లో ఎల్‌కేజీలో చేర్పించగా యూకేజీ వరకు అందులోనే ఉంచారు. ఫీజు లక్షల్లో ఉండడంతో గతేడాది ఏడాదికి రూ.50 వేల ఫీజు(ఒక్కొక్కరికి) ఉండే స్కూల్లోకి ఇద్దరినీ మార్పించారు. అయితే, పెద్దస్కూల్ నుంచి చిన్నస్కూల్‌లోకి మార్చేశాను.. భవిష్యత్తులో లక్షలు కట్టి పిల్లల్ని చదివించగలనా? స్థాయి తగ్గించేశానా? అనే ఆత్మనూన్యతా భావన చంద్రకిశోర్‌కు మొదలైందని.. ఆయన బంధువులు, ఆయన రాసిన సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది.

మరణాలపై వీడని సందేహాలెన్నో!

చంద్రకిశోర్ పిల్లలిద్దరి కాళ్లకూ తాళ్లు కట్టి, చేతులను వెనక్కి విరిచి కట్టి, నీరు నింపిన బకెట్లలో తలలు ముంచి.. ఊపిరాడకుండా చేసి చంపి.. ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని చూస్తే ఎవరికైనా గుండె తరుక్కోకపోదు. ఫీజులు కట్టలేకపోవడం, సరిగా చదవకపోవడం, స్థాయి తగ్గించడం వంటి చిన్న కారణానికే ముక్కుపచ్చలారని పిల్లల్ని పొట్టన పెట్టుకునే కర్కశ మనస్తత్వం తండ్రికి లేదని బంధువులు పేర్కొంటున్నారు. ఏ చిన్న విషయాన్నైనా భార్యతో పంచుకునే వ్యక్తి.. ఇలా ఎలా చేశాడో అర్థం కావడంలేదని కన్నీరమున్నీరవుతున్నారు. మరోవైపు ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నప్పటికీ.. అపార్టుమెంట్లో ఇద్దరు పిల్లల్ని, ఒకేసారి.. ఒక్క వ్యక్తి ఎలా కాళ్లూచేతులకూ తాళ్లు కట్టగలిగాడు?, కళ్లకు గంతలు కట్టి వారిని ఎలా బాత్‌రూమ్ వరకు తీసుకెళ్లి చంపగలిగాడు? పిల్లల్ని బకెట్లలోని నీట్లో ముంచేసే సమయంలో పెద్దగా ఏడుస్తూ అరిచి ఉంటారని, అయినా అంత కర్కశంగా ఎలా చేయగలిగాడనే దానిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



తండ్రి చంద్రకిశోర్ చేతిలో హత్యకు గురైన కుమారులు వానపల్లి జోషిల్, నిఖిల్(ఫైల్)

ఆత్మన్యూనత తగదు..

క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కరెక్ట్ కాదు. ఇతరుల పిల్లలు బాగా చదువుతున్నారు.. మా పిల్లలు చదవడం లేదు.. ఏదో మిస్ అయిపోతున్నామనే ఆత్మన్యూనతా భావానికి లోనై విచక్షణ కోల్పోతున్నారు. దీన్నే ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ అనే భావన) అంటారు. దీంతో క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుని విలువైన జీవితం తీసుకోవడమే కాదు, ఇతరుల జీవితాలను పణంగా పెడుతున్నారు. ఇదొక మానసిక రుగ్మత, జ్వరం వస్తే డాక్టర్ల వద్దకు ఎలా వెళ్తామో.. ఇలాంటి వారిని సైకాలజిస్టుల వద్దకు తీసుకెళ్తే ఫలితముంటుంది.

-ఏపీజే వినూ, ప్రముఖ సైకాలజిస్ట్, కాకినాడ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.